ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ    మాతృదేవోభవ ! పితృదేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ !    సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డా॥ ప్రణవ్ పండ్యా**
సంపాదకులు
**బి.సి.హెచ్.వి. సుబ్బారావు (అశ్విని)**
ఉప సంపాదకులు
**ముక్కామల రత్నాకర్**
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

**సంపుటి 20 - సంచిక 01**
**జూన్ 2015**

పత్రిక అందనివారు మరియు పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు ఈ క్రింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**


## జీవనసాధన

జీవనసాధన గురించిన నిజాలు, తథ్యాలు తెలుసుకోవడం చాలా అవసరం. అసలు ఈ జీవనసాధన యొక్క బీజం(మూలం) ఏంటి, అది ఆచరించడం వల్ల వచ్చే ఫలితం ఏంటి అనేది తెలియాలి. ఎక్కడ్నుంచి మొదలుపెట్టాలి, ఎక్కడ ముగించాలి అనేది ప్రతీ సాధకుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. పనికి, దాని కారణానికి ఉన్న సంబంధం తెలుసుకోకుండా ముందుకు సాగేవాడు తప్పు చేస్తున్నాడు. ప్రయాణం మొదలుపెట్టి, అలా నడుచుకుంటూ వెళ్ళిపోతే సరిపోదు, సరైన దారి కూడా తెలియాలి. అదేవిధంగా జీవనసాధన చేయడంతో పాటు సాధనా విధానం గురించి కూడా సమగ్రంగా తెలియాలి.

జీవనసాధనకి ఒక పరిధితో పాటు కేంద్రం కూడా ఉన్నది. కేంద్రం మీద చేసే కృషి వల్ల పరిధి కూడా దానంతటదే నిలకడగా ఉంటుంది. పరిధిని స్థిరపరచడానికి విడిగా వేరే ప్రయత్నమేమీ చేయక్కర్లేదు. కేంద్రమే పరిధిగా విస్తరిస్తూంటుంది. ఈ సందర్భంలో అసలు కేంద్రమేంటి? పరిధేంటి? అనే ప్రశ్నలు రావడం సబబే. సద్జ్ఞానమే కేంద్రం, సదాచారం దాని పరిధి. సద్జ్ఞానము ప్రారంభము, సదాచారము దాని పరిణామం; సద్జ్ఞానము బీజం, సదాచరణ దాని ఫలితం.

సదాచరణ అనేది అజ్ఞానంతో పుట్టదు. తెచ్చిపెట్టుకున్న సదాచరణ నిజమైన సదాచరణ అవ్వదు. అదొక మిథ్యా పొర, దాని తెర చాటున దురాచరణ అణగి ఉంటుంది. చీకటిని పూర్తిగా తొలగించాలి. దురాచరణ సదాచరణ పరస్పర విరుద్ధమైనవి, కాని దురాచరణను పూర్తిగ నిలువరించి సదాచరణను ప్రవేశింపజేయాలి, విస్తరింపజేయాలి. సద్జ్ఞానమే సదాచారానికి మార్గం సుగమం చేసి జీవితాన్ని సుగంధభరితం గావిస్తుంది.

కావున సద్జ్ఞాన సాధనే నిజమైన జీవనసాధన. ఇదే వ్యక్తిత్వాన్ని ప్రకాశింపచేస్తుంది. సద్జ్ఞానం ఉదయించగానే అజ్ఞానం, మోహం వాటంతటవే తొలిగిపోతాయి. దానితో రాగద్వేషాలు నశిస్తాయి. సదాచరణ విస్తరణతో వ్యక్తి మరియు అతని వ్యక్తిత్వం, రెండూ ప్రకాశిస్తాయి. జీవనసాధన చేసే సాధకుడు పరిశుద్ధుడు, బుద్ధుడు, ముక్తుడుగా భాసిస్తాడు.

*– అఖండజ్యోతి, మే 2011*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

**స్వార్థంతో చేసెడి ఉపకారం వ్యర్థం**

# విషయసూచిక


1. **సంపాదకీయం :** జీవనసాధన 3
2. **విషయసూచిక-సద్గురువాణి : జిజ్ఞాస** 4
3. **వేదమంత్రం :**
సుఖం భౌతికమైనది - సంతోషం మానసికమైనది 5
4. **యుగనిర్మాణ చిత్రావళి-3 :**
బుద్ధం శరణం గచ్ఛామి 6
5. **చేతనత్వవిజ్ఞానం-2 :**
ఆలోచనల శక్తి యొక్క అనంతమైన సామర్థ్యం 7
6. **అశ్వమేధం-4 :** యజ్ఞాలకు రాజు అశ్వమేధము 9
7. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 36 :**
ఆశీస్సులు, వాగ్దానాలు 11
8. **కర్మకాండ ఎందుకు-ఎలా? - 3 :**
పృథ్వీపూజనము యొక్క తాత్పర్యము 14
9. **జీవనసాధనకు బంగారుసూత్రములు-3 :**
ధర్మధారణ యొక్క వ్యావహారికత 17
10. **అతీంద్రియవిజ్ఞానం-3 :**
కల్పనలు సజీవము-సక్రియము - 2 20
11. **కబీర్‌దాస్ జయంతి ప్రత్యేకం:** ధార్మికతలోని
అభిప్రాయభేదాల సమన్వయకర్త సంత్ కబీర్ 24
12. **బోధ కథ :**
గాయత్రీ భక్తి - మానవుని పంచమపురుషార్థము 29
13. **మనం - మన ఆరోగ్యం :**
చిరయవ్వనం యొక్క రహస్యం 33
14. **మానవీయ శరీరంలో ఉన్న వశీకరణ సామర్థ్యం** 35
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి:**
మానవ శరీరము యొక్క అసలైన సంపదలు-2 36
16. **అంతర్జాతీయ "యోగా" దినము 21 జూన్ 2015** 39
17. **నా వారితో నా మాట :** జీవితం వివేకవంతంగా
సాగాలి-మృత్యువు వైరాగ్యపూరితమై ఉండాలి 41
18. **ఆయుర్వేదవైద్యం-2 :** అరటి గుణాల ప్రయోగం 44
19. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-13** 46
20. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు 48
21. **9 రోజుల సంజీవిని సాధనా శిబిరముపై
నివేదిక మరియు ప్రవచనముల పాఠము** 49




## సద్గురు వాణి

### జిజ్ఞాస

జిజ్ఞాస అంటే విషయములను గురించి తెలుసుకోనే ఇచ్ఛ. జ్ఞానమును పొందేందుకు ఇది మొదటి మెట్టు. ఎవరి మనస్సులో నేర్చుకోవాలనే తపన ఉంటుందో అతని మెదడు ఒక అయస్కాంతం వలె తయారవుతుంది. దాని ద్వారా అతనికి కావలసిన విషయము అతని ముందుకు వస్తుంది. నిఖిల విశ్వ బ్రహ్మాండంలో అనంతమైన జ్ఞానం నిండి ఉన్నది. దానిలోనుంచి వ్యక్తి జిజ్ఞాస దేనిమీద ఉన్నదో దానిని పొందవచ్చు. నేర్చుకునే కోరిక లేకపోతే ఎవరు ఏదీ నేర్చుకోలేరు. అందువలన నేర్చుకోవాలనే జిజ్ఞాస పెంపొందించుకోవటం అవసరం.

*- అనువాదం: ముక్కామల రత్నాకర్*


## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ.5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.



**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


మాటసాయం కూడా ఉపకారమే

వేదమంత్రం

# సుఖము భౌతికమైనది - సంతోషం మానసికమైనది

**ఉదుత్తమం ముముగ్ధినో వి పాశం**
**మధ్యమం చృత అవాధ్యమాని జీవసే ॥**

**(ఋగ్వేదం 1/25/21)**

**భావార్థం :** పుత్రేషణ, విత్తేషణ, లోకేషణ మనల పతితుల చేసి దుఃఖం కలిగిస్తాయి. అందుకే వీటినుండి విముక్తి పొందాలి.

**సందేశం :** ప్రపంచంలోని ప్రాణులన్నీ సుఖాన్నే కోరుకుంటాయి, సుఖాన్ని దినదినాభివృద్ధి చేసుకోవాలని ప్రయత్నిస్తుంటాయి. ఎక్కువ సౌకర్యాలు ఉంటే ఎక్కువ సుఖంగా ఉంటామని భావిస్తారు.

నీతితోగాని, అవినీతితోగాని ఉచితానుచితాల మరచి ప్రపంచంలో తమకు కావలసినవన్నీ పొందాలనుకుంటున్నారు. వివేకహీనులై భోగవిలాసాలలో మునిగి డొల్ల అయిపోయి సుఖాన్ని అనుభవించగలిగే సామర్థ్యాన్ని పోగొట్టుకుంటున్నారు.

భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతి సుఖానికన్నా సంతోషానికి, ఆనందానికి ప్రాముఖ్యతను ఇస్తుంది. సుఖం, సంతోషములకు ఆకాశపాతాళం మధ్య ఉన్నంత అంతరమున్నది. సుఖము భౌతికపరమైనది. సంతోషం ఆధ్యాత్మికమైనది, అనుభూతి పరమైనది. మనిషి ఎల్లప్పుడూ ఆత్మసంతోషాన్ని, ఆనంద ప్రాప్తిని కోరుకోవాలి. ఒక్కొక్కసారి తన సుఖాన్ని త్యాగం చేసి ఓ రోగి సేవలో రాత్రింబవళ్ళు కష్టపడితే, దానివలన కలిగే ఆత్మసంతోషాన్ని వర్ణించలేము. సంతోషం మనఃస్థితిమీద ఆధారపడి ఉంటుంది, వస్తువుల మీద కాదు. ఒక్కొక్కసారి అత్యంత సంపన్నుడు దుఃఖాలలో మునిగి తేలుతుంటే పేదవాడు సుఖంగా, సంతోషంగా ఉండటం మనం చూస్తున్న విషయమే.

ఈనాడు అనేకమంది వ్యక్తులు ఈ మాయాజాలంలో ఇరుక్కుని సుఖంకొరకు చేయకూడని పనులు చేస్తున్నారు. ఇటువంటివారు ఇతరులను లెక్కచేయరు, ఇతరులకు దుఃఖాన్ని మిగులుస్తువుంటారు. ప్రపంచంలో వస్తువులు పరిమితంగానే ఉన్నాయి. స్వార్థపరులు, బలవంతులు బలహీనులను దోచుకుంటారు. ఇలా చేసే వారందరినీ అవినీతిపరులు, అవకాశవాదులు, సమాజపీడకులు అని అనవచ్చు. ఇట్టివారు చాలా సుఖంగా ఉన్నట్లు కనపడవచ్చు. అన్ని సుఖ సౌకర్యాలు ఉన్నప్పటికీ వారు సుఖాన్ని ఆస్వాదించలేకపోతారు. వారి పిల్లలు, కుటుంబసభ్యులు వంచితులవుతారు. చివరికి నలువైపులా అపకీర్తి మాత్రమే మిగులుతుంది.

ప్రతివ్యక్తికి తన ప్రతిభ, సామర్థ్యాలను బట్టి సుఖ సౌకర్యాలను పెంచుకునే స్వాతంత్ర్యం ఉండాలి. అప్పుడు అది ఆదర్శ సమాజమవుతుంది. ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వ్యక్తి ఎదగాలి, ఇతరులకు సాయపడగలగాలి. ఇలా జీవించే వాడి జీవితం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందో! ఆత్మబలమే ఇలా ప్రేరేపించగలదు. ఎవరు ఎంత ఆత్మశక్తి కలిగి ఉంటారో వారు అంతగా మాయమోహములతో నిండిన భవబంధనాలను త్రెంపివేసికొనగలుగుతారు.

★★★

## పండుగలు

**జూన్ 2015**

| | |
|---|---|
| 02-06-2015 | సంత్ కబీర్‌దాస్ జయంతి |
| 13-06-2015 | కూర్మ జయంతి |

**జులై 2015**

| | |
|---|---|
| 14-07-2015 | గోదావరిపుష్కర ప్రారంభం |
| 18-07-2015 | పూరి జగన్నాథస్వామి రథయాత్ర / రంజాన్ |
| 27-07-2015 | శయన (తొలి) ఏకాదశి |
| 31-07-2015 | వ్యాసపూర్ణిమ / గురుపూర్ణిమ |

**యుగశక్తి గాయత్రి**
**మాసపత్రిక చదవండి !**
**చదివించండి !!**

**ఆధ్యాత్మిక ఎదుగుదలకు ప్రశాంతత కావాలి**

## యుగనిర్మాణ చిత్రావళి-3

# బుద్ధం శరణం గచ్ఛామి



ఒకానొక కాలంలో భారతీయులే తమ ఆదర్శాలను, బుద్ధికుశలతను, మర్యాదలను మరచిపోయిన దుస్థితి ఏర్పడింది. దీనితో మత ధార్మికత మతాంతర ధార్మికత, సంప్రదాయాలనెడి వరద తాకిడికి గురియై, ఆయా మతాంతర ధర్మాలు, సంప్రదాయాల నుండి (వర్షించిన) పుట్టిన అనేకానేక (గ్రుడ్డి) అంధవిశ్వాసాలు, పరంపరలు, కీటకాల వలె ఈ ధర్మాన్ని ఆవహించాయి. ప్రతిఫలంగా యజ్ఞాలలో పశుబలి చోటు చేసుకున్నది. ఆధ్యాత్మికతకు అర్థం-'ఆత్మకళ్యాణం' కాక; కోరికల నీడేర్చుకొనుట అనెడిది స్థిరపడింది. వందల కోట్ల దేవీదేవతలు (ఆవిర్భవించారు) పుట్టుకువచ్చారు. వీరందరికి ఎవ్వరి పూజలు, పునస్కారాలు వారికి ఏర్పాటయ్యాయి. ఇట్టి అనాచార దుష్టసంస్కృతులు వరదలా ఈ భువిపై వ్యాప్తిజెందుటకు కారణం "ధర్మము" యొక్క వాస్తవిక రూపం ఛిన్నాభిన్నమైపోవుటయే.

ఇట్టికాలమందే భగవాన్ బుద్ధుడు జన్మ తీసికొనుట జరిగింది. ధర్మం పేరిట జరుగుచున్న ఈ దుష్టకార్యాలను చూసిన ఆయన హృదయం మిగుల వ్యాకులతకు లోనయ్యింది. దీనిని ఇక ఎంతమాత్రం పెంచి పోషించరాదని ఆయన ఒక దృఢ సంకల్పాన్ని తీసుకున్నారు. "అజ్ఞానంతో నిండిన ఇట్టి సంప్రదాయాలను, పనులను గ్రుడ్డిగా నేను కొనసాగించను, అనుసరించను. నా బుద్ధి, వివేకాల ఆధారంతో సత్యమైన ధర్మాన్ని మాత్రమే అనుసరిస్తాను. అట్లే అజ్ఞానాంధకారంలో మునిగివున్నవారికి తగిన శిక్షణనిచ్చి జ్ఞానమార్గాన్ని తెలియజేసెద."

పై నిశ్చయాలతో ఆయన రాజరిక వైభవాలను, విలాసపూరిత జీవనాన్ని పరిత్యజించాడు. తదుపరి ఆధ్యాత్మిక సత్యాలను శోధించుట కొరకై కఠోర తపస్సు మరియు సాధనలను చేపట్టెడి దిశగా ప్రపంచంలో తిరుగుచూ వివేకాన్ని జాగృతి నొందించుటకై తన కృషిని ప్రారంభించాడు.

ప్రక్కనున్న చిత్తరువులో ఆయన ప్రజలకు ధర్మాన్ని ప్రబోధిస్తున్నట్లు చిత్రించబడింది. "వైదిక హింసను వ్యతిరేకిస్తూ, దానిని ఖండిస్తూ, యజ్ఞాలలో పశుబలిని వ్యతిరేకించారు. "ప్రాణులన్నింటిలోనున్నది ఒకే ఆత్మ - చేతనారూపంలో విహరించుచున్నది. కావున జీవహింస పాపమే" అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ జనులు "పశుబలి ధర్మం" అన్నారు. దీనికి జవాబుగా ఆయన, "ఐనచో మీరు అట్టి ధర్మాన్ని అంగీకరించకండి" అన్నారు. తిరిగి జనులు "ధర్మం వేదాల ఆధారంగా వచ్చింది" అనగా జవాబుగా ఆయన "అట్టి వేదాలను తిరస్కరించండి" అన్నారు.

అప్పుడు జనులు "వేదాలను భగవంతుడు తయారు చేశాడు'' అనగా, జవాబుగా ఆయన ''అట్టి భగవంతుడిని గౌరవించకండి! న్యాయం, వివేకం మరియు ఔచిత్యాలతో కూడినదే అన్నింటికన్నా గొప్పధర్మం. దీనికి భిన్నమైన దానిని బోధించెడి శాస్త్రాలను కూడా తిరస్కరించండి. వివేకమే అన్నింటికన్నా మిన్నయైన శాస్త్రము. ప్రపంచంలోని ప్రాణులన్నీ బుద్ధితో ఉంటున్నాయి. అనగా ప్రతి మనిషి ఉచితానుచితాలనెరిగి నిర్ణయం తీసికోవాలి. వివేకదృష్టితో కూడిన పరీక్షకు నిలువని వానిని కొంచెమైన అనుసరించరాదు. ఆత్మను కష్టాలనుండి, బాధలనుండి రక్షించుటకై అందెడి సలహాలు సూచనలు పిన్నల నుండి వచ్చిననూ తప్పక స్వీకరించుట మన ధర్మం. ఆత్మను పతనోన్ముఖ మార్గం వైపు మరల్చెడి శాస్త్రీయ సూచనలను లేక ఆజ్ఞలను గౌరవించరాదు."

అధిక సంఖ్యలో జనులు బుద్ధుని అనుయాయులుగా మారారు. చూస్తూ చూస్తూ ఉండగానే ఆలోచనలలో వెలుగుతో కూడిన పరివర్తనాభూమిక తయారైంది. వేలకొలది బౌద్ధభిక్షువులు ధర్మప్రచారానికై సంసిద్ధులయ్యారు. వీరికి కూడా బుద్ధుడు ఇదే ఉపదేశాన్ని అందించాడు. "భిక్షువులారా! నేను ప్రవచించిన పరంపరానుగత పలుకులు శాస్త్రానుగతమైనవి. ఎవరైనా భిన్నంగా పలికినచో అట్టి దానిని స్వీకరించకండి. మేము అందంగా ఉన్నాం అన్న దాని ఆధారంగాగొని మీ యొక్క శ్రద్ధాసక్తుల ద్వారా నిజాన్ని తెలుసుకోండి. మీ హృదయం, మస్తిష్కం లేక అంతర్వాణి దేనిని వివేకవంతంగా గ్రహిస్తుందో దానినే సత్యంగా గ్రహించండి" అన్నారు.

ఈ యుగంలో కూడా సర్వత్రా పరంపరానుగతంగా మరియు వికృతంగా నిత్యము మనము ప్రస్తుతించెడి గ్రుడ్డినమ్మకాలను గౌరవించవలదు. కేవలం మీ బుద్ధిని ఉపయోగించి, వివేకాను సారం అనుసరించదగ్గవి అన్నవానినే అనుసరించుట ఉత్తమం.

*హిందీమూలం: యుగనిర్మాణ చిత్రావళి మొదటి భాగము*

*అనువాదం: శ్రీమతి ఎ. శారద*

**తన కోపమే తన శత్రువు, తన శాంతమే తనకు రక్ష**

చేతనత్వ విజ్ఞానం-2

# ఆలోచనల శక్తి యొక్క అనంతమైన సామర్థ్యం

సమున్నతమైన జీవనానికి ఆధారం సదాలోచనలే. ప్రకాశం, వేడి, ధ్వని, విద్యుత్తు కంటే అధిక శక్తివంతమైనవి ఆలోచనలు. ప్రాణశక్తి యొక్క స్ఫురణే ఆలోచనలు. ఆలోచనల శక్తి కాలాతీతమైనది. ఆలోచనల వేగం కాంతి కన్నా ఎక్కువ. ఆలోచనల శక్తితో మనం విశ్వంలోని ఏ బిందువుకైనా వెళ్ళి ఒక సెకండు లోపల తిరిగి రాగలము.

సామాన్యంగా మనిషి ఆలోచనాశక్తిని ఉపయోగించడు. ఆలోచనలలోని ప్రాణశక్తి వలన శక్తి ఉత్పన్నమవుతుంది. ఇది మూడు రకములుగా ఉంటుంది. మంద, మధ్యమ, ప్రచండ. ఇష్టం వచ్చినట్లు ముక్కలు ముక్కలుగా ఆలోచించే దానికి బలం, వేగం మందంగా (తక్కువగా) ఉంటుంది. దీని ప్రభావం కొంతదూరం వరకే ఉంటుంది. అత్యల్పంగా ఉంటుంది. సగటు వ్యక్తుల ఆలోచనాశక్తి మాధ్యమంగా ఉంటుంది. చదువుకోవడానికి, సంపాదనకు ఈ శక్తి ఉపయోగపడుతుంది.

ఏ విషయంలోనైనాసరే లోతుగా వెళ్ళే ప్రవృత్తిని 'మూల గ్రాహి' ప్రవృత్తి అని అంటారు. లోతుగా ఆలోచించాలంటే తన సంపూర్ణ ధ్యానశక్తిని వినియోగించాలి. దీనితో ప్రాణశక్తి యొక్క విశేషమైన స్ఫురణ జరుగుతుంది. చాలాసేపు ఒకే విషయంపై ఆలోచించగలిగితే, వికసించిన ఇచ్ఛాశక్తితో కలపబడిన ఆలోచనల వలన మస్తిష్కం, హృదయం బాగా పనిచేస్తాయి. ఇలా చేయడం వలన దాని ప్రభావం లోతుగా ఉంటుంది. అప్పుడు అది ఆధ్యాత్మికశక్తి అవుతుంది, దాని పరిణామం శీఘ్రంగానే ప్రాప్తిస్తుంది. ప్రచండమైన ప్రభావశీలి ఆలోచనలలో ప్రాణశక్తి యొక్క ప్రభావమే ఉంటుంది. మనస్సును అన్ని ప్రక్కలకు పోనివ్వకుండా ఏదో ఒక విశేష బిందువుపైన, ఏదైనా ఆదర్శం పైన లేదా ఏదైనా విశేషం పైన కేంద్రీకరించితే అదే ఆలోచనల యొక్క ఆకాంక్షల యొక్క కేంద్రబిందువు అవుతుంది. విశ్వాసం, ఆలోచన, కర్మల త్రివేణి ప్రచండ మస్తిష్క ఊర్ధ్వరూపంలో ప్రవహిస్తుంది. అది సృజనాత్మక పద్ధతులలో అనుభూతుల ఆధారంపై జరుగుతుంది. అది ప్రబలమైన అవరోధాలను దాటగలదు. ఈ త్రివేణి వ్యక్తిత్వాన్ని దివ్యంగా, పవిత్రంగా చేస్తుంది.

ప్రాణశక్తి యొక్క అయస్కాంత విద్యుత్ప్రవాహమే ఆలోచనలకు ప్రచండశక్తిని ఇస్తుంది. ప్రాణమును మానవీయ వ్యక్తిత్వమునకు ఆధారమని చెప్పవచ్చు. ఈ శక్తిని నిర్ధారిత లక్ష్యం వైపు వినియోగిస్తే అది లక్ష్యాన్ని ఛేదిస్తుంది. వికసించిన ప్రాణశక్తి సదుపయోగం ఆలోచనలకు శక్తిని ఇచ్చి ప్రభావితం చేస్తుంది.

పరధ్యానం, బద్ధకం, అస్తవ్యస్థత, సోమరితనం, నిరుత్సాహం ఉన్నటువంటి మనోభూమిలో శక్తివిహీనమైన ఆలోచనలు మాత్రమే ఉత్పన్నమవుతాయి, వాడిపోతాయి. తనకు తానే ఏమి చేసుకోలేనివాడు ఇతరులకు ఏమి చేయగలడు?

ఏకాగ్రతపూర్వకముగా, తీవ్రమైన ఇచ్ఛాశక్తితో చేసిన ఆలోచనలశక్తి ఆచరణతో జోడింపబడినప్పుడు ప్రభావం చూపిస్తాయి. ఈ సమ్మిళిత శక్తి సద్భావాలతో ప్రేరేపింపబడితే సత్ప్రవృత్తులు పురికొల్పుతాయి. దుర్భావములతో జోడింప బడినట్లయితే పతనాన్ని కలిగిస్తాయి.

చేసేపనిలో అభిరుచి ఉన్నట్లయితే ఏకాగ్రత, మనోయోగం సంభవమవుతుంది. దార్శనికులు, వైజ్ఞానికులు ఒకే విషయంపై చాలాసేపు ఆలోచించే ప్రవృత్తి మరియు సామర్థ్యం కలవారై సముద్ర లోతులలో లభించే మణిమాణిక్యాల వంటి విలువైన ఫలితాలను పొందగలుగుతారు.

### ఆలోచించే పద్ధతిని మార్చుకుని చూడు

ఎవరైతే తమ జీవితాన్ని నిరర్ధకమని భావిస్తారో వారి శరీరం, మనస్సు ఎప్పుడు ఆరోగ్యంగా ఉండవు. జీవితానికి సార్థకత లేదనుకుంటే మనిషి జీవితం జీవశ్చవంతో సమానం. వ్యక్తిలో నిరాశ, ఆనందం లేకపోవడం అనే స్థితిలో జీవితం భారం అవుతుంది. అటువంటి స్థితిలో నీరసించిపోయి ఎటువంటి పని చెయ్యలేడు. మానసిక పరాధీనత వ్యక్తిత్వ వికాసం యొక్క అన్ని ద్వారాలను మూసివేస్తుంది.

**ఏ పని చేస్తున్నామో ఆ పనిలో లీనమై ఏకాగ్రతతో చెయ్యాలి**

నిరాశతో ఉన్న వ్యక్తులను వైజ్ఞానికులు పరిశీలించినప్పుడు వారిలో ఎక్కువమంది విదురులు (భార్యపోయినవాడు), విధవలు ఉన్నారు. వారిలోని బాధ వారి రోగనిరోధకశక్తిని చెడుగా ప్రభావితం చేసింది. ఇట్టి స్థితిలో మూడు నెలలు ఉన్నట్లయితే టి.బి.లాంటి వ్యాధులు దరిచేరినట్లు గుర్తించారు. ప్రియజనుల మృత్యువు సంభవించినప్పుడు కోల్పోయిన అనుబంధం కారణం వలన వారు రోగములబారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇంతేగాక వారి రక్తంలో కార్టిజోన్ అనే విష రసాయనపదార్థాన్ని కూడా గుర్తించారు. ఇలాంటివారు ఉత్సాహపూర్వకమైన విధేయాత్మక ఆలోచనలు (Positive Thinking) చేసినట్లయితే అనుకూల పరిణామాలు ఉత్పన్నమవుతాయి. ఇటువంటివారు స్వ-సంకేతం (Auto Suggestion) ద్వారా ఆశాజనక ఫలితాలను పొందవచ్చు.

మనిషి ఎలా ఆలోచిస్తాడో అలా తయారవుతాడు. చికిత్సా జగత్తులో ఈ సిద్ధాంత ప్రయోగాలు జరుగుతున్నాయి. అనేక రోగాలకు ఇప్పటికీ మందులేదు. ఇలాంటి స్థితిలో స్వ-సంకేతం ద్వారా (విధేయాత్మక ఆలోచనల ద్వారా) చాలా ఉపయోగం ఉంటుంది.

### ఆలోచనలలో ఉన్న రచనాత్మకశక్తి

ఆలోచనలలో మంచి సామర్థ్యం ఉన్నది. తనకు, ఇతరులకు పరిణామం, ప్రతిక్రియ ఉత్పన్నం చేస్తుంది. ప్రాణశక్తి అయస్కాంత విద్యుత్ప్రవాహంతో కలిసినప్పుడు దాని శక్తి అధికమవుతుంది. ప్రతి వ్యక్తిలో ఈ సామర్థ్యం ఉంటుంది. దీనిని ఉపయోగించుకునే వారిని వ్రేళ్ళమీద లెక్కించవచ్చు.

ప్రతి మనిషికి అతని ప్రత్యేక మానసికజగత్తు ఉంటుంది. దీనిలో అతని ఆలోచనలు, కల్పనలు ఉంటాయి. ఎవరైన ఒక వ్యక్తి ఒక సమూహంలో మాట్లాడితే ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా అర్థం చేసుకుంటుంటారు. ఏ భావంతో ఆ మాటలు చెప్తున్నారో ఆ భావాన్ని పట్టుకోరు. వారు తమకు అప్పటికే ఉన్న జ్ఞానాన్ని బట్టి గ్రహిస్తుంటారు. వస్తుతః ఆలోచనలకు ఒక ఆకారం ఉంటుంది. మనం వ్యక్తులపై, ఏదో విషయంపై, వస్తువులపై ఆలోచనలు చేస్తుంటాము. ఈ ఆలోచన ఒక ఆకారాన్ని పొందుతుంది (Thought form). 'ఆకారం' దేనిని గురించి ఆలోచిస్తున్నామో అక్కడికి చేరుతుంది. ఈ ఆలోచనల వెనుక ఏదైనా ఒక సంకల్పం ఉన్నట్లయితే అది జరిగేటట్లు దోహదపడుతుంది. ఆ సంకల్పం పూర్తైతే ఇక దానిని గురించిన ఇచ్ఛ ఉండదు.

కొందరి రచనాశక్తి అత్యంత శక్తివంతంగా ఉంటుంది. ఎందుకంటే అతని మనోరచనలన్నీ (అనుకున్నవన్నీ) కార్యాన్వితం అవుతుంటాయి. కొందరు వ్యక్తులు ఇప్పుడు ఏదో ఒక వస్తువుపై ఆలోచన చేస్తారు. తరువాత దీనిని వదిలిపెట్టి ఇంకేమిటో కావాలంటారు. రెండు రకాల ఆలోచనలు ఢీకొట్టుకుంటాయి. అదీ జరగదు, ఇదీ జరగదు. మనం నిషేధాత్మక (Negative) ఆలోచనలు చేస్తుంటే మనకు ఇష్టంలేని పరిణామాలను తీసుకొస్తాయి.

మనస్సును, ప్రాణమును సవ్యంగా ఉపయోగించుకోవాలి. సఫలవంతమైన, సమున్నతమైన, మంగళమయమైన లాభములను ప్రాప్తించుకోవాలి.

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 22 (1.4) నుండి*
*అనువాదం: ముక్కామల రత్నాకర్*

## గుడ్డిగా అనుకరించుట మానండి

*ఒక సాధువు కుటీరంలో ఒక పిల్లి నివసింపసాగింది. ఇది అల్లరిపిల్లి. చంచలస్వభావం కలది. ఇది తరచుగా కుటీరమంతా కలయతిరుగుతూ అల్లరిచేస్తూ కుటీరంలో ధ్యానాన్ని భంగపరచసాగింది. కానీ సాధువు దయాళు వగుటచే పిల్లిని కుటీరం నుండి తరిమివేయక, మధ్యస్థ మార్గంగా జప సమయమందు దానిని ఒకచోట బంధించే వాడు. ఈవిధంగా పిల్లివలన కరిగే ఆటంకం దూరమైంది. భజన నిరాటంకంగా జరుగసాగింది.*

*దీనిని చూస్తున్న శిష్యగణానికి ఒక అనుమానం కలిగింది. పిల్లిని సమీపంలో కట్టి ఉంచిననే గాని సాధన సిద్ధింపదనెడి గ్రుడ్డినమ్మకం కలిగింది. కొంతకాలానికి పెద్ద సాధువు మరణించగనే ఆయన శిష్యగణమంతా పిల్లిని పట్టి బంధించి తదుపరి భజన చేయాలి అనెడిది అంధ సంప్రదాయంగా మారింది. పూర్వపు వివేకహీనపు పరంపరలను విడచిపెట్టుట ఉత్తమం.*

*- యుగనిర్మాణ యోజన ఫిబ్రవరి 2015*
*అనువాదం: ఎ. శారద*

**కృతజ్ఞత కలిగి ఉండుట ఒక దైవీ లక్షణం**

అశ్వమేధం - 4

# యజ్ఞాలకు రాజు అశ్వమేధము

'భువనస్యనాభిః' అని చెప్పబడితే యజ్ఞము పురుషార్థ రూపములో ప్రత్యేక క్షేత్రములో వ్యాపించి ఉంది. "యజ్ఞో వై విష్ణుః" యజ్ఞమే విష్ణువు అని చెప్పుటవల్ల సృష్టికర్త బ్రహ్మ ఉత్పత్తియైన దివ్యనాభి యజ్ఞము అని అర్థము. ఈవిధముగా ఉత్పత్తియైన సృష్టికర్త బ్రహ్మకి సృష్టిలో యజ్ఞీయ అనుశాసనము, పురుషార్థమును జాగ్రత్తచేయుమని ఆదేశింపబడినది.

సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అని యజ్ఞీయ క్రమమును అనుసరించి సృష్టియొక్క పోషణ, రక్షణ, వికాసము చేయుట మొదలెట్టారు. సముద్రము, మేఘాలు, పర్వతాలు, నదులు, వనస్పతులు యజ్ఞీయ అనుశాసనాన్ని పాటించటం మొదలెట్టాయి. పశు, పక్షి, క్రిమి కీటకాదులు కూడా తమ తమ సామర్థ్యానుసారము ప్రకృతికి సహకరించుట (సంగతీకరణము) అనే యజ్ఞీయ కార్యక్రమంలో తమ వంతు భారాన్ని పంచుకున్నాయి.

మనిషి కూడ దివ్య అనుశాసనాన్ని పాటించే దేవపూజన రూపములో యజ్ఞీయ కార్యక్రమాలను స్వీకరించాడు. పరస్పర ప్రేమ సహకారాలతో నివసిస్తూ సహజీవనాన్ని సిద్ధింప జేసుకున్నాడు. కరుణ వల్ల భూతదయ, దానాది కార్యక్రమాలు మొదలెట్టాడు. ఈవిధమైన యజ్ఞమయ జీవన ఫలశృతి సత్యయుగ వాతావరణమనే దివ్య వరదానము అతనికి చాలాకాలము వరకు లభిస్తూ వచ్చింది. కాలప్రవాహంలో యజ్ఞీయ అనుశాసనము నుండి విచలితమైన జనమానస పరిష్కారం కొరకు, చిన్నాభిన్నమైన సమాజాన్ని తిరిగి యజ్ఞీయ అనుశాసనములోనికి తీసుకురావడానికి సమయానుసారముగా అనేక సఫల ప్రయోగాలు జరుగుతూ వచ్చాయి. ఉదాహరణకుః దేవవృత్తుల వికాసం కొరకు దేవయజ్ఞాలు; మనుషులు, అతిథుల స్నేహసమ్మానము కొరకు నృయజ్ఞము; అనేక జీవజంతువుల పోషణ కొరకు భూతయజ్ఞము-బలివైశ్యయజ్ఞ క్రమము; పోషక ప్రవృత్తుల వికాసము కొరకు విష్ణుయజ్ఞము; మనుష్యజాగరణ కొరకు రుద్రయజ్ఞము; అనాచార దమనము కొరకు చండీయజ్ఞము మొదలైనవి చేస్తూ ఉండేవారు. పశుధన సంవర్ధనము కొరకు గోమేధము, అజమేధము మొదలైనవి చేసేవారు. మేధ అనే శబ్దం యజ్ఞముయొక్క పర్యాయవాచకమే. సమాజంలో సత్ప్రవృత్తుల సంవర్ధన కొరకు వాజపేయయజ్ఞం; రాజనీతిక అనుశాసనం స్థాపించటానికి రాజసూయయజ్ఞం; సమస్త రాష్ట్రాన్ని సంఘటితపరచి శక్తివంతము చేసి ముందుకు నడుపుటకు అశ్వమేధయజ్ఞాల వర్ణన లభిస్తుంది. అశ్వమేధము ఈ యజ్ఞాలన్నిటిలో సర్వశ్రేష్ఠముగా చెప్పబడి యజ్ఞముల రాజుగా వర్ణింపబడింది. అందుచేత అశ్వమేధయజ్ఞానుష్ఠానము ఒక సామాన్య కర్మకాండ కాదు అని స్పష్టమవుతుంది. అలాగే ఒక రాజు యొక్క రాజ్యకాంక్షను పూర్తి చేసే అహంకారముతో నిండిన కృత్యము కూడా కాజాలదు. ఋషుల దృష్టికోణమును అర్థము చేసికొన్నప్పుడే ఈ మహత్తర యజ్ఞానుష్ఠానము యొక్క స్వరూపము అర్థమవుతుంది.

అశ్వమనగానేమి? అశ్వమనగా వాడుకలు అర్థము గుఱ్ఱము. కాని యజ్ఞపరంగా దాని విశిష్ట అర్థము వేరుగా ఉన్నది. అశ్వశబ్ద ఉత్పత్తి ఈ విధముగా ఉన్నది. అశ్+క్వన్, అశ్నుతే అధ్వానం అశ్నుతే వ్యాప్నోతి అనగా తీవ్రగతి కలది, మార్గమంతా వ్యాపించునది. మహాశనో భవతి వ అశ్వః బహు అశ్నాతీతి ఇతి అశ్వః - అనగా అధిక పరిమాణములో ఆహారము తీసుకునేది అశ్వము.

అశ్వశబ్దాన్ని జాతివాచకముగా కాక; వేదాలు గుణవాచక సంబోధనముగానే ఉపయోగించాయి అని తెలుస్తుంది. "ఇంద్రో వై అశ్వః" (ఇంద్రుడే అశ్వము). సౌర్యో వా అశ్వః (సూర్యత్వమే అశ్వము). వేదాలలో అనేకచోట్ల యజ్ఞాగ్నియే అశ్వముగా చెప్పబడి ఉన్నది. "అగిర్వ అశ్వః ఆజ్యం మేధః" - అనగా అగ్నియే-అశ్వము, నెయ్యి-మేధము. "అశ్వతో యత ఈశ్వరో వా అశ్వః అశ్నుతే వ్యాప్నోతి సర్వం జగత్ సో అశ్వం ఈశ్వరః" - అనగా ప్రపంచమంతా సంచరించి వ్యాపించే అశ్వమే ఈశ్వరుడు.

పైన చెప్పిన శాస్త్రీయ ప్రమాణాల వల్ల అశ్వ శబ్దానికి అర్థము గుఱ్ఱము అని అనుకొనుట మన అజ్ఞానము. ఈ భావనే అశ్వమేధయజ్ఞానికి సంబంధించిన అనేక భ్రాంతులకు కారణము.

మంచిని పెంచడమే మన కర్తవ్యం

"మేధ" శబ్దాన్ని అర్థం చేసుకుందాం: మేధ శబ్దము యజ్ఞము యొక్క పర్యాయవాచకము. దానికి ఒక అర్థము వధ అని కూడా ఉంది. కాని శాస్త్రాలలో ఆ అర్థములో దాని ప్రయోగము వర్జితము. అశ్వమేధములాంటి మహత్తర ప్రయోగానికి, స్థాయికి సరిపడే భావాన్నే తీసుకోవాలి. ద్వేషము, హింస, క్రూరత్వము మున్నగువాటిని శాస్త్రాలు "అయజ్ఞేయము" అన్నాయి. అందువల్ల యజ్ఞ సందర్భములో హింసాత్మక ప్రయోగాన్ని ఒప్పుకోలేము.

"మేధ" శబ్ద ఉత్పత్తి మిథ్, మిద్, మేథ్, మేధ్ ఆది ధాతువులతో సంబంధించినదిగా నిర్ణయించారు. వీటి అర్థాలు కలుసుకొనుట, కలుపుట, తెలుసుకొనుట, ప్రేమించుట, పట్టుకొనుట. మేధ అనే పదానికి-బుద్ధిబలము, శక్తి, యజ్ఞము మొదలైన అర్థాలు చెప్పబడ్డాయి. ఈ పదాన్ని యజ్ఞము, అర్పణ, రసము, సారము, పూజ్యమైన, పవిత్రమైన అర్థాలలో కూడా ఉపయోగింపబడుతుంది. వాజసనేయసంహితలోని 32 వ అధ్యాయములోని "సర్వమేధ" ప్రకరణములో మేధ శబ్దము పై అర్థాలలోనే వివరింపబడినది.

ఇప్పుడు "అశ్వమేధము" అంటే ఏమిటో తెలుసుకుందాం. పైన వివరించిన శాస్త్రీయ అర్థముల ద్వారా "అశ్వమేధము" దాని స్థాయికి తగ్గ అర్థములో తెలుసుకొనుట సులభమౌతుంది.

అశ్వము గతిశీలత, శౌర్య, పరాక్రమాల చిహ్నము. మేధా అనే పదము మేధాశక్తికి, శ్రేష్ఠబుద్ధికి ప్రతీక. అందువల్ల అశ్వమేధము యొక్క సహజ అర్థము "శౌర్యము, పరాక్రమము, కళ్యాణకరమైన మేధాశక్తుల సంయోగ సంగమము."

అశ్వము-క్షాత్రశక్తికి; మేధా-బ్రహ్మతేజస్సుకు ప్రతీక ఐనపుడు వీటి సంయోగము ఒక పవిత్ర మహత్తరమైన యజ్ఞకర్మగా మారటంలో ఆశ్చర్యమేముంది?

శ్రేష్ఠ ప్రయోజనాల కొరకు సమర్పిత పురుషార్థము, ఉత్కృష్ట ఆలోచనాశక్తుల సంయోగమే ఒక ఆదర్శ సమాజాన్ని, నూతన రాష్ట్రాన్ని నిర్మించగలదు. అందువల్ల రాష్ట్ర నిర్మాణాన్ని అశ్వమేధము అన్నారు. (రాష్ట్రంవ అశ్వమేధః - శత.13-1-6-3) శతపథబ్రాహ్మణములో అనేకసార్లు "అశ్వమేధేన యజేత్" అనే వాక్యము పునరావృతమవుతుంది. దీని అర్థము అశ్వమేధము ద్వారా పూజించండి అంటే శౌర్యము, మేధాశక్తి సంయోగముతో పూజ చేయండి. పురుష సూక్తంలో "యజ్ఞేన యజ్ఞం అయజంత దేవా" అనగా దేవతలు యజ్ఞము ద్వారా యజ్ఞమును పూజించారు. స్పష్టముగా శ్రేష్ఠకర్మలు చేయటానికి ఉద్దేశ్యాలు కూడా యజ్ఞమయముగా ఉండాలి. సాధనాలు కూడా సుసంస్కారవంతముగా ఉండాలి. క్రియాభావ సంకల్పములు కూడా యజ్ఞస్థాయిలో దేవతుల్యముగా ఉండాలి.

చేతనత్వము (మేధా) బ్రహ్మాండములో గతిశీలమయ్యే (అశ్వము) క్రమమును దృష్టిలోపెట్టుకొని శతపథబ్రాహ్మణము లోని మంత్రము 13-4-2-18, 13-5-1-5 లో సూర్యుణ్ణి అశ్వమేధము అన్నారు. ఇదేవిధముగా 11-2-5-1 లో చంద్రుణ్ణి అశ్వమేధముగా వర్ణించారు. ఇంత పెద్ద బాధ్యతను, దివ్యమేధస్సును, దివ్యపురుషార్థమును జాగృతము చేసి వాటిని కలిపి రాష్ట్రస్థాయిలో యజ్ఞీయ జీవిత విధానమును పాటించే వ్యక్తి వ్యక్తిని కలిపే అసామాన్య బాధ్యతయే అశ్వమేధయజ్ఞము. ఇంత మహాకార్యాన్ని మహాకాలుని నిర్దేశానుసారము అతని అనుచరులు నిష్ఠగా చేయుటకు పూర్తి తత్పరతతో ఉన్నారు. అశ్వమేధ అనుష్ఠానానికి అవసరమయ్యే అన్ని సాధన సంపత్తులు తయారుగా ఉన్నాయి. యజ్ఞభావనతో సుఖాలను సౌకర్యాలను వదలుకొని తమ పరాక్రమాన్ని చూపించుటకై త్యాగశీలురైన సృజనసైనికుల విజయవాహినులు తయారుగా ఉన్నాయి. యుగఋషి యొక్క ప్రచండ తపశ్చర్య దీనికొరకే చేయబడింది. గతిశీల ప్రతిభ తన పరాక్రమాన్ని యుగ ప్రజ్ఞావతరణ కొరకు ఋషి చేతన నిర్దేశానుసారము వినియోగింపబడుటకు తయారుగా ఉన్నది. ఈ అశ్వమేధిక అనుష్ఠానముల సఫల ప్రయోగము తిరిగి మన దేశానికి అఖండకీర్తి తీసుకువస్తుందని ఆశిస్తున్నాము.

★★★

## ధైర్యము - ప్రతీకారం ఒకే ఒరలో ఇమడవు

*ప్రతీకారము తనదైన అహంకారముతో సాగుతూ ధైర్యంతో ఇలా అంది - "నీవు నా వెంట సహజీవనం చేయవద్దు. నీవంటి శాంతిమూర్తితో కలిసి పయనిస్తే నా ప్రతిష్ఠ దిగజారిపోతుంది. దెబ్బకు దెబ్బ తీయుటపైననే నాకు విశ్వాసముంది" అప్పుడు ధైర్యము, ప్రతీకారము వెంట పయనించుట విరమించుతుంది. ఏకాకి అయిన ప్రతీకారము ఆనాటి నుండి అధైర్యపడుతూ యావత్ విశ్వంలో తిరుగాడుతూ, సమాజానికి అహితాన్ని చేస్తున్నది.*

*- అనువాదం: ఎ. శారద*

**అసహనం, ఆగ్రహం అనర్థాలకు దారితీస్తాయి**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-36

# ఆశీస్సులు, వాగ్దానాలు

చరణపీఠం నిర్మాణం కావడానికి పదిహేను రోజులు పట్టింది. నిర్మాణపు బాధ్యతను దళిత బస్తీ ప్రజలే వహించారు. శ్రీరామ్ మధ్యమధ్యలో అక్కడికి వెళ్ళేవారు. ఈ పనిని శ్రమదానం ద్వారా చేయడం పుణ్యప్రదమని ఆ బస్తీ ప్రజలు భావించారు. శ్రీరామ్ రాక వారిని ఉత్సాహపూరితుల చేసేది. రెట్టింపు ఉత్సాహంతో పనిచేసేవారు. శ్రీరామ్ వారికి పెక్కు మంచి విషయాలు చెప్పేవారు. "చరణపీఠానికి మ్రొక్కడం కోసం రోజూ రావాలి; స్నానం చేసి, శుభ్రమైన ఉతికిన బట్టలు కట్టుకుని రావాలి" అని ఉద్బోధించేవారు.

కరయాచౌదరి తమ సమస్యను ఇలా ఏకరువు పెట్టాడు. మాకు చిరిగినవి-పాతవి రెండు బట్టలే ఉన్నాయి. ఒకటి కట్టుకునేందుకు, రెండోది భుజంపై కప్పుకునేందుకు. వాటిని ఉతికి ఆరవేస్తే-పనిలోకి రాలేము." ఇతరులు కూడా ఈ సమస్యను శ్రీరామ్ దృష్టికి తెచ్చారు.



అందుకు శ్రీరామ్ ఇలా అన్నారు – "బట్టల కొరత తీర్చుటకై ఏర్పాటు జరుగుతున్నది. మీ కోసం నేతపరిశ్రమ స్థాపించే ఆలోచన ఉంది. అందులో పది నుండి పన్నెండు మందికి పని దొరుకుతుంది. వారు తమ కోసం బట్టలు నేయవచ్చు, బజారులో అమ్మకానికి కూడా నేయవచ్చు. దానివల్ల డబ్బు కూడా వస్తుంది."

"మాకు డబ్బు అవసరం ఏముంది? ధనవంతుల దయవల్ల మా బ్రతుకు సాగిపోతోంది" – అని కరయా అన్నాడు. శ్రీరామ్ ఇలా వివరించారు – "మరొకరి దయాదాక్షిణ్యాల మీద బ్రతకవలసిన అవసరం లేదు. కష్టపడి సంపాదించెడి వారినే దేవత కరుణిస్తుంది"

చరణపీఠం నిర్మాణమైన తర్వాత నేతపరిశ్రమపై దృష్టి పెట్టారు. రెండు చేనేత మగ్గాల కోసం శ్రీరామ్ తమ భవంతి ఎదుట నున్న స్థలాన్ని కేటాయించారు. అద్దెకు స్థలం చూచే శ్రమ తప్పింది. ఐదు మగ్గాలు తెప్పించారు. వాటిని దళిత బస్తీలలో బిగించారు. వాటిపై రాబటి రావడానికి కొంత సమయం పడుతుందని శ్రీరామ్ ఆ మగ్గాలు తీసుకున్నవారికి చెప్పారు. నేసిన బట్టలను బజారులో అమ్మిన తర్వాతనే డబ్బు చేతికి వస్తుందని ఆయన వివరించారు. వాళ్ళు పనిలేకుండా ఖాళీగా కూర్చొని ఉన్నారు. ఆలస్యంగానైనా డబ్బు వస్తుందని తెలిసి వారు సంతోషించారు.

ఆగ్రా బజారు నుండి నూలు తెప్పించి మొదటి బట్టనేశారు. సుమారు ఏడు గజాల బట్ట అది. దాన్ని చరణపీఠానికి సమర్పించి, కజలీ అవ్వకు ఇచ్చారు. ఆమెకు నా అన్నవాళ్ళు ఎవరూ లేరు. ఆమె వయస్సు 60-65 సంవత్సరాలు. కాలం చేసిన గాయాల వల్ల ఆమె వడిలి వాడిపోయింది. అలసిపోయి, ఓడిపోయి తన ఇంట్లో పడుండేది. జనం వాడి ఇచ్చిన పాత వస్తువులతో బ్రతుకు వెళ్ళదీసేది, క్రొత్తబట్ట ఆమెకు వరంలా వచ్చింది. దాన్ని తనకోసమే నేశారని తెలిసి, ఆమె పరవశించి పోయింది. ఆనందంతో పొంగిపోతూ ఆమె ఇలా దీవెన ఇచ్చింది. "మూడు పువ్వులు ఆరు కాయలుగా మీ పనులు ప్రతిఫలిస్తాయి. దేవుడు మీ కోర్కెలను తీర్చాలి."

### వారి పరిశ్రమ వారికే

శ్రీరామ్ ఈ పరిశ్రమను సుమారు సంవత్సరం పాటు నడిపారు. ఆ తర్వాత దళితబస్తీ ప్రజలతో ఒక సమితిని ఏర్పాటు చేశారు. ఆ సమితికి ఆ పరిశ్రమను అప్పగించారు. శ్రీరామ్ ప్రత్యక్షంగా పర్యవేక్షించినంత కాలం ఆ పరిశ్రమ బాగా ఫలించి పుష్పించింది. అంతేకాదు. అక్కడి ప్రజలు ఇతర పనులు కూడా ప్రారంభించారు. పొలాలకు పనికివచ్చే కొయ్య పరికరాల తయారీ, మట్టిబొమ్మల తయారీ వంటి పనుల్లో వారి శక్తి యుక్తులు పూర్తిగా లగ్నమైనాయి. ఆనందప్రకాశ్‌కూడా మూడు నాలుగు నెలలకు ఒకసారి వచ్చి ఈ పనులు చూచి వెళ్ళేవారు.

ఆనందప్రకాశ్ కారణంగా శ్రీరామ్‌కు ఆర్యసమాజ్ కార్యకర్తలతో సంపర్కం ఏర్పడింది. వారిలో స్వరాజ్య ఉద్యమంలో

**శ్రమతో, ప్రతిభతో జీవితాన్ని ప్రగతిబాట పట్టించవచ్చు**

పాల్గొంటున్న వ్యక్తులతోనే శ్రీరామ్‌కు సాన్నిహిత్యం పెరిగింది. అలాంటి వ్యక్తులలో జగన్ ప్రసాద్ రావత్, రాధేశ్యామ్‌శర్మ ఉన్నారు. వీరితో శ్రీరామ్ స్నేహం 50-60 సంవత్సరాలు కొనసాగింది. జగన్‌ప్రసాద్ ఆగ్రాలో నివసించేవారు. ఆర్య సమాజ్ కార్యకర్తయినా ఆయన దేవాలయాలకు వెళ్ళేవారు. కృష్ణాష్టమి, శ్రీరామనవమి వంటి పండుగలు జరిపేవారు.

ఆ చేనేతపరిశ్రమ బలం పుంజుకున్న తర్వాత శ్రీరామ్ రాజకీయ ఉద్యమ కార్యక్రమాలలో తిరిగి క్రియాశీలమైనారు.

పూనా పాక్ట్ తర్వాత సమాజంలో దళితుల ప్రాముఖ్యం పెరిగింది. కానీ, రాజకీయ ఉష్ణోగ్రతలో ఆటుపోటులు మాత్రం తగ్గలేదు. ప్రజలను ఖైదుచేయడం, వారికి పాఠం నేర్పి వదలిపెట్టటం అనే కార్యక్రమం 1933 మార్చినెల వరకు సాగుతూ వచ్చింది. కాంగ్రెసు సంస్థ లెక్కల ప్రకారం లక్షా ఇరవైవేల పై చిలుకు కార్యకర్తలు ఖైదు చేయబడ్డారు. శ్రీరామ్ అధికారికంగా కాంగ్రెసు సభ్యత్వాన్ని తీసుకోలేదు. స్వరాజ్య సమర సేనాని కావడంవల్ల ప్రజలు ఆయనను స్థానిక కాంగ్రెసు నాయకుడుగా పరిగణించేవారు. ఈ నిర్బంధనల పర్వంలో శ్రీరామ్ సహాయనిరాకరణ ఉద్యమాన్ని కొత్త పద్ధతిలో సంఘటితం చేయడానికి పథకం రూపొందించారు.

సహాయనిరాకరణోద్యమం 1919 లోనే ప్రారంభమైంది. చౌరాచౌరా (గోరఖ్‌పూర్)లో ఉద్యమం హింసాత్మకం కావడంతో - గాంధీజీ మధ్యలోనే దాన్ని ఉపసంహరించాడు. ఐనా 1924 వరకు ఉద్యమం ఉధృతంగా సాగింది. ముస్లింలీగ్ నాయకులు ఉదాసీనంగా ఉండిపోవడంతో ఉద్యమం చల్లబడసాగింది. ఐనా అది పూర్తిగా సమాప్తం కాలేదు. పన్ను చెల్లించకపోవడం, ప్రభుత్వ ఉత్తర్వులను పాటించకపోవడం, నిషేధించబడిన స్థలాలకు వెళ్ళడం, ఆంక్షలను ఉల్లంఘించుట వంటి చర్యలు జరిగేవి. తన నిషేధాలు పాటింపబడకపోవడంతో - ప్రభుత్వం దమనచర్యలను తీవ్రతరం చేసింది.

1932 డిసెంబరులో కృష్ణదత్‌పాలీవాల్ ఝాన్సీ కారాగారం నుండి విడుదలైనారు. ఆయన ఆగ్రా చేరగానే, ఆయనకు ఘనస్వాగతం లభించింది. శ్రీరామ్ గత రెండు నెలలలో చేసిన పని ఏమిటో ఆయనకు తెలిసింది. చరణపీఠం స్థాపన, దళితుల కోసం చేనేతపరిశ్రమను స్థాపించడం అనే చర్యలు స్వాతంత్ర్య-యజ్ఞంలో అంతర్భాగాలని ఆయన పేర్కొన్నారు. స్వాగతసభలో పాలీవాల్‌జీ శ్రీరామ్‌ను వేదికమీదకు పిలిచారు. పూలమాల వేసి, ఆయనను అభినందించారు. ఈ యువకుడు ఆగ్రాజిల్లాకు గర్వకారణం -అని ఆయన ప్రకటించారు.

స్వాగతసభ తర్వాత రాత్రిపూట ఒక సమావేశం జరిగింది. సహాయనిరాకరణ ఉద్యమాన్ని తిరిగి సంఘటిత పరచాలని నిర్ణయించారు. మరునాడు ఆ నిర్ణయం అమలు ప్రారంభ మయింది. రెండు వారాలలో సుమారు 40 సభలు జరిగాయి. ప్రభుత్వానికి పన్నులు చెల్లించవద్దని జమిందారులకు, రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ నేల మనది, మన దేశానిది, ప్రభుత్వం పరాయిది, పన్నులు వసూలుచేసే అధికారం దానికి లేదు - అని ఆ సభలలో ప్రజలకు బోధపరచారు.

1922 లో గాంధీజీ గుజరాత్‌లోని బార్డోలీని సహాయ నిరాకరణ కోసం ఎంపిక చేసివున్నారు. ఆవిధంగానే - ఆగ్రాలో కార్యకర్తలు కరావలీ తాలుకాలోని బరౌదా, ఖిలావటీ గ్రామాలను ఎంపిక చేశారు. డిసెంబరు 20 న ఆ గ్రామాలకు రావలసిందిగా రెండువారాల పాటు జరిగిన జనసంపర్క ఉద్యమంలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సన్నాహాల సమాచారం రక్షకభట(పోలీసు) శాఖకు అందుతూ వచ్చింది. ప్రజలలో ఉత్సాహం ఉప్పొంగుతోందని ఆ శాఖ గుర్తించింది. గడచిన రెండు నెలలుగా విచక్షణారహితంగా జరుగుతూ వచ్చిన నిర్బంధనల పట్ల ప్రజల మనస్సులలో ప్రతీకారభావన రేకెత్తిందని రక్షకభటులు గ్రహించారు. ఆ ప్రతీకారభావన వ్యక్తం కావడానికి ఉద్యమకారుల విజ్ఞప్తి అవకాశం కల్పించింది. డిసెంబరు 20 న లక్షమంది ప్రజలు వస్తారని, ఆ రెండు గ్రామాలు ఏకమవుతా యనీ రక్షణ శాఖ అంచనా వేసింది.

## ఖిలావటీలో రైతులు

పోలీసు ఇన్‌స్పెక్టర్ గ్రామ గ్రామంలో జరిగే సభలను నిషేధించాడు. ఉద్యమ కార్యకర్తలను, నాయకులను వెంటనే ఖైదు చేయాలని ఉత్తర్వులు ఇచ్చాడు. ప్రముఖ నాయకులు కృష్ణదత్‌పాలీవాల్, జగత్‌ప్రసాద్‌రావత్, ద్వారకాప్రసాద్, దల్‌పత్‌సింగ్, మున్షీరామ్‌గోస్వామిలు బరౌదా చేరడాన్ని నిషేధించాడు. తమ స్థలాలను విడిచి వెళ్ళకూడదని వారిని ఆదేశించాడు. బరౌదా, ఖిలావటీ గ్రామాలలో సభలు జరపకూడదని ఆదేశించాడు.

**జీవితానికి ఒక అర్థం, పరమార్థం ఉండాలి**

ఫలితంగా – డిసెంబరు 20 న సభ జరపడం కుదరదని అనిపించింది. డిసెంబరు 14 సాయంత్రం పాలీవాల్‌జీ గృహంలో సమావేశం జరిగింది. శ్రీరామ్ దానిలో పాల్గొన్నారు. ఉద్యమ నాయకులు ఏడెనిమిదిమందిలో ఎవరికీ ఏమి చేయాలో పాలుపోలేదు. ఉద్యమాన్ని విఫలం చేయడంలో ప్రభుత్వం సఫలమయిందని అనిపించింది. అందరి మాటలు విన్న శ్రీరామ్, ఆ గ్రామాలలో సభకు బదులు 11 కుండముల యజ్ఞం జరపాలని, యజ్ఞంలో ప్రజలకు తమ సందేశాన్ని వినిపించాలని, యజ్ఞం కనీసం ఐదురోజుల పాటు జరగాలని సూచించారు.

సమావేశంలో పాల్గొన్నవారందరికీ ఈ సూచన పూర్తిగా నచ్చింది. సభ కోసం జరుగుతున్న సన్నాహాలను యజ్ఞం వైపు మళ్ళించారు. సన్నాహాలకు రెండు రోజులయినా పట్టలేదు. శ్రీరామ్ యొక్క యువక దళం కొద్ది గంటలలో 11 కుండములను తయారుచేసింది. యజ్ఞంలో పాల్గొనేవారు సమిధలు, హవనసామాగ్రి, పూజాసామాగ్రి, ప్రసాదం మొదలైనవి తమవెంట తీసుకురావాలని రహస్యంగా ప్రజలకు తెలియజేయబడింది. జగన్‌ప్రసాద్‌రావత్, కృష్ణదత్‌పాలీవాల్ మున్నగు నాయకులు తమ స్థలాలను వదలకూడదు. డిసెంబరు 18 రాత్రి వారు మారువేషాలతో పొలాల మధ్య నుంచి వెళ్ళి బరౌదా చేరారు. అక్కడి ఏర్పాట్లను చూచి, సంతృప్తి చెంది తిరిగివెళ్ళారు.

డిసెంబరు 20 న ఆనందప్రకాశ్ ఆచార్యులుగా యజ్ఞం ప్రారంభమయింది. మొదటిరోజున సుమారు ఐదువేల మంది వచ్చారు. దాదాపు అందరూ తమవెంట సమిధలు, హవన సామాగ్రి తెచ్చుకున్నారు. ఉదయం మొదటి విడత ఆహుతులు పూర్తయిన తర్వాత గంటసేపు ఉపన్యాసం ఇచ్చారు. గడచిన మూడేళ్లలో వివిధ స్థలాల్లో జరిగిన అత్యాచారాలను ఆ ఉపన్యాసంలో వర్ణించారు. ఆతతాయియైన ప్రభుత్వాన్ని ప్రతిఘటించాలని, ఎట్టి పరిస్థితిల్లోను దాన్ని సహించకూడదని ప్రజలకు అర్థమయ్యేలా బోధించారు. క్రమక్రమంగా అసలు విషయానికి వచ్చి – సహాయనిరాకరణోద్యమాన్ని గురించి వివరించారు. శిస్తులు కట్టం –అని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు.

అక్కడ నియమించబడిన పోలీసు ఉద్యోగులకు ఇలా సందేశం ఇస్తారని ముందుగా తెలియలేదు. విన్న తర్వాత – శిస్తులు కట్టం అని అక్కడ శపథాలు చేయిస్తున్నారని వారు పై అధికారులకు తెలిపారు. అధికారులు పరుగుపరుగున అక్కడికి చేరారు. ఇదంతా జరిగేటప్పటికి సాయంత్రం అయింది.

మరునాడు ఉదయమే ప్రజలు వేలాదిగా వచ్చారు. వారా కార్యక్రమానికి లగన్ బందీ (శిస్తు నిరోధ) యజ్ఞమని పేరు పెట్టారు. అగ్నిహోత్రాన్ని, మంత్రపఠనాన్ని అడ్డుకోవడం తగదు కదా. రక్షకభటులు నిగ్రహాన్ని పాటించారు. కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి వచ్చిన అధికారులలో పలువురు మతవిశ్వాసాలు కలిగిన వ్యక్తులున్నారు. వారిలో కొందరు దుస్తులు మార్చుకుని యజ్ఞంలో కూర్చున్నారు. అధికారులు యజ్ఞాన్ని ఆపడానికి బదులు యజ్ఞానికి వచ్చేవారిని అటకాయించారు. నెమ్మదిగా చెప్పడం వల్ల ప్రయోజనం లేకపోవడంతో కొందరు కఠినంగా వ్యవహరించారు. ఐనా ప్రజలు కదలలేదు, మెదలలేదు. బరౌదాలో కార్యక్రమం అనుకున్న ప్రకారం సాగింది. ఖిలావటీలో తక్కువ మంది ప్రజలే వచ్చారు. ఐతే 1933 జనవరిలో ఉద్యమం ఖిలావటీ సరిహద్దును దాటి ముందుకు పోయింది.

★★★

## ధర్మాన్ని వీడిన మనిషి కన్నా ధర్మాన్ని పాలించెడి వృక్షం గొప్పది

*బాటసారి ఒకడు మామిడిచెట్టుకున్న మామిడిపండుకై రాయి విసిరాడు. చెట్టుపై పండి ఉన్న పండు ఒకటి రాలి క్రిందపడింది. క్రిందపడిన పండును అందుకుని బాటసారి తనదారిన తాను వెళ్ళిపోయాడు. ఈ దృశ్యాన్ని చూస్తున్న ఆకాశము మామిడిచెట్టుతో– "వృక్షరాజమా! రోజూ మనుష్యులు వచ్చి ఫలాలకొరకై నీపై రాళ్ళు విసురుతున్నారు. ఆశ్చర్యం గొలిపే విషయమేమంటే– నీవు కించిత్ ప్రతీకారేచ్ఛ లేకుండా వారికి ప్రత్యుపకారం చేస్తూ పండ్లు ఇస్తున్నావు ఎందుకిలా చేస్తున్నావు?" అని ప్రశ్నించింది. దీనికి నవ్వుతూ మామిడిచెట్టు ఇలా బదులిచ్చింది – "ఓ ఆప్తబంధూ! మనుష్యుడు తన ధర్మాన్ని విడచిపెట్టినాడని నేను నా ధర్మాన్ని ఏవిధంగా విడచిపెట్టగలను?" అన్నది.*

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**జ్ఞానమే అసలైన సంపద**

కర్మకాండ ఎందుకు ఎలా?-3

# పృథ్వీపూజనము యొక్క తాత్పర్యము

ఆనాటి ప్రసంగము అక్కడితో సమాప్తమైనది. కానీ మనస్సున అనేక శంకలు నిండివున్నాయి. అందువలన తిరిగి అవకాశము లభించినప్పుడు మేము గురుదేవుల నిలా ప్రశ్నించాము. 'భూ-పూజ చేయుట వెనుక గల తాత్పర్యం ఏమిటి? పృథ్వీపూజ చేసినవారికి మాత్రమే భూమాత అన్నమును ప్రసాదిస్తున్నదా?'

గురుదేవులు అన్నారు 'పుత్రా! ఇది కూడా భావనలకు చెందిన విశేషమే! మన ఈ శరీరము పృథ్వీతత్త్వముతోనే రచించబడినది. అందుచేత మనము పృథ్వీమాత పట్ల కృతజ్ఞత కనపరుస్తున్నాము. మనము ఈ భూమాత ప్రసాదించిన అన్నమును భుజిస్తాము, జలమును పానము చేస్తాము. మనం ధరిత్రికి ఋణపడి ఉన్నాము. అందువల్ల ఆమెకు వందనము చేస్తున్నాము.' నమస్కరించు సమయములో 'పృథ్వీమాతా! నీవు మా అందరికీ తల్లివి! హిందు, ముస్లిమ్, సిక్కు, పారసీలమైన మా అందరకు మాతృమూర్తివి! నీ గర్భము నుండే జన్మించాము. మేమందరము పరస్పరము అన్నదమ్ములము. మేము పరస్పరము కలిసిమెలిసి జీవిస్తాము. మేము ఏ జీవినీ కూడా హింసించము. అమ్మా! అవన్నీ కూడా నీ సంతానమేకదా! మా లోపల ఒక నిజమైన మానవాంతరంగ మున్నది. ఈ భావనతో జీవిస్తాము' అని చెప్పుకుంటాము. పృథ్వీపూజ చేసే సమయములో 'మేము ఐక్యత, జాగరూకత మరియు కృతజ్ఞత అనే మూడు-భావనలను పరిపక్వము గావించుకుంటున్నాము' అన్న ఆలోచనలు మెదలాలి. 'ప్రపంచము మన కుటుంబము. ప్రాంతము, జాతి, వర్గము ఇవన్నీ విభిన్న మైనవి కావు, అన్నీ ఒక్కటే. మనందరి మాత ఒక్కరే! మన మందరము సహోదరులమే. కనుక సమాజము పట్ల, దేశము పట్ల మనకు గల కర్తవ్యములను విస్మరించబోము!' అన్న చింతన చేయాలి.

ఈ పృథ్వినుండి మనకు కేవలము అన్నము-జలము మాత్రమే లభించటము లేదు. మొక్కలు, చెట్లు, పర్యావరణము, వాయువు మొదలగువాటన్నింటికీ ఆధారము ఈ అవనియే! 'జలము, భూమి పై భాగము, గాలి, ఆకాశము, అగ్ని'ల స్వచ్ఛత ఈ పృథ్వి యొక్క నిర్మలమైన పర్యావరణము మీదనే ఆధారపడి వుంటుంది. మనము వాటినన్నింటినీ కూడా సురక్షితముగా ఉంచాల్సి వుంది. భూమినుండి మనము ఎంత తీసికుంటున్నామో దానికి పదిరెట్లు అధికముగా పృథ్వికి తిరిగి ఇవ్వాలనే తత్పరతను కలిగియుండాలి. అప్పుడు మాత్రమే నిజమైన, సార్థకమైన పృథ్వీ పూజ చేసినట్లవుతుంది. ఈ శ్రేష్ఠభావనలతో పృథ్వీపూజ చేయబడుతుంది. విషయమును ఇంతటితో ముగిస్తూ గురుదేవులు ఇలా అన్నారు. 'ఆత్మశోధనకు షట్కర్మల నాచరిస్తాము, ఈ కర్మకాండలతో ముడిఇనుము స్వచ్ఛమైన ఇనుముగా మారుతుంది. మనమందరము కూడా ఈ భావనతో అధ్యాత్మవాదులుగా రూపుదాలుస్తాము. ఈ భావనలను పరిపక్వము చేసుకున్నచో తప్పక లాభము చేకూరుతుంది. కుమారా! ఇప్పుడిక షట్కర్మలు ఎందుకు ఆచరించబడతాయో నువ్వు అర్థము చేసుకునేవుంటావు.'

'అవును గురుదేవా! ఇప్పుడు వీటికి సంబంధించిన భ్రమలు తొలగిపోయినాయి. ఇప్పుడిక మా మనస్సులో దేవపూజనకు సంబంధించిన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కృపతో వాటి సమాధానములను కూడా అవగతమయ్యేలా తెలియజెప్పండి.'

'ఇప్పుడిక ధ్యానమునకు వేళ అవుతున్నది. రేపు ఉదయము మరల చర్చను కొనసాగిద్దాము' అన్నారు గురువరులు. మేము షట్కర్మలకు సంబంధించి గురుదేవుల ద్వారా అందించబడిన విషయములను చింతనము, మననము కావించుకుంటూ ఇతర పనులలోకి చొరబడినాము.

## దేవపూజనములోని రహస్యము

దేవతలను పూజించేవారికే భగవంతుడు ప్రసన్నుడౌతాడా?

మా ఈ ప్రశ్నకు సమాధానమిస్తూ గురుదేవులు ఇలా అన్నారు 'పుత్రా! భగవంతుడు బయట లేడు, నీ లోపలే ఉన్నాడు. దేవ-దానవులందరూ మన ఈ శరీరములోనే నివాసముంటారు. ఎల్లవేళలా మన మనస్సులో దేవాసురసంగ్రామము జరుగుతూనే ఉంటుంది. దైవీభావనలు ప్రబలమైనప్పుడు అవి మనలను సత్కర్మల వైపుకు ప్రేరేపిస్తూవుంటాయి. అసురభావనలు మనస్సును ఆవరిస్తే అవి మనలను కుకర్మలవైపుకు లాగుతాయి.

దేవపూజనముతో మనము మన అంతరంగములో దేవత్వభావనను అంకురింపజేసుకోవాలి అనే భావన చేస్తాము. దేవతల యొక్క దైవీశక్తులకు ఆహ్వానము పలుకుతాము! 'ఈ దైవీశక్తులు మన అంతరంగములోకి ప్రవేశిస్తున్నాయి

మనిషి యొక్క అవసరాలే నూతన ఆవిష్కరణలకు నాంది

(ఆవాహయామి). తమ శక్తులను సమీకరించుకుని స్థిరపడు తున్నాయి (స్థాపయామి). మనము వాటిని ధ్యానించి (ధ్యాయామి) మన లోపల దైవీభావాలను పరిపుష్టము చేసుకుంటున్నాము' అన్న భావన చేయాలి. దేవతాగణమంతా తమ సమస్త గుణసహితముగా మన మనస్సులో అవతరించి మనకు మార్గదర్శనము చేస్తుంది. వారు కేవలము పూజావేదిక మీద మూర్తిరూపంలోనే లేరు, సూక్ష్మరూపములో మన బాహ్యాంతరములన్నింటిలో నలుదిశలా విద్యమానమైవున్నారు మరియు ఆసురీశక్తులను నాశనము చేస్తున్నారు.

భగవంతుడు ఒక్కడే. పారసమణి స్పర్శను పొందిన ఇనుము బంగారము వలె మారినట్లు; భగవంతుడి సమీపమున కూర్చొనుట చేత మనలోని దేవత్వము కూడా వికసిస్తుంది. మన లోపలే భగవంతుడి అవతరణ జరగాలి. నిండు (స్వచ్ఛమైన) మనస్సుతో, శ్రద్ధాపూర్వకముగా పూజచేయాలి. మనస్సు లోతుల లోలోపలికి ప్రవేశించాలి. భూమి పైపొరమీద కంకర, రాళ్ళే లభిస్తాయి. కానీ భూమి లోతుల్లోకి వెళ్ళినప్పుడు బహుమూల్యమైన ఖనిజాలు, బంగారము, వెండి, పెట్రోల్ వంటి మరెన్నో గొప్పగొప్ప పదార్థములు లభిస్తాయి. అదేవిధముగా అంతర్‌మనస్సులోకి మునకలేసినప్పుడు దైవీవిభూతులు ప్రాప్తిస్తాయి.

ఆత్మశోధన కొరకే ఋషులు ప్రప్రథమముగా కర్మకాండను గురించి ప్రస్తావించారు. ఎందుకంటే కషాయకల్మషములు ఉన్నంత వరకు భగవంతుని కృపను పొందలేము. మల మూత్రములతో నిండిన బాలుడిని తల్లికూడా ఒడిలోకి తీసుకోదు. ముందుగా బాలుడిని శుభ్రపరిచి ఆ పిమ్మట బిడ్డను ఒడిలోకి తీసుకుంటుంది. మనము కూడా భగవంతుడి ఒడిలో ఆసీనమగుటకు కావల్సిన పాత్రతను వికసింపజేసుకోవాలి. అంతఃకరణ యొక్క చేతనా పరిష్కారమునకే సమస్త కర్మకాండలు, భజన, పూజాదులు ఉన్నాయి. కేవలము అక్షతలు, పూలు, గంధము సమర్పించినంత మాత్రమున భగవంతుడిని ప్రసన్నము కావించుకొనలేము. కర్మకాండ వెనకాతల ఉచ్ఛకోటికి చెందిన భావనలున్నాయి. ఆ భావనలలో అంతర్నిహితమైన దర్శనము యొక్క గొప్పతనమును గుర్తుంచుకొన్నప్పుడే సరియైన రీతిలో పూజ చేసినట్లు అవుతుంది. ఆధ్యాత్మికత అనగా భావనల ఆటయే! మనము మనోబుద్ధి చిత్తాహంకారములు అను నాలుగింటిని వశపరచుకొని ఆచరణను పవిత్రము కావించుకొనవలెను. పాత్ర శుభ్రముగా ఉన్నప్పుడే, అందులో ఏవిధమైన చెత్త లేనప్పుడే పాలు సురక్షితముగా నిల్వ ఉంటాయి. జల్లెడలో పాలను పితికితే పాలెలా నిలుస్తాయి? వ్యసనముల నుండి ముక్తమైనప్పుడే పతన-పరాభవములనే ఛిద్రములు మూసుకుపోయి ఆత్మశక్తి ప్రాప్తిస్తుంది. ప్రాణశక్తి సంచయనము జరుగుతుంది.

దేవతలను ఆవాహన చేసి వారిని లోపల ధారణ చేస్తాము. దేవతలు 'వ్యక్తులు' కాదు. మన శరీరము లోపల ఉన్న 'శక్తులు!' మూర్తి కేవలము ఒక నమూనా రూపములో ఉంటుంది. హిందువులైనా, ముసలమానులైనా లేక మరే ఇతర సంప్రదాయ వాదులైనా కూడా అందరికీ ప్రకాశమును పంచేది ఆ సూర్యుడు ఒక్కడే! అక్కడ భేదభావము లేదు. దేవపూజనంలో మనము అట్టి దేవతలను ధ్యానిస్తాము. ఆ దేవతల శక్తిని ఆవాహన చేస్తాము.

శంకరభగవానుని శిరస్సునుండి దివ్యగంగ జాలువారుతు ఉంటుంది. దీని అర్థము ఏమిటంటే మన మస్తిష్కము నుండి కూడా పవిత్రమైన, పావనమైన, స్వచ్ఛమైన భావనలే వెలువడాలి! సమస్త మానవజాతి కళ్యాణమార్గమును ప్రశస్తము చేసే జ్ఞానగంగకు ఇది ప్రతీక. మన భావనలు కూడా అలాగే ఉండుగాక!! శివుని శిరస్సున చంద్రుడు అలరారుతూవుంటాడు. చంద్రుడు గ్రహము కదా? మరి శిరస్సుమీద ఎలా నిలుస్తాడు? అలా నిలవాలంటే చంద్రుడుని శిరస్సునకు కట్టవల్సివుంటుంది. అక్కడ విషయము అది కాదు. చంద్రుడు శీతలతకు, శాంతికి, సరసతకు ప్రతీక. ఎట్టి విపత్కరపరిస్థితులు ఎదురైనప్పటికినీ సంతులనముగా ఉంటూ, వివేకముతో, శాంతిపూర్వకముగా సమస్యను ఎదుర్కొనవలెను. క్రోధము, అవివేకభావములను దరిచేరనివ్వరాదు. భగవంతుడి నిజమైన భక్తులు తమ మానసిక సంతులనను కోల్పోకూడదు. శంకరభగవానుని మెడను పాము చుట్టుకునివుంటుంది. పరమశివుడు దుష్టప్రవృత్తి కల జీవులను కూడా వశపరచుకొని తమ అభీష్ట కార్యమును చేయించుకొనే నేర్పరి. బుద్ధుడు-అంగులీమాలుడినీ; నారదుడు-రత్నాకరుడు అనే బందిపోటుదొంగనూ పరిపూర్ణముగా పరివర్తన చెందించి మహాత్ములుగా తీర్చిదిద్దినట్లు; తమ ప్రభావముతో, సామర్థ్యముతో దుష్టులను కూడా ఉద్ధరించి తమకి వలె మలచాలి.

శంకరభగవానులు తమ శరీరమునకు భస్మమును అలదుకుంటారు. ఈ భస్మము మనకు నిరంతరము మన మృత్యువును గుర్తుచేస్తు ఉంటుంది. ఈ శరీరము ఎప్పుడో అప్పుడు పిడికెడు బూడిదగా మారిపోతుంది. ఈ శరీరము క్షణభంగురము అని గుర్తుంచుకొని నిరంతరము మానవుడు తన లక్ష్యముపట్ల అప్రమత్తతతో ఉండాలి. పరీక్షిన్మహారాజు మృత్యువును స్మరణలో ఉంచుకొని ఏడురోజులలో ముక్తిని పొందాడు. మనమందరమూ కూడా ఏడురోజులలోనే జీవించాలి. వారంలో ఏడురోజులు

**పరిస్థితులు, ఇతరులు తనకు అనుకూలంగా మారాలని కోరుకొనుటే కష్టాలకు మూలం**

ఉంటాయి. ఆ ఏడురోజులలో ఏదో ఒకరోజున మనమందరము వెళ్ళిపోవాలి. మన ఈ జీవితము లోకమంగళకార్యమునకు అర్పించబడాలి అనే ఉద్దేశ్యము ఉండాలి. శంకరుని ఊరేగింపులో కుంటివారు, గ్రుడ్డివారు, వికలాంగులు మొదలగు అనేకరకములైన మనుష్యులుంటారు. మనము దీనులు-హీనులు, సమాజములో వెనుకబడిన జనులందరిని కలుపుకొని ముందుకు సాగవల్సి ఉంటుంది. ఎవరినీ ఉపేక్షించరాదు. జపాన్‌గాంధీగా ప్రసిద్ధి చెందిన కాగవా కుష్ఠురోగుల మధ్య నివసిస్తూ వారికి జీవితాంతము సేవచేస్తూ గడిపాడు. ఠక్కర్‌బాబా పాకీవారి మధ్య జీవించాడు. భగవానుడు శ్రీరాముడు కోతులు, ఎలుగుబంట్లను తోడుగా ఉంచుకున్నాడు. కృష్ణభగవానుడు గోపబాలురను ఎల్లప్పుడు తనతో ఉంచుకుని వెనుకబడినవారిని ఎన్నడూ ఉపేక్షించకూడదు అని ఆచరణాత్మకముగా చూపించాడు. వారికి కూడా సముచిత గౌరవ-మర్యాదల నివ్వాలి.

శంకరభగవానుడు త్రినేత్రుడు. (శివుడు ముక్కంటి!) మనకు ప్రత్యక్షముగా చక్షుద్వయము మాత్రమే కనిపిస్తుంది. కనిపించని ఆ మూడవకన్ను జ్ఞాననేత్రము! వివేకచక్షువు! దీనిని ఎవరికివారు స్వయముగా వికసింపజేసుకొనవలెను. మన దూరదృష్టి, వివేకశీలత జాగృతమవ్వాలి. భగవానుడు శంకరుని పూజ చేస్తున్నప్పుడు ఈ గుణములన్నీ మన మనస్సులో వికసించాలి.

దేవతల పూజ చేస్తాం. దేవతలు 'సహకారిత, సామూహిక ప్రవృత్తులకు' ప్రతీక. ఒకసారి అసురత్వము దేవత్వము మీద ఆక్రమణ చేసినది. దేవతలు ఓడిపోయారు. అప్పుడు దేవతలు బ్రహ్మదేవుని సమ్ముఖమునకు వెళ్ళారు. మీరెందుకు ఓడిపోయారు? అని విరించి వారిని ప్రశ్నించాడు. దేవతల వద్ద ఏ జవాబూ లేదు. దేవతల అనైక్యతే వారి ఓటమికి మూల కారణము. 'మీరు సంఘటితమవ్వాలి. అప్పుడే జయమును పొందగలరు' అన్నాడు విధాత. బ్రహ్మదేవుని మాటలను ఔదలదాల్చి దేవతలు తమ తమ అహంకారములను త్యజించి సంఘటితమైనారు. వారి సమ్మిళిత శక్తితో దుర్గాదేవి ప్రాదుర్భావం జరిగింది. వారు విజయమును వరించారు. సప్తఋషులు ఏకమై ఈ దేవసంస్కృతీ ప్రకాశమును విశ్వమంతా వ్యాపింపజేశారు. మూడు నదులు కలిసినప్పుడు త్రివేణీసంగమ మేర్పడుతుంది. తద్వారా ప్రయాగ తీర్థరాజమైనది. ఈనాడు సర్వత్రా సంఘటనా లేమి ఉన్నది. ఐక్యత కొరవడినది. కల్సి జీవించుటకు మనుష్యులకు తమ అహంకారము అడ్డు నిలుస్తున్నది. వేరు-వేరుగా జీవించాలనే ప్రవృత్తి చేతనే సమాజము బలహీనపడుతున్నది. చెల్లాచెదరైన దేవతలందరి శక్తి తిరిగి సంఘటితమైనప్పుడు ఒక ప్రచండశక్తి ఉద్భవించినది. ఆ శక్తిని 'దుర్గ' అన్నారు. అనేక చేతులు, అనేకానేక అస్త్రశస్త్రములు ఒకే శక్తితో సంచాలన గావించబడ్డాయి. ఈ దుర్గాదేవియే శుంభ-నిశుంభులు, మధు-కైటభుల వంటి భయంకరరాక్షసుల బారినుండి అందరికీ ముక్తిని కలిగించినది. వ్యక్తివాద మనే మనోభావనతోనే ఈనాడు మనుష్యులు ప్రతీ రంగములోనూ పరాజయము పాలగుచున్నారు. అట్టి ఐక్యతాభావనను పొందాలని మనము దేవీదేవతల పూజను చేసినచో మన లోపల దైవీశక్తులు జాగృతమౌతాయి, స్వర్గములో ఉండే సహకారభావన పృథ్వీమీద వ్యాపిస్తుంది.

గాయత్రీమాతను గురించి కూడా తెలుసుకొనవలెను. గాయత్రీమాత బాహ్యాలంకారములతో, పూజ-పారాయణలతో ప్రసన్నురాలవ్వదు. నీ ప్రవృత్తి హంస వంటి వివేకశీలత, దూరదృష్టిని సంతరించుకున్నప్పుడే ఆమె ప్రసన్నురాలౌతుంది. ఆ గాయత్రీమాత తామరపువ్వు మీద ఆసీనమైవుంటుంది. పద్మము బురదలో ఉద్భవించినప్పటికి; దాన్నుండి పైకి లేచి నిర్మలంగా ప్రకాశిస్తూవుంటుంది. విశ్వంలో చెడ్డవి వున్నాయి, అవి అనాదిగా ఉన్నాయి. భావికాలములోనూ ఉంటాయి. వాటిని నిర్మూలించుట అసంభవము. ఐతే మనము చేయవల్సినది ఏమిటంటే మన మనస్సులో చెడుని ప్రవేశించనీయకుండా పడవ నీటి మీద తేలుతున్నట్లుగా జీవించాలి. నీటిలో పడవ ఉంటుంది కానీ పడవలో నీరు ఉండదు. ఒకవేళ ఓడకు చిల్లుపడితే నీరు లోపలికి ప్రవేశించి ఓడ మునిగిపోతుంది. శ్రేష్ఠఆచరణ కలిగియుంటూ, మహోన్నతకార్యములు చేయటయే నిజమైన ఆధ్యాత్మికత. అదే దేవికి చేసే నిజమైన పూజ. ఈవిధముగా జీవించాలనుకునేవారి మీదే గాయత్రీమాత కృప వర్షిస్తుంది. గాయత్రీమాతకు ఒక చేతిలో కమండలము, మరో చేతిలో వేదములు ఉంటాయి. కమండలము-నిరాడంబరతకు ప్రతీక. కమండలములోని జలము-శ్రద్ధకు ప్రతీక, శీతలతకు, సరసతకు ప్రతీక. వేదము ప్రపంచములోని సమస్త జ్ఞానమునకు మూలము. మనము జ్ఞానోపాసకులమగుదుము గాక!! స్వాధ్యాయమును నిర్లక్ష్యము చేయకుందుముగాక! విద్యలేని, జ్ఞానము లేని మానవుడిని 'కొమ్ము-తోక లేని జంతువు' అని శాస్త్రములు ఉల్లేఖించాయి. జ్ఞానము ప్రాప్తించిన తరువాత కూడా జ్ఞానము ఉన్నదని గర్వించరాదు. నిరాడంబరముగా జీవించాలి. ఆ జ్ఞానమును శ్రద్ధాపూర్వకముగా జనకల్యాణ నిమిత్తము సదుపయోగము చేయాలి.

– అనువాదము: *శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**ప్రకాశవంతమైన, సమర్థమైన ఆత్మపై పతన పరాభావాలు తమ ప్రభావాన్ని చూపలేవు**

జీవన సాధనకు బంగారు సూత్రములు-3

# ధర్మధారణ యొక్క వ్యవహారికత

శాంతిగా ఉండే సమయంలో సైనికుల యొక్క అస్త్ర-శస్త్రములు గదిలో భద్రపరచబడివుంటాయి. కాని యుద్ధము పొంచి ఉన్నప్పుడు వాటిని బయటకు తీసి సిద్ధం చేయుట పరిపాటి. ఖడ్గములు మరలా క్రొత్తగా సానపెట్టబడతాయి. ఇంటిలోని నగలు సామాన్యంగా ఇనుపపెట్టె లేక బీరువాలో భద్రపరచబడతాయి. కాని వివాహం, పండుగ సమయంలో వాటిని బయటకు తీసి క్రొత్తవిగా కనబడేటట్లు మెఱుగుపెట్ట బడతాయి. వర్తమాన యుగసంధికాలంలో అస్త్రములు-ఆభూషణాల వలె ప్రతిభాశాలురు ఉపయోగించబడతారు. వ్యక్తిత్వాలను ప్రఖర ప్రతిభాసంపన్నము చేయుటకు ఇది ఆపత్కాలీన సమయము వంటిది. ఈ సమయములో ముక్కులైనవారిని తత్పరతతో బాగుచేసి సరిచేయాలి.

మన స్వీయ సమర్థత, దక్షత, ప్రామాణికత మరియు ప్రభావ ప్రఖరత ఒకే ఒక ఆధారంపై రాటుదేలుతుంది. అది-చింతన, నడవడిక మరియు వ్యవహారంలో ఉత్కృష్టతలను అధికంగా కలిగి ఉండుట. సంస్కారములేక అస్తవ్యస్థముగా ఉండేవారు నికృష్టమైన జీవితం గడుపుతుంటారు. ఇతరులకు సహాయం చేయుటకు బదులు తమ జీవితావసరములకు కూడా ఎవరెవరి ముందో ప్రాధేయపడి, చేయిచాచుట లేక దొంగతనం చేస్తూ చాలా కష్టంగా కాలము గడుపుతుంటారు. కానీ ప్రఖర ప్రతిభ కలవారి ప్రత్యేకతలు మణిమౌక్తికముల వలె మెఱుస్తుంటాయి. ఇతరులను ఆకర్షిస్తూ వారిని ప్రభావితం కూడా చేస్తారు మరియు ఇతరులకు సహాయపడుటలో కూడా సమర్థత చూపిస్తారు. సహకారములు, సమ్మానములు వీరి వెన్నంటే తిరుగుతూ ఉంటాయి. మారుతున్న ఈ సమయంలో సరైన తీరుతెన్ను లేనివారు చీపురుతో ఊడ్చి విసిరివేయబడే చెత్త-చెదారములాగ ఎక్కడో దూరంగా విసిరివేయబడతారు. జీవనశక్తి దృఢంగా ఉన్నవారు మాత్రమే అనారోగ్యం నుండి, కష్టముల నుండి మరియు తుఫానుల నుండి రక్షింపబడతారు.

సామర్థ్యమును, ఓజస్సును, మనస్వితను, తేజస్సును మరియు సాహసమును వర్చస్సు అని అంటారు. ఇవే ఆ దివ్యసంపదలు. వీటిద్వారా ఈ విశ్వవిపణిలో కోరుకున్నవన్నీ పొందవచ్చు. ఎవరి వద్దనైతే వైభవము, పరాక్రమములు ఉంటాయో వారే ఇతరులకు సహాయము చేయగలరు. రాబోయే రోజులలో ఇటువంటివారి అవసరము అడుగడుగునా ఉంటుంది. వారి ప్రతిభ సాధారణమైనవారితో పోలిస్తే చాలా రెట్లు అధికంగా ఉంటుంది. ప్రపంచం యొక్క వాతావరణమును వారే బాగుచేయగలరు. వారు తమను తాము బాగుచేసుకుని తమ సృజన సామర్థ్యాన్ని అసందిగ్ధముగా ఋజువు చేసుకుంటారు. పరిస్థితుల ప్రమాదకరస్థితిని చూస్తూ వారు బాగుపడటమనేది అత్యంత ఆవశ్యకమే, కానీ ఈ కఠినమైన పనిని చేయుటకు తమ వ్యక్తిత్వాన్ని సంస్కరించుకొనినవారే విపత్కర సమయంలో కొంత మహత్త్వపూర్ణ భూమిక నిర్వహించుటలో సఫల మయ్యేదరు. ఈ స్థాయిని పొందుటకు గీటురాయి ఒక్కటే ఉన్నది. అది-తమ వ్యక్తిత్వమును దుర్గుణాల నుంచి తప్పించి సర్వతోముఖ సమర్థతతో సుసంపన్నము చేసుకోవాలి. సద్గుణముల సంపదను అధిక పరిమాణములో ఆర్జించగలగాలి.

ఇతరులను ఎలా తయారుచేయాలి? అన్నదానికి ఒక మండలిని ఏర్పాటు చేసుకోవాలి - పనిముట్టు యొక్క ఆకారాన్ని ఒక మూసలో పోసి కావలసిన విధంగా నిర్మించుకుంటాము కదా! ఇతరులు ఎలా తయారవ్వాలి, ఎలా మారాలి, ఈ ప్రయోగం మొట్టమొదట మనమీదే చేసుకోవాలి. ఈ పనిని ఎంతవరకు చేయవలెనో అంతవరకు మాత్రమే చేయాలి. కాళ్ళు చేతుల నెలా కావాలంటే అలా ఉపయోగించుకోగలిగినప్పుడు, ఇచ్ఛానుసారము మార్పులు, చేర్పులు చేసుకోగలిగినప్పుడు మన స్వంత ప్రఖరతను సద్గుణములతో సుసజ్జితము చేసుకుని మిరిమిట్లుకొలిపేటట్లు ఎందుకు చేసుకొనలేము?

ఇన్నాళ్ళు సోమరితనము, నిర్లక్ష్యము, తిరస్కారము మరియు సవరింపబడని స్థితి సహించబడేది, కాని మారుతున్న యుగమునకు అనుగుణంగా ఇప్పుడుమాత్రం ప్రతివొక్కరు తమనుతాము నూతన యుగానికి అనుగుణంగా మార్చుకోవాలి. దీనికై తీవ్రంగా ప్రయత్నించాలి. ఆ మార్పునకు అవసరాన్ని చూపిస్తూ సమాజం మొత్తము విశాలమైన దృక్పథముతో మారిపోవుటను ప్రోత్సహించుటయే కాక దానిని గత్యంతరము లేని స్థితిగా తీసుకునిరావాలి.

**యోగులు, తపస్వులు, కష్టసాధ్య ప్రక్రియల ద్వారా సిద్ధి పొందుతారు**

శరీరములు ఏవిధంగా నిర్మించబడుతున్నాయో అవి దాదాపు అదే ఆకారంతో ఉంటాయి. కాని గుణ, కర్మ, స్వభావములలో కోరిన ఉత్కృష్టత పొందుపరుస్తూ దాని కారణంగా ఇదే శరీరంలో దైవత్వాన్ని దర్శించగలిగేటటువంటి అద్భుతమును సృష్టించవచ్చును. దేవీదేవతల సంఖ్య తక్కువేమీ కాదు. వారందరి పూజ-ఉపాసనల యొక్క మాహాత్మ్యం వర్ణించబడినది కానీ పరీక్ష అనే గీటురాయిపై నిరూపణ అరుదుగా మాత్రమే లభిస్తుంది. భక్తులు తరచుగా నిరాశవ్యక్తం చేస్తూ తమ అపజయాలకు ఈ విధానాలన్నింటినీ తిడుతూ కనబడుతుంటారు. అపవాదుకు బదులుగా ఏ కొద్దిమందికో ఉపాసనల సఫలత లభిస్తుంది. కాని ఒక దేవతను మాత్రం సముచిత సాధన చేసినపుడు నగదురూపంలో సత్పరిణామం చేతికి అందుట చూడగలము. అదే "జీవనదేవత". దీనియొక్క సంస్కరించబడిన స్వరూపమే కల్పవృక్షము. తమలో దాగి ఉన్న రిద్ధి-సిద్ధుల భాండాగారమును వెలుపల వెతుకుట అవివేకం. ఆత్మవిశ్వాసమును మేల్కొల్పి తనను తాను సంస్కరించుకొనుట వలన లభించగల సంపదలు, విభూతులపై విశ్వాసముంచుట తప్పనిసరి.

ప్రాచీనకాలంలో శిశువులందరూ ఆరోగ్యంగా పుట్టేవారు. అప్పుడు వారికి కొంత వయస్సు వచ్చేసరికి వ్యాయామశాలలో తీవ్రమైన కసరత్తులు చేయుటకు పంపేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. వికలాంగులు, రోగిష్టులు, దుర్బలురైన ఈ తరపు పిల్లలను వ్యాయామశాలకు పంపలేరు. వారికి ఆరోగ్యరక్షణ కొరకు ఉపయోగపడే సామాన్య నియమములను గురించి తెలిపి అలవాటుపడునట్లు చేస్తే సరిపోతుంది. అన్ని బలములు కలిసుండే ఆత్మబలమును పొందుట కొరకు ఆధ్యాత్మిక ప్రయోగములు చేయాలి. ప్రాచీనకాలంలో అవి తపస్సు, సాధన మరియు యోగాభ్యాసాలతో ఆరంభమయ్యేవి. కానీ ఈనాడు వ్యక్తిత్వదృష్టితో వికృతి చెందిన తరమునకు ఆధ్యాత్మికతకు చెందిన ప్రారంభిక సాధనలు చేయుటయే చాలు. ఉన్నతపాఠశాలలో ఉత్తీర్ణుడు కాకుండా కళాశాల చదువుకు ప్రణాళిక తయారుచేయుట వ్యర్థము.

## పంచశీలముల నభ్యసించండి

ప్రాచీనకాలంలో ప్రతి ఒక్క సాధకుడు ఆరంభములో యమ-నియమములను సాధన చేయవలసి వచ్చేది. అందులో సత్యం, బ్రహ్మచర్యము, అహింస, అస్తేయము, అపరిగ్రహము మొదలైనవాటిని అనివార్యంగా సాధన చేసేవారు. ఆ కాలంలోని సామాజిక వాతావరణంలో అవి సర్వసాధారణమై ఉండేవి. కానీ ప్రస్తుతస్థితిలో అలా కనిపించుట లేదు. నేడు వ్యావహారిక పంచశీలములు అలవాట్లలో సమ్మిళితం చేయగల్గినా కూడా పని జరిగిపోతుంది. శ్రమశీలత, మితవ్యయం, శిష్టత, సువ్యవస్థ మరియు సహకారమనే పంచశీలములు మన క్రియాకలాపాల్లో కలిసిపోగలిగితే ప్రాచీనకాలంలో చేసిన తపస్సాధనకు సమానమైన సాధనాత్మక సాహసమౌతుందని అనుకోవచ్చును.

**1. శ్రమశీలత:** సోమరితనము, నిర్లక్ష్యం, విలాస జీవితం, ఆడంబరము మొదలైనవాటి కారణంగా మనిషి లంచగొండిగా తయారయ్యాడు. తమ శక్తిలో నాలుగవవంతు కూడా ఉత్పాదక శ్రమలో నియోగింపబడుట లేదు. సోమరితనముతో శారీరక, మానసిక అసమర్థత పెరుగుతుంది. ఆర్థిక మరియు అన్ని ఇతర ప్రగతుల ద్వారములు మూసుకుపోతాయి. శ్రమ లేకుండా శరీరము రోగరహితముగా, శక్తివంతంగా ఉండదు. శ్రమ లేకుండా ఉత్పాదన కూడా సంభవం కాదు. స్త్రీ-పురుషులు శ్రమ చేయకుండా ఉండుటలోనే గొప్పదనముందని అనుకొనుట, పనిదొంగలుగా, తక్కువశ్రమతో అధికాధిక లాభం పొందాలనే ప్రవృత్తులు కలిగియుండటమే సమాజము వికలాంగిగా తయారవుటకు కారణము.

ఈ భయానకత నర్థము చేసుకుంటూ సమయమునకు తత్పరత మరియు తన్మయతతో నిండిన పరిశ్రమతో కలిసిన దినచర్యను ఏర్పాటుచేసుకోగలిగితే ఉన్న సమయము మరియు సాధనాలతోనే ప్రగతిశీలతతో కలిసున్న పెక్కు సత్పరిణామాలు లభిస్తూ ఉండగలవని తెలుస్తుంది.

**2. మితవ్యయము:** అపవ్యయం నేటి రెండవ శాపము. దుర్వ్యసనములు, ఫ్యాషన్ మరియు ఆభూషణముల వంటి ఆడంబరముల కొరకు ఎంత సమయం మరియు డబ్బు ఖర్చు అవుతుందో, మరి దానిని మిగుల్చుకోగలిగితే మనకు మరియు ఇతరులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. నిరర్థకమైన ఖర్చులకు అంతమే లేదు. దానిని ఎంతవరకైనా చేయవచ్చును. దానిపై తీవ్రమైన కోరిక ఎప్పుడైతే పెరుగుతుందో దానిని తీర్చుకొనుట సాధారణ శ్రమ, కౌశలమునకు సాధ్యమే కాదు. అప్పుడు నమ్మకద్రోహము, దుర్మార్గములను ఆశ్రయించనిదే పని జరుగదు. ఈ ధన ప్రదర్శన వలన ఎప్పుడైనా ఎక్కడైనా మంచి సన్మానము లభించవచ్చునేమో కాని ఇపుడు మాత్రం దానివలన ఈర్ష్యమాత్రమే పుడుతుంది. ఫలితంగా వారికి నకలుగా తయారగుట లేక వారిని నీచంగా చూపించే ప్రతిక్రియ

**శ్రేష్ఠపుత్రుని కర్తవ్యం - కుటుంబ సిరిసంపదల వృద్ధిపరుస్తూ కీర్తిప్రతిష్ఠలనార్జించుట**

కనబడుతుంది. "సాదా జీవితం, ఉన్నత ఆలోచన" వంటి ఉత్కృష్టతకు ఒకరకంగా సమాప్తి అనే అనిపిస్తుంది. ఉదారతను చరితార్థము చేయుట అపవ్యయము నుంచి ఎంతో కొంత మిగిలినప్పుడు మాత్రమే కదా.

**3. శిష్టత:** శిష్టత అనేది సభ్యత యొక్క ఆధారశిల మరియు అశిష్టత, అసభ్యత యొక్క అన్నింటి కంటే చెడు ప్రతిక్రియ. ఇతరులపట్ల అగౌరవము మరియు తన అహంకారము కలయిక వలననే ఎంత గర్వము పెరుగుతుందంటే వ్యక్తి యొక్క గౌరవము తగ్గుతుంది. సభ్య, మధురమైన వినయము సజ్జనోచితమైన వ్యవహారము యొక్క ప్రముఖ చిహ్నము. ఈరకమైన ప్రవర్తన పెద్దలయెడలనే కాక చిన్నవారి యెడల కూడా అంతే తత్పరతతో ఉండాలి.

"వినయము వెల చెల్లించకుండానే లభిస్తుంది. కాని దానితో అన్నిటిని కొనవచ్చును." ఈ వాక్యము చాలా మహత్త్వపూర్ణ మైనది. వినయము కలిగున్నవారి ఇంటిలో కలహములు ఉండవు. స్వర్గము వంటి వాతావరణము ఏర్పడుతుంది. వినయము కల వ్యక్తికి మిత్రులు సహకారులు పెరుగుతూ ఉంటారు. మరి అసభ్యమైన వ్యక్తికి తనవారే పరాయి వారవుతారు. జీవిత సాఫల్యంలో వినయము యొక్క అసాధారణ పాత్ర ఉంటుంది.

**4. సువ్యవస్థ :** సువ్యవస్థ యొక్క తాత్పర్యము తన సమయం, శ్రమ, మనోయోగము, జీవనక్రమము, శరీరము, సామర్థ్యము మొదలైన అన్ని సంబంధిత క్రియాకలాపాలను సరిగ్గా నియోగించుట. వాటిని ఏవిధంగా జాగ్రత్తగా సరిగ్గా ఉపయోగించగలగాలి అంటే అస్తవ్యస్థత నుంచి తప్పించుకుని చాలా అధిక సమయం వరకు వాటి ద్వారా సముచిత లాభం పొందగలగాలి. ఈ ప్రక్రియ స్వభావంలో సువ్యవస్థా దృష్టి ఉంటేనే జరుగుతుంది. లోకవ్యవహారంలో ఇది అన్నింటికంటే పెద్ద సద్గుణము. ఎవరికైతే జాగ్రత్త చేయుట, సునియోజనము ఉంచుట వస్తుందో వారిని గుణవంతులుగా లెక్కించవచ్చని తెలుసుకోవాలి. అటువంటివారి గొప్పదనమును అందరూ మన్నిస్తారు. సునియోజనవే సౌందర్యము, దాన్నే కళా-కౌశలము అని కూడా అనాలి. మేనేజర్, గవర్నర్, సూపర్‌వైజర్ వంటి ప్రతిష్ఠాత్మక పదవులు వారికే లభిస్తాయి. అటువంటివారు కేవలం తమనే కాక తమ పరిజనమును కూడా సువ్యవస్థతో నడుచుటకు, క్రమశిక్షణతో ఉండుటకు ఒప్పిస్తారు. ప్రగతికి ఇదే ముఖ్యమైన ఆధారము.

**5. సహకారము :** కలిసిమెలిసి పనిచేయుట, ఇచ్చి పుచ్చుకొను ఉపక్రమము ఏర్పడుటలో తెలివితేటలు ఉపయోగించుట. పరివారంలో, వృత్తిలో, లోకవ్యవహారంలో సామంజస్యమును ఏర్పరచి ఉంచగలుగుట, ఉదారతతో నిండిన సహకారభావనను తన యొక్క అన్ని క్రియాకలాపాల్లో సునియోజితంగా ఉంచగల్గినప్పుడే వీలౌతుంది. ఏకాకీతనంతో పీడింపబడేవారు సమాజానికి దూరంగా, ఉపేక్షించబడి ఉండవలసివస్తుంది మరియు రసహీనత, నిరాశల మధ్య రోజులు గడుపుతారు. బదులుగా సంకీర్ణ స్వార్థపరత్వంలో పట్టుబడినవారు, కఠినమైన ప్రకృతి కలవారైనందున వారికి స్నేహము, సహకారము, గౌరవము పొందే అవకాశమే లభించదు.

గొప్ప కార్యములు సామూహిక శక్తి ద్వారానే సంపన్నమవ గలవు. దైవశక్తుల సంయోగము వల్లనే దుర్గయొక్క పుట్టుక అనే కథ సర్వవిదితమే. సంకీర్ణస్వార్థపరత్వము యొక్క స్థానంలో ఉదార సహకారభావన యొక్క ప్రవృత్తిని మేల్కొల్పుటద్వారా సంఘశక్తి జాగృతమవుతుంది. నేర్పుగల కార్యకర్త అయినప్పటికీ సహకారభావనతో ఒక సంస్థకు, పరిశ్రమకు ప్రాణం పోస్తాడు.

దుర్గుణాల స్థానంలో సదాశయం యొక్క రీతి-నీతులను ప్రవేశపెట్టి, మానవీయ గరిమకు అనుగుణంగా మర్యాదను పాటిస్తూ నవ్వుతూ, నవ్విస్తూ జీవనమాధుర్యాన్ని ఆస్వాదింప వచ్చు. ఇటువంటివారే ధన్యులవుతూ తమ సమయాన్ని, కుటుంబమును మరియు వాతావరణమును ధన్యము చేస్తారు.

ఈ సద్గుణములను తన దృష్టికోణము, స్వభావము మరియు అభ్యాసములలో అంతర్లీనము చేయుటకు అన్నింటి కంటే మంచి అవకాశము పరివారము, పరిజనము మధ్య లభిస్తుంది. గృహం యొక్క ఆవశ్యకమైన పనులను పరివారము, పరిజనులు కలిసి సహకారపూర్వకంగా పూర్తిచేయాలి. ఉత్సాహమును ప్రశంసిస్తూ, ఉపేక్షను తిరస్కరిస్తూ, పరివారం లోని ప్రతి సభ్యుడిని సంస్కారవంతునిగా చేయగలం. పరివార సంస్థయే నరరత్నాల గని కాగలదు. కుటుంబంలో సద్గుణముల నభ్యసించేవారికి లోకవ్యవహారంలో అడుగడుగునా సంపూర్ణ లాభమును సహజంగానే పొందుట ఏమాత్రం కష్టం కాదు.

*(సశేషం)*

*- అనువాదం: ఊటుకూరి సత్యన్నారాయణ గుప్త*

**విద్యార్జనతో మనిషి చక్కని, ఆలోచనాపరునిగా ఎదిగి ఏకాగ్రతతో శ్రమశీలుడవుతాడు**

అతీంద్రియ విజ్ఞానం-3

# కల్పనలు సజీవము-సక్రియము - 2

ప్రత్యుత్పన్న(సద్యోజాత)మనస్సు ఏకాగ్రతతో సంకల్పశీల మైనప్పుడు వేర్వేరు గుణములను విభిన్న ప్రదేశములను రక్షించే టటువంటి ఇతర కణములన్నింటిలోనూ ఉండే మనస్సు ఈ సద్యోజాతమనస్సుయొక్క అధీనములోకి వచ్చి పని చెయ్యటము ప్రారంభిస్తుంది. ఆవిధముగా సంగ్రహించిన శక్తితో ఏదో ఒక స్థానములో ఉన్న జీవకణములను వేరొకరి శరీరములోకి ప్రవేశపెట్టి ఆ ఫలానా వ్యక్తిని అతడు బాధపడుతున్న రోగము బారినుండి కాపాడవచ్చు. మన మాటలు వింటూ అర్థము చేసుకొంటున్నవారి హృదయములలో కొన్ని కదలికల నుత్పన్నము చేసి వారికి ఏదైనా సందేశమునివ్వవచ్చు. అదేవిధముగా వేరొకరి మనస్సులో అలజడిని కలిగించడము ద్వారా వారిని వేధించి అశాంతికి గురిచెయ్యవచ్చు కూడా!

రిచీకాల్డర్ అనే వ్యక్తి జీవవిజ్ఞానశాస్త్రమునకు సంబంధించి గొప్ప విద్వాంసుడు. ఆయన పైన చెప్పబడిన తథ్యమును ఈక్రిందివిధముగా ప్రతిపాదించాడు.

ఎలక్ట్రాన్స్ మనకు సేవకులు! ఎందుకంటే వాటి కదలికలు మనిషికన్నా ఎక్కువ వేగముగా ఉంటాయి. సాధారణముగా మానవనేత్రము చూడగలిగిన దానికన్నా ఎన్నోరెట్లు ఎక్కువ శక్తితో అవి చూడగలవు. మానవీయ స్పర్శకన్నా ఎక్కువరెట్లు స్పర్శానుభూతిని పొందగలవు. మనిషి వినగలిగినదానికన్నా ఎక్కువ శబ్దమును వినగలవు. మానవుడి మెదడుకన్నా అత్యంత శీఘ్రముగా ఏ విషయమునైనా అర్థము చేసుకొనగలవు, లెక్కించగలవు. మన వద్ద దూరఆస్వాదన (టెలెగస్టేషన్) దూరశ్రవణ (టెలెఆడిషన్), దూరఘ్రాణ (టెలెఆల్‌ఫెక్షన్), పరిమళమును వెదజల్లే పదార్థములు, మాట్లాడే బొమ్మలు కూడా ఉన్నాయి. ఇవన్నీ మన సేవకులైన ఎలక్ట్రాన్‌లచే తయారు కాబడినవే. నియంత్రణ మీటర్లు(సర్వోమీటర్లు) ద్వారా ఎలక్ట్రాన్ ఒక రోలింగ్ పరిశ్రమలోని వేల టన్నుల ఉక్కును పావుకిలో బరువును ఎత్తినంత తేలికగా పైకి లేపుతుంది. మానవ జీవ కణములలో ఉండే శక్తిని(ఎలక్ట్రాన్ శక్తిని) ఊహించగలిగితే బహుశః అంతవరకూ మన బుద్ధి పోలేదుగానీ ఒక శరీరము తనలోని విశేషశక్తిని లేదా సందేశమును మరొక శరీరధారికి ఇవ్వగలదు అన్న సత్యమును మటుకు నిరాకరించలేము.

'కాంతి అనేది ఒక శక్తి, మూలరూపములో అది పదార్థము కూడా. దానిని ముక్కలుగా విడగొట్టగలము. ఈ కాంతి పరమాణువులను 'ఫోటోసెల్స్' అని పిలుస్తాము' అన్న విషయములన్నీ మనకు తెలుసు. వీనిలోకూడా ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూక్లియస్‌ల నిర్మాణముంటుంది. అంటే కాంతికన్నా కూడా అత్యంత సూక్ష్మమైన శక్తులు ఈ ప్రపంచములో ఉన్నాయని మనము అంగీకరించవల్సి ఉంటుంది.

కాంతి లేదా వెలుతురు సహాయముతో మనము వస్తువులను చూడగలము. కానీ సాధారణ కాంతికణముల (ప్రకాశకిరణముల) సహాయముతో మనము మన శరీరము లోపలి కణమును చూడటానికి సాధ్యము కాదు. ఎలక్ట్రాన్‌లను 50000 వోల్టుల విద్యుశ్ఛక్తి వద్ద మైక్రోస్కోపులోనికి పంపించి నట్లయితే వాటి తరంగదైర్ఘ్యము తెల్లటి కాంతికిరణములకన్నా 1/100000 వంతు సూక్ష్మముగా ఉంటుంది. అప్పుడు దానిని హైడ్రోజన్‌పరమాణువు యొక్క వ్యాసముతో 42.4% తక్కువుండే చిన్న పరమాణువులోనికి ప్రవేశపెట్టి అక్కడ దాని గతివిధులను గమనించగలము. ఉదాహరణకు మానవనేత్రము ఒక అంగుళము పరిధివరకు చూడగలదు. దానిలో 500 వంతు తక్కువ పరిధిని కాంతి సూక్ష్మదర్శిని, 10,000 వ వంతు చిన్న భాగమును ఎలక్ట్రాన్ దూరదర్శినీ దర్శించగలవు. దీనిని బట్టి మానవశరీరము కణములోని చేతనత్వభాగము ఎంత సూక్ష్మాతిసూక్ష్మముగా ఉంటుందో ఊహించవచ్చు. ఈవిధమైన సూక్ష్మదర్శినితో కణమును పరిశీలించినట్లయితే అందులో కూడా మిణుకుమిణుకుమంటూ ఒక సూక్ష్మమైన కాంతి మనకు గోచరిస్తుంది. చేతనత్వమనేది ఈప్రకారముగా కాంతి యొక్క అత్యంత సూక్ష్మాతిసూక్ష్మమైన కిరణమే; ఈ విషయమును విజ్ఞానశాస్త్రము కూడా అంగీకరించినది.

మాస్కోకు చెందిన జీవశాస్త్రజ్ఞుడు ప్రొ॥ తారాసోవ్‌గారా దీనిని పరిశీలించిన తరువాతనే 'మానవ శరీరములోని ప్రతి

**జీవితం సాత్విక మార్గాన్ని పట్టనిచో గుణకర్మ స్వభావాలలో సత్వగుణాలు ప్రతిఫలించవు**

ఒక్క కణమూ మిణుకుమిణుకుమనే ఒక దీపము వంటిది, ఇక శరీరమంతా కలిపితే యావత్ బ్రహ్మాండములోని నక్షత్ర సమూహము వలె ఉంటుంది. అతి సూక్ష్మమైన ఈ చేతనత్వమే అందులోని జీవము' అని వ్యాఖ్యానించాడు.

ఈ జీవచేతనత్వము శరీరములోని ప్రతి ఒక్క అవయవములోనూ వ్యాపించియుంటుంది. ఐతే ఒక ప్రత్యేకమైన స్థానమునుండి అది ప్రకాశిస్తూంటుంది. 'ఆత్మ' అనబడే పదార్థమేదో శరీరములో ఉన్నదనుకుంటే; దానిని అణువుల రూపములో మనము దర్శించగలగాలి, కానీ సూర్యుడు విశ్వబ్రహ్మాండమంతటా వ్యాపించియున్నట్లు ఈ చేతనత్వము కూడా శరీరమంతటా సంవ్యాప్తమైయుండి; ఆలోచనలు లేదా భావములు రూపములో బహిర్గతమౌతూ ఉంటుంది. ఈప్రకారముగా ప్రతి వ్యక్తికీ అతని యొక్క ఆలోచనల తాలూకా తరంగదైర్ఘ్యము ఉంటుంది. ఎక్కువగా భౌతికమైన స్వభావము, ఆలోచన, ప్రవర్తన కలిగిన వ్యక్తుల యొక్క తరంగదైర్ఘ్యము చాలా పరిమితముగానూ, దుర్గంధ భరితముగానూ ఉంటుంది. అందుచేతనే చెడ్డవారు తమ సమీపములోని వ్యక్తులను ప్రభావితము చెయ్యలేరు. అదే ఆలోచనాశీలురైన, విశేషప్రాణవంతులైన వ్యక్తులు సభా మండపాలలో కూర్చున్న వేలాదిమంది మనుష్యులను తమ భావపూరితమైన అభివ్యక్తీకరణతో కూడిన ఉపన్యాసములతో వందలాదిమందికి క్రొత్తశక్తినీ, ప్రేరణనూ ప్రసాదించి; కొంతసేపటిలోనే వాళ్ళ ఆలోచనా ధోరణిని చాలావరకు మార్చివేయగలుగుతారు. ఇటువంటి ప్రాణవంతులైన వ్యక్తులు ఆదికాలమునుండి ప్రజల జీవనగమనమును మార్చివేస్తూ యుగములలో పరివర్తన తీసుకొస్తూన్నారు.

మన శరీరము ఒకవిధముగా ఆకాశము వంటిది. చర్మమనే ఆవరణలో బంధించబడి, ఒకవిధమైన గురుత్వాకర్షణ శక్తి ద్వారా పృథ్వితో కట్టివేయబడివుండకపోతే మనము ఆకాశములో ఎక్కడో ఒకచోట తిరుగుతూవుండేవారము. సూక్ష్మముగా చెప్పాలంటే మన చేతనత్వము ఆలోచనలు-సంకల్పముల రూపములో ఆకాశతత్త్వములో తరంగితమౌతూ ఉంటుంది. భారతీయ యోగులు ఆ చేతనత్వమును వివిధ రకములైన ప్రాణాయామములు, ధ్యాన, ధారణ, సమాధి మొదలైన యౌగికక్రియల ద్వారా 'మనస్సు' అనే రూపంలోనికి నియంత్రించారు. నుదిటిపైన రెండు కనుబొమ్మల మధ్యనున్న ప్రదేశములో 'ఆజ్ఞాచక్రము' అనబడే స్థానమును ధ్యానము ద్వారా దర్శించవచ్చు. సహస్రాధిక కిరణములుగా వ్యాప్తిచెందినప్పటికీ, సూర్యుడు ఒక ఏకీకృతపుంజముగా బింబ రూపములో ఎలా అగుపిస్తాడో; ఆజ్ఞాచక్రము అనబడే స్థానములో కూడా అటువంటి కాంతినే దర్శించగలము. యావత్ సౌరమండలము యొక్క ప్రకృతిని నిర్ధారించేటటు వంటి, చెల్లాచెదరుగా వ్యాప్తిచెందిన సూర్యకిరణకణములలో కంటే అత్యధిక శక్తితో కూడిన వెలుతురు, విద్యుత్తు, ఉష్ణము సూర్యుని యొక్క ఏకీకృతపుంజము(సూర్యబింబము)లో ఉంటాయి. అదేవిధముగా మనస్సును శరీరము యొక్క అణువులలోని శక్తిగా నియంత్రించగలిగితే దాని శక్తి-సామర్థ్యములకు హద్దులే ఉండవు. ఇటువంటి మనస్సే ఎక్కడికైనా వెళ్ళగలదు, దేనినైనా చూడగలదు, ఎంత ప్రదేశ మైనా వ్యాపించగలదు. క్షణములలో అది ఎక్కడికంటే అక్కడకు వెళ్ళి తీగలేని టెలిగ్రామ్ వలె సందేశము నందించగలదు.

శక్తిని ప్రకాశరూపములో మార్చటమనేది అత్యంత జటిలమైన పని. కానీ ఈ శక్తి ఏదైనా పదార్థములోకి ప్రవేశిస్తే ఆ పదార్థము యొక్క పరమాణువులు ఉత్తేజితమౌతాయని శాస్త్రజ్ఞులకు తెలుసు, కానీ కొద్దిసేపటి తరువాత అవి శాంతపడి తమ పూర్వస్థితిలోనికి తిరిగి రాగలవు. అటువంటి శక్తిని ప్రకాశమువలె మార్చగలము. ఈ క్రియను 'సందీప్త' అంటారు. ఈ లక్షణమును సృష్టిలోని అన్ని ప్రాణులయందూ చూడవచ్చు. మనకు తెలియదుకానీ, మనిషి ఏమి ఆలోచిస్తున్నాడో, దానిని ఎంత దాచిపెట్టాలని చూసినా అది దాగదు అన్న విషయము శాస్త్రజ్ఞులకు తెలుసు. అది అత్యంత సూక్ష్మతరంగముల రూపములో బయటకు వస్తూంటుంది. ఆ తరంగముల కన్నా అతి సూక్ష్మమైన ఆత్మ-చేతనత్వము ద్వారా మనము ఆ తరంగాల్లోకి ప్రవేశించగలిగితే 'ఆ వ్యక్తి ఏమి ఆలోచిస్తున్నాడు? భవిష్యత్తును గురించి ఇతని ప్రణాళికలేమిటి?' మొదలైన విషయములన్నీ అవగతమౌతాయి. కానీ సర్వకాలసర్వావస్థల యందు అత్యంత స్వచ్ఛరూపములో మనము మనస్సును నియంత్రించగలిగినప్పుడే అది సాధ్యమౌతుంది.

కాంతిని వెలువరించే లేదా వెదజల్లే ఈ లక్షణము(దీనిని సందీప్తి అంటారు) 'జడవస్తువులకు మాత్రమే పరిమితము'

**ఎవరి అభిప్రాయాలో తెలుసుకుంటూ కూర్చుంటే నీ అంతరాత్మ స్వరాన్ని వినలేవు**

అని మొదట్లో ప్రజలు విశ్వసించేవారు. కానీ ఈ లక్షణము జీవధారులలో కూడా ఉన్నదని ఇప్పుడు స్పష్టమైనది. డా॥ట్రస్ట్ ఈ విజ్ఞానమును గురించి 'అణు ఔర్ ఆత్మా' అనే పుస్తకములో వివరించి ఆత్మవిజ్ఞానములోని ఈ కోణమును వెలుగులోకి తీసుకొచ్చి వైజ్ఞానికుల పరిశోధనకు ఒక క్రొత్త దిశను అందించారు. సాధారణముగా మనము ఫుంగీ, మధురికా, మిణుగురుపురుగులలో కాంతి వెదజల్లే స్వభావము ఉండటమును చూస్తుంటాము. మిణుగురుపురుగుల వంటి కొన్ని జీవులు సముద్రములోకూడా ఉంటాయి. అవి తమ శరీరములో జరిగే 'ఎంజైమీ ఆక్సీకరణ్' అనే ప్రక్రియ ద్వారా వెలువడే శక్తిని ప్రకాశరూపములోకి మార్చివేస్తాయి. ఈ కాంతియే వానిలో మినుకుమినుకుమంటూ కనపడుతుంటుంది. ఆడ మిణుగురుపురుగు కామంతో ఉత్తేజితమైనప్పుడు దాని శరీరములో ఉత్పన్నమయ్యే ఒక జీవరసాయనికక్రియలో 'లూసీఫెరస్ ఎంజైమ్, లూసీఫిరన్, ఎ.టీ.పీ. కాంపౌడ్' అనే రసాయనిక ద్రవాలు పాల్గొంటాయి. ఫలితముగా ఒక ప్రత్యేక రకమైన రసాయనికశక్తితరంగాలు ఉత్పన్నమౌతాయి. ఆ తరంగాలలో ఆడపురుగు యొక్క వాసన మిళితమైయుంటుంది. ఆ ప్రత్యేకమైన సూచనను మగపురుగు గుర్తించి ఆడపురుగు చెంతకు చేరుతుంది.

ఎంజైమ్ అనేది ఒకవిధమైన సూక్ష్మనాడీతంతువు. ఇది శ్వాసద్వారా లభించిన ఆక్సిజన్‌ను శరీరమంతటా వ్యాపింపజేసి జీవనీశక్తిని ఏర్పరచి వుంచుతుంది. మానసికశక్తులను స్వచ్ఛపరచడము కూడా ఎక్కువ భాగము ప్రాణాయామమును అభ్యసించడముపైన ఆధారపడి ఉంటుంది. ప్రాణాయామములో గాలిలో ఉండే ప్రాణతత్త్వమును స్వీకరించుట ద్వారా మనస్సును తేజోవంతంగానూ, మలినరహితంగానూ తీర్చిదిద్దుకోగలము.

క్రీ.శ. 1967 లో డా॥హార్ట్‌లైన్ అనే వ్యక్తి మొట్టమొదటిసారి నేత్రములలోని కణముల నుండి వెలువడే విద్యుత్ ఆ వేగములను ఎలక్ట్రానిక్ విధానం ద్వారా నమోదుచేసి 'ప్రతి ఒక్క కణములో ఆ బింబము యొక్క అత్యంత సూక్ష్మమైన రంగు, ఆకారము, వెలువడే గీతలు మొదలైన అంశములన్నీ నిహితమై ఉంటాయనీ, ప్రతి ఒక్క కణమూ ఒక్క సెకెండ్‌లో కోటివంతు సమయములోనే ఆ ప్రతిబింబము యొక్క తరువాతి కణమును దాటివేస్తుందనీ, ఈప్రకారముగా ఎదుట కనపడుతున్న బింబము కాంతివేగముతో సూచించబడుతూ మెదడులోని దృశ్య స్థానము (ఆప్టిక్‌సెంటర్) వరకూ చేరుకుంటుంది' అని వివరించాడు.

ఈ దృశ్యమును మనస్సు ద్వారా ప్రకృతిలోని ప్రాణవిద్యుత్తు ప్రవాహములో మిళితముచేసి మన మెదడులో ఏర్పడ్డ ఆ దృశ్యమును ఎక్కడో దూర ప్రదేశములో ఉన్న ఏ వ్యక్తికైనా పంపించగలము. ప్రస్తుతకాలములో అమలులో ఉన్న ఉపగ్రహసంచారపద్ధతికి ఇది పుష్టిని చేకూర్చుతుంది. శాటిలైట్ కదలికల ద్వారా ఈనాడు ఎక్కడో లండన్‌లో జరుగుతున్న ఒక శస్త్రచికిత్సను ప్రపంచవ్యాప్తముగా ఎంతోమంది వైద్యులు వీక్షించగలుగుతున్నది ఈ విధానము వల్లనే! రాయల్‌ఫ్రీ ఆసుపత్రిలోని శస్త్రచికిత్సకులు చేస్తున్న పరీక్షలను మేంఛస్టర్‌లోని వైద్యకళాశాల విద్యార్థులు చూడగలిగారు. ఇందులో భారతీయ విద్యార్థులతో సహా 2000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రణాళిక ద్వారా ఏ దృశ్యమునైనా ఫోటోసెల్స్ మాధ్యమంగా పృథ్వి చుట్టూ తిరుగుతూన్న 8 సంచార ఉపగ్రహాలకు(టెలీస్టార్) పంపించడము జరిగింది. ఆ సంచార ఉపగ్రహం దానిని ఒక నియమిత తరంగదైర్ఘ్యము మీద యావత్ ప్రపంచానికీ వ్యాపింపజేసింది. ఈవిధముగా ఒకే దృశ్యమును మొత్తము ప్రపంచమంతటికీ వ్యాపింపజేయుట సాధ్యమైనది. దూరంగా ఉన్న దృశ్యములను చూడగలిగిన కాంతిపరమాణువుల మీద పడే బింబములను ఒక శక్తిప్రవాహములోకి ప్రవహింపజేసి తీసుకురావటము లేదా పంపించడము అనేది జరుగుతుంది. దీనిని నియంత్రణలో ఉన్న మనస్సుతో సాధ్యము చెయ్యవచ్చు. మనము ఎవరో ఒక వ్యక్తి మనస్సులోకి హఠాత్తుగా ఒక సందేశమును లేదా దృశ్యమును పంపించగలగటమే కాదు, వినగలము, చూడగలము కూడా! ఇదంతా ఆ కాంతి అణువులు, అందులో వ్యాపించివున్న చేతనత్వము యొక్క అద్భుతమే!

క్రీ.శ. 1927లో డా॥ కిలిట్టన్, లిస్టర్‌ఎచ్. జరమర్, డేవీసన్ అనే ముగ్గురు శాస్త్రవేత్తలు న్యూయార్క్‌నగరములోని బైల్ టెలీఫోన్ ప్రయోగశాలలో జరిపిన పరిశోధనల ఆధారముగా ఎలక్ట్రాన్ అనేది ద్వంద్వప్రకృతి కలిగిన పదార్థము అంటే అది ఒక అణువులాగా పనిచెయ్యగలదు, ఒక అల (తరంగము)

**ఖాతాదారుడు అడగనిది కూడా ఇచ్చి ఉక్కిరిబిక్కిరి చేసినప్పుడే నీవు విపణిలో నిలుస్తావు-గెలుస్తావు**

లాగా కూడా పనిచెయ్యగలదు అని కనుగొన్నారు. దాని వేగము ఒక సెకెండుకు 31,050 మైళ్ళుంటుంది అని తెలుసుకున్నారు. ఈ పరిశోధనకుగానూ వారికి నోబెల్ పురస్కారము లభించినది. ఎలక్ట్రాన్ వలెనే ప్రకాశము(కాంతి) కూడా ఒక అణువు రూపములో స్థిరమైనదీ, గతిశీలమైనదీ కూడా!' ఆర్థర్ ఎడింగ్టన్ 'నేచర్ ఆఫ్ ది ఫిజికల్‌వరల్డ్' అనే పుస్తకములో 'కాంతి కూడా చిన్నచిన్న ముక్కలుగా విభజించబడగలదు' అని వ్రాశాడు. ఇలా కదులుతూన్న అణువులను ఫోటాన్స్ అంటారు. వీటిని ఫ్లోరసెంట్ తెరమీద చూడవచ్చు. వీటి వేగము ఒక సెకనుకి 1,86,300 మైళ్ళు అనగా ఎలక్ట్రాన్‌కన్నా 6 రెట్లు అధిక వేగము కలిగియుంటాయి.

ఎలక్ట్రాన్, కాంతి అనేవి శక్తిరూపములైతే; పదార్థము, అణువు, తరంగము......మొదలైనవి కూడా 'శక్తి'రూపములే! ఎలక్ట్రాన్ అనేది సృష్టిలోని ప్రతిఅణువులోనూ ఉంది, కానీ వాటంతట అవి ఉత్పన్నము కావు. అలాగే ప్రకాశము యావత్ బ్రహ్మాండమంతా వ్యాపించగలదుకానీ స్వయముగా తాను ఉత్పన్నము కాలేదు. ఋషులు ప్రతిపాదించిన 'మాయావాద' సిద్ధాంతము వరకూ చేరుకొనగలిగిన ఐన్‌స్టీన్ తన జీవితచరమ దశలో కాలము, స్థానము.... ఇవి రెండూ సాపేక్షరీతిలో ఉంటాయనీ, అవి కాంతి యొక్క కొలత మీద ఆధారపడి ఉంటాయి. Relativity, time and space is with reference towards stick of light అని చెప్పాడు. అప్పుడు ఆయన 'విద్యుదయస్కాంతశక్తి, గురుత్వాకర్షణశక్తి రెండూ ఉన్న యూనిఫైడ్‌ఫీల్డ్' గురించి ఋజువు చెయ్యటానికి ప్రయత్నించేవాడు. ఈ క్షేత్రము పైనచెప్పిన రెండింటినీ కలిగి ఉంటుంది, వాని నుండి విడివడి ఉంటుంది కూడా. ఇది ఎలక్ట్రాన్ వలె ద్వంద్వ లక్షణములను కలిగియుంటుంది. దీని అస్థిత్వమును ఐన్‌స్టీన్ వ్యతిరేకించలేదు కూడా. ఐతే మస్తిష్కీయద్రవమునకు (మైండ్‌స్టఫ్) ఒక లక్షణమున్నది. అదేమిటంటే సమయమునకు, కాలమునకు ఆ ద్రవము అతీతముగా ఉంటుంది. అది స్థిరముగా ఉన్నా, చలనములో ఉన్నా తేడా ఏమీ ఉండదు. అది ఏకకాలములో కలకత్తాలో ఉన్నా; ముంబైలో ఉంటుంది. అదే సమయములో మధురలో కూడా ఉండగలదు. ప్రకాశమును స్వీకరించి(ధారణ చేసి) ఆ కాంతి యొక్క వేగముతో ఏ పదార్థమునైనా ఒక చోటనుండి మరియొక స్థలమునకు బదిలీ కూడా చేయగలిగే తత్త్వమిదే. పదార్థమును శక్తిగా మార్చి, దానిని ఎక్కడికైనా సూక్ష్మఅణువుల రూపములో ప్రవహింపజేసి తీసికొనిపోగలదు. దానిని సెకెండుకన్నా తక్కువ వ్యవధిలోనే మార్చివేయగలదు.

యోగులు, సాధకులు మస్తిష్కములోని ఈ ఏకాంతక్షేత్రము మీద మనస్సును కేంద్రీకరించి; ఎలక్ట్రాన్స్, ప్రకాశకణములు (లేదా కాంతి అణువుల) ద్వారా ($E=MC^2$)ను ఆధారముగా చేసుకొని తమలో నుండి శక్తిని ఉత్పన్నము చెయ్యగలరు. ఆ శక్తి అన్నివిధములైన పరమాణుశక్తికన్నాకూడా ఎక్కువగానే ఉంటుంది. అందులో ఎలక్ట్రాన్స్, ప్రకాశఅణువుల ద్వైతశక్తి ఇమిడి ఉంటుంది. ఆ శక్తి యొక్క సహాయముతో వారు 'అతీంద్రియ సంఘటనల' రూపములో ప్రకటీకృతమయ్యే స్థూల-సూక్ష్మక్రియలను నిర్వహించగలరు.

*- పూజ్యగురుదేవుల వాఙ్మయం 17 (11.2) నుండి*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## అహంకారానికి మూలం అజ్ఞానం

*సూర్యుని యొక్క ప్రకాశాన్ని అందిపుచ్చుకొని రెండు కిరణాలు బయలుదేరాయి. ఒకటి బురదగుంటపై ప్రసరింపగా రెండవది ప్రక్కనున్న ఉదయించే కమలంపై ప్రసరించింది. కమలంపై ప్రసరించిన కిరణం రెండవ దానితో ఇలా అన్నది - "చూడు! నా నుండి దూరంగా ఉండు. నన్ను తాకి, నన్ను అపవిత్రం గావించవద్దు." బురదలో ప్రసరించుచున్న కిరణం పై మాటలు విని నవ్వి ఇలా అంది. "చెల్లీ! ఏ సూర్యుని నుండి మనమిరువురము ప్రకాశాన్ని తీసికొని బయలుదేరామో, ఆ సూర్యుడు తన ప్రకాశాన్ని తరతమ భేదాలు, ఉచ్చనీచాలు పాటింపక విశ్వమంతటా వ్యాప్తిగావించుచున్నాడు. మరి మన మధ్య ఈ భేదాలు పొడచూపుట ధర్మమా? ఇంతేకాక నేను ఈ బురదను ఎండగట్టనిచో నీవు ఆవరించిన ఈ కమలానికి కావలసిన ఆహారం ఎలా లభిస్తుంది?" అన్నది. ఈ మాటలు విన్న రెండవ కిరణం తన అహంకారానికి సిగ్గుపడింది.*

*- అనువాదం: ఎ. శారద*

**రిద్ధి-సిద్ధులతో కాక, ఉన్నత ఆలోచనల ద్వారా మాత్రమే సమాజం సన్మార్గంలో పయనిస్తుంది**

కబీర్‌దాస్ జయంతి ప్రత్యేకం

# ధార్మికతలోని అభిప్రాయభేదాల సమన్వయకర్త సంత్ కబీర్



దాదాపు 1800 సంవత్సరంలో ఢిల్లీ పాదుషా సికిందర్‌లోడీ బెనారస్‌కు వచ్చాడు. ఆ నగరంలో కబీర్ అనే ఉపదేశకుడు ప్రజలనందరినీ ఇస్లాంకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నాడు అని ఒక ముస్లిం ఆయనకు ఫిర్యాదు చేశాడు. కబీర్ వల్ల ముస్లింలు ఖురాన్ చెప్పిన మార్గమును వదిలి హిందువుల వలె ధ్యానము, భజన చేస్తున్నారు. ప్రముఖ హిందువులు కూడా పరంపరగా వస్తున్న ధార్మిక, సామాజిక నియమాలను ఖండిస్తున్నాడని కబీర్‌ను అధిక్షేపిస్తున్నారు. ఆయన ప్రేరేపిస్తున్న మార్గంలో నడిస్తే ఆ వ్యక్తి అటు హిందువు కాకుండా, ముస్లిం కాకుండా పోతాడు. అతనే స్వయంగా గురువుగా మారి తన క్రొత్త మార్గాన్ని నడుపు కుంటున్నాడు.

ఐతే ధర్మము పేరుతో ఒకే వ్యక్తికి విరుద్ధంగా హిందువులు, ముస్లింలు ఆరోపణలు చేయడమనేదే ఒక క్రొత్త విషయం. అందుచేత సికందర్‌లోడీ ఒక పరిపాలకుని స్థానంలో ఉండి కబీరును దర్బారుకు హాజరు కావాలని ఆజ్ఞాపించాడు. ఆయన రాగానే ఆయనపై హిందువులు, ముస్లింలు చేసిన ఆరోపణల గురించి చెప్పి భవిష్యత్తులో ఈరకమైన సిద్ధాంతాలను ప్రచారం చేయరాదని శాసించాడు. ప్రభుత్వ నిర్ణయాన్ని విన్న కబీర్ ఇలా చెప్పారు –

**హిందూ తురక్ కహా సే ఆయా కిన్ యహ్ రాహ్ చలాఈ ।**
**హిందూ తురక్ కీ ఏక్ రాహ్ హై సద్గురు ఇహై బతాఈ ॥**

కబీర్‌సాహెబ్ ఇలా అన్నారు. 'హిందూ, ముస్లింల ధర్మాలు అసలు ఎక్కడి నుండి వచ్చాయి? ఇవి సృష్టి మొదలు నుండి లేవు. మధ్యలో ఆచార్యులు, ధర్మోపదేశకులు ఎవరో ప్రచారం లోకి తెచ్చారు. ఇవి పరమాత్మ ద్వారా ప్రేరేపింపబడినవే అయితే వీటిమధ్య ఇంత ఎక్కువగా భేదభావాలు కనిపించవు, వీటిని అనుసరించేవారు కూడా తమలో తాము ఇలా పోట్లాడుకోరు. దీనివల్ల మనకు తెలిసేదేమిటంటే ఈ సిద్ధాంతాలలో కొన్ని పొరపాట్లు ఉండి ఉండాలి లేదా తరువాత వచ్చిన క్రొత్తక్రొత్త ప్రచారకులు, ఆచార్యులు వీటిలో పరస్పర విరుద్ధములైన పరివర్తనలు తీసుకువచ్చి ఉండాలి. ఏది ఏమైనా సరే హానికరమైన ఇటువంటి భేదాభిప్రాయాలను చూస్తూ ఉండకుండా ఆ రెండింటి మధ్య సమన్వయం చేస్తే జీవితాన్ని సార్థక పరచుకునేందుకు అవసరమైన సులభతరమైన, నిజమైన సిద్ధాంతాలను ఆచరించడం గురించి ప్రతివారికి అర్థమయ్యేలా వివరించడంలో దోషమేముంది?

ఐతే ఈ ప్రపంచం ఇటువంటి తర్కానికి, న్యాయపూరిత విషయాలకు మద్దతునిచ్చేందుకు ముందుకు రాకపోవడం సహజమే. హిందువులు, ముస్లిం సంప్రదాయా లకు చెందిన గురువులలో అహంకారము మరియు స్వార్థము పూర్తిగా నిండిపోవడంతో క్రొత్త గురువులెవరైనా వచ్చి వారి ప్రభావం నుండి ప్రజలను విడదీసి తమ అనుయాయులుగా మార్చుకుంటే వారు సహించలేరు. అందుకు వారు సిద్ధంగా కూడా లేరు. ఇటువంటి ధర్మజీవులు చాలామంది కలిసి బాద్‌షాని కూడా దారి తప్పించారు. మరీ ముఖ్యంగా ముస్లిం ధర్మానికి హాని కలుగవచ్చునని భయపెట్టారు. ఆ ముస్లిం బాద్‌షా కూడా కత్తి చూపించైనా సరే ధర్మప్రచారం చేయాలి అనే నమ్మకాన్ని నమ్ముతాడు. అందుచేత కబీరు దండనకు అర్హుడేనని భావించాడు. కబీర్‌పంథాని అనుసరించేవారి కథనాన్నిబట్టి బాద్‌షా 52 రకాల ఉపాయాలు పన్ని కబీర్‌ను చంపాలని ప్రయత్నించారు. ఐతే దైవీశక్తి ప్రభావం వల్లనో, చమత్కారంగానో వారు సఫలీకృతులు కాలేకపోయారు. మిగిలిన ప్రజల అభిప్రాయం ప్రకారం కాశీ జనాభాలో ఎక్కువ భాగం ప్రజలు కబీర్‌సాహెబ్ యొక్క స్వచ్ఛమైన పరోపకార గుణమునకు ప్రభావితులైనారు. అదంతా చూసిన చక్రవర్తి ఆయనను వదిలివేయడమే మంచిదని భావించాడు. ఏం జరిగినా సరే సత్యమార్గమును విడనాడని కబీర్ వంటి మహాపురుషులు అన్యాయం ముందు తలవంచరు. చివరగా

**వ్యక్తి పురుషార్థానికి సమర్థగురు మార్గదర్శనం, ఈశ్వరీయకృప తోడైనప్పుడు జీవితంలో సౌభాగ్యోదయం జరుగుతుంది**

ఆత్మశక్తే వారిని విజేతలుగా నిలబెడుతుంది.

కబీర్‌గారి జన్మవిషయంలో చాలా అభిప్రాయాలు ఉన్నాయి. ఆయన సద్యఃజాతశిశువు రూపంలో కాశీలోని లహర్‌తారా సరస్సు సమీపంలో నివసించే నీరూ అనే సాలెవానికి లభించారని చాలామంది అభిప్రాయపడతారు. కొంతమంది ఆయన నీరూ కుమారుడేనని చెప్తారు. ఏమైనా కానీ ఆయన నీరూ (తండ్రి), నీమా (తల్లి) ల పుత్రునిగానే ప్రసిద్ధికెక్కారు. ఆయన తన రచనలలో తను సాలెజాతికి చెందిన వాడినేనని వ్రాశారు. బాల్యావస్థలో సాధు-సత్పురుషుల మాటలు విని ఆయన హృదయంలో భక్తిభావన ఉత్పన్నమైంది. ఆయన చాలా సరళభావముతో భగవంతుడిని భజిస్తుండేవారు. ఐతే ప్రజలు భగవంతుడిని నిజమైన అంత:కరణతో నమ్మడానికి ఎక్కువ విలువనివ్వరు అని ఆయనకు చాలా త్వరగానే అర్థమైంది. వారు ముందుగా జాతి, సంప్రదాయములకే విలువ ఇస్తారని తెలుసుకున్నాడు. కబీర్‌ను కలిసిన ప్రతి వ్యక్తి ముందుగా అడిగే ప్రశ్న నీవు హిందువా, ముస్లిమా? అని మాత్రమే. అలాంటప్పుడు అటువంటి ప్రశ్నలు విని ఆయన ఎలా సంతోషపడతారు? హిందువులు ఆయనను ముస్లింగా భావించి దగ్గర కూర్చునేందుకు వ్యతిరేకిస్తుంటే ముస్లింలు రామనామం చేస్తాడనే కారణంతో ఆయనకు దూరంగా ఉండేవారు.

ఐతే కబీర్‌సాహెబ్ తన సిద్ధాంతాల విషయంలో చాలా కచ్చితంగా ఉండేవారు. సత్యమనేది ఎటువంటి సంప్రదాయాలకు బంధింపబడి ఉండదని ఆయనకు బాగా తెలుసు. ఎవరు నిష్పక్షపాతంగా తమ అంతరాత్మ లోతుల్లోకి దిగి ఆ వెలుతురులో దానిని శోధిస్తారో వారే దానిని పొందగలుగుతారు. ఆయన స్వతంత్ర చింతన ద్వారా దానిని చిన్నతనంలోనే పొందడమే కాదు.'**దుఈ జగదీష్ కహా సే ఆయా**' అని ఎలుగెత్తి చెప్పారు. దీనితో పాటే హిందూ-ముస్లింలకున్న అంధవిశ్వాసములు, సంప్రదాయవాదములను కూడా ఆయన బాగా విమర్శించారు. ముస్లింలను 'అల్లా చెవిటి వాడైపోయాడా ఏమిటి, అంత గట్టిగా పిలుస్తున్నారు' అంటూ... '**వే హలాల్ వే ఝట్‌కా మారే ఆగ్ దుగున్ ఘర్ లాగీ**'... (అంటే సంప్రదాయం కొట్టిన దెబ్బకి ఇంట్లో నిప్పు రెట్టింపైంది) అని వారికి చెంపపెట్టు వలె చెప్పారు. ఇంకా-'మూఢులారా! ధర్మం పేరుతో ఆవుల్ని, మేకల్ని చంపి మిమ్మల్ని మీరే పొగుడుకుంటున్నారు, అసలు ధర్మం యొక్క మొదటి లక్షణమే బాధలు, కష్టాలలో ఉన్నవారికి సహాయపడడం, వారిని రక్షించడం. ఇవి తప్ప మిగిలిన బాహ్య కర్మకాండ అంతా ఒక ఆడంబరమే' అని వీలైనంత కటువుగా చెప్పారు. ఆయనింత కటువుగా విమర్శించడం వల్ల పాత ఆలోచనలు, సంకీర్ణ మనోప్రవృత్తి ఉన్న చాలామంది వ్యక్తులు ఆయనకు విరోధులైనారు.

కాశీ భారతదేశానికి సర్వప్రథమ తీర్థస్థానము. హిందూ ధర్మానికి కేంద్రంగా చెప్పబడింది. ఏదైనా ధర్మసంబంధమైన సమస్య వస్తే దానిని పరిష్కరించే విధానానికి ఇప్పటికీ అక్కడి పండితులకు ప్రజలు వేలాది రూపాయలు బహుమతులుగా ఇస్తారు. లోకమాన్యతిలక్‌కు విదేశీ ప్రయాణం ఏర్పాటు చేసేందుకై కాశీలోని ఒక శాస్త్రి ఐదువేల రూపాయలు అడిగాడు. ఈనాడే ఇలా ఉంటే 500 సంవత్సరాలకు ముందు ఎలా ఉండి ఉంటుంది?

ఆ కాలంలో అక్షరాస్యత అనేది దాదాపు శూన్యంగా ఉండేది. ఖ్యాతి ఉన్నవారినే పూజించేవారు. అదే ధర్మము యొక్క ముఖ్య అంగముగా భావించబడేది. అలాంటి రోజుల్లో ఈ పండితులు, పురోహితులు అనేవారి ప్రభావం ఎంత ఎక్కువగా ఉండి ఉంటుందో ఊహించుకోవడం సాధ్యమే. వీరంతా కబీరును రకరకాలుగా వేధించారు. నిజమైన సాధువుపై ఇటువంటి మాటల ప్రభావం పడడం అసాధ్యమే. ఆయన తనకు అపకారం చేసిన వారిని కూడా క్షమించేవారు. దీని ఫలితంగా కొంతమంది మినహా మిగిలిన వారంతా ఆయన గొప్పతనాన్ని అర్థం చేసుకున్నారు. కబీర్ సాహెబ్ సిద్ధాంతాలు ఆయన జీవితకాలంలో చాలా ఎక్కువగానే ప్రచారంలోకి వచ్చాయి.

కబీర్ చిన్న, పెద్ద అనే తేడాను చూపించలేదు. ఆయన జ్ఞానమార్గావలంబకుడు. ఈ తత్త్వాన్నే ఉపనిషత్తులలో 'ఆత్మ అనేది బ్రాహ్మణులకు, శూద్రులు ఇరువురికి ఒకటే ఉంటుంది' అని చెప్పబడింది. ఈ యుగంలో గాంధీజీ శూద్రుల ఉన్నతి కొరకై వారికి హరిజనులు అని నామకరణం చేసి వారు ముందుకు వెళ్ళేందుకు ప్రేరణనిచ్చారు. ఐతే 500 సంవత్సరాలకు ముందే కబీర్ 'హరిజన్ సవీన్ జాతి' అనగా హరిజనులను మించిన జాతి ఏదీ లేదు అని చెప్పారు అంటే ఆయన ఈ మాట కేవలం శూద్రులకు మాత్రమే వాడలేదు, అది ఆయన ఉద్దేశ్యం కాదు. వారు పైకి ఎదిగేందుకు ఒక మార్గాన్ని ఆయన

**ఆధ్యాత్మికతలో అన్నీ ప్రయోగాలే! మనస్సు ఓ పరికరం! దేహమే ప్రయోగశాల!**

చూపించారు. వారు కూడా తమ జీవితాన్ని శుద్ధముగా, భక్తియుతంగా మార్చుకొని ఉన్నత జాతులతో సమానంగా నిలబడతారని చెప్పారు. భారతదేశంలో కొద్ది కాలం నుండి గొప్ప, పేద అనే తారతమ్య ప్రవృత్తి మొదలైంది. దీన్ని కబీరు తీవ్రంగా దెబ్బకొట్టారు. నిజానికి ఈ దోషం వర్ణ వ్యవస్థల యొక్క సిద్ధాంతాలది కాదు. ఇటువంటి సంగతనల వల్ల అనవసరమైన పనులు చాలా చక్కగా జరిగిపోతుంటాయని చాలామంది విదేశీయుల అభిప్రాయం. అందుచేత ఇది ప్రాచీన కాలంలో వలె గుణ-కర్మల ఆధారంగానే నడపాలి. కబీర్ శిక్షణ దీనికి దగ్గరగా ఉంటుంది. ఆయన కోట్లాది మంది అస్పృశ్యులను పైకి లేపడమనే అభినందించదగ్గ పని చేశారు.

కబీర్ జీవితంలో అనుకరించవలసిన విషయం ఏమంటే ఆయన శారీరిక శ్రమ విలువను గౌరవించారు. తన కులవృత్తిని ఆయన ఎన్నడూ వీడలేదు. గాంధీజీ ఎలా రాట్నం వడకడానికి ఒక ధర్మకార్యమనే రూపును ఇచ్చారో అదేవిధంగా కబీర్ వస్త్రాలు నేయడంలోనే భగవానుని పట్ల భక్తిని, ఆధ్యాత్మిక ప్రగతిని అనుభూతి చెందారు. ఆయన ఒక మహాసాధువు అయి ఉండి కూడా తను కష్టపడి సంపాదించిన దానిలోనే జీవితాన్ని గడిపారు.

ఈవిధంగా కబీర్ సామాన్య ప్రజలకు సత్యము, నిజాయితీ, పరోపకారములతో కూడిన జీవితాన్ని గడుపుతూ సమాజంలో గౌరవనీయమైన స్థితిని ఎలా పొందాలో మనకు మార్గదర్శనం చేశారు. ఐనప్పటికీ ఈనాడు ధనానికి చాలా ఎక్కువ గౌరవం లభిస్తున్నది. దానితోనే మనిషి చిన్న-పెద్ద అని గుర్తింపబడుతున్నాడు. ఇది మహాపురుషుల సిద్ధాంతానికి వ్యతిరేకమైనది. బుద్ధుడు మొదలైనవారు జ్ఞానము, శ్రేష్ఠతకు ఆధారంగా అతని వ్యక్తిత్వము, నైతికత, పరోపకారగుణము లేనని చెప్పారు. సంత్‌కబీర్ కూడా ఈ మార్గావలంబుడే. ఆయన పేదరికాన్ని ప్రశంసిస్తూ **'మాయా మహా ఠగినీకుజానీ'** అని ప్రపంచంలోని వైభవాన్నంతటినీ ప్రక్కకు తోసేశారు. అందువల్లనే ఈ నూతనయుగంలో కూడా పండిత జవహర్‌లాల్ నెహ్రూ వంటి ఆధునిక విచారాలున్న మహానుభావులు కూడా కబీర్ గొప్పతనాన్ని గౌరవించి తమ ప్రసిద్ధగ్రంథమైన ప్రపంచ చరిత్రలో ఒక ఘట్టంగా దీన్ని వ్రాశారు.

కబీర్ చాలా గొప్ప లోకప్రియుడైనాడు. దూరదూర గ్రామాల్లో ఉన్న హిందువులు ఆయనను భజించేవారు, ఆయన అందరికీ పరిచయస్థుడే. ఆయన హిందువూ కాదు, ముస్లిమూ కాదు, వారిరువురికి మధ్యలో ఉండేవారు. ఇరు సాంప్రదాయాలకు చెందిన అన్ని జాతులలోను ఆయనకు అనుయాయులున్నారు. ఆయన మరణించినప్పుడు ఆయనపై ఒక ఉత్తరీయం కప్పారు. హిందూ శిష్యులు ఆయనను దహనం చేయాలని, ముస్లిం శిష్యులు ఆయనను ఖననం చేయాలని పట్టుబట్టారు. ఇరువురి మధ్య దీనిపై వివాదం పెరిగిపోయింది. ఐతే ఆయనపై కప్పిన ఉత్తరీయం తొలగించి చూడగానే శరీరం మాయమై అప్పుడే కోసినట్లున్న తాజాపూలు మాత్రం మిగిలాయి. ఈ కథ బహుశా కల్పన కావచ్చు. కానీ అందమైన కథ!

కబీర్ చదువుకున్నవాడు కాదు. అంటే ఆయన చేత్తో ఏనాడూ కలాన్ని పట్టుకోలేదు. ఐనప్పటికీ సహజజ్ఞానంతో సదాచరణ అనే మార్గముపై నడిచి ఒక అమరత్వపదవిని సిద్ధింపజేసుకున్నాడు. ఆయన బాహ్యంగా చేసే పూజా, పారాయణలకు బదులు సేవాధర్మానికి ఎక్కువ విలువ నిచ్చేవారు. సర్వత్రా భగవంతుని విభూతిని అనుభవిస్తుండేవారు.

ఆయన సమాజంలో వ్యాపించియున్న దుష్ప్రవృత్తులను నిర్మూలించేందుకై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. జీవహింస చేసేవారిని చీవాట్లు పెడుతూ ఇలా అన్నారు,

**'బకరా మార్ భైంసా పర్ ధావే, దిల్ సే హర్ద్ న భాఈ'.**

వీటితో పాటు ముస్లింలకు కూడా-'కేవలం పరోపకారము, ఇతరులకు మేలు చేయాలనుకోవడమే అన్నింటికంటే గొప్ప లక్షణం' అని చెప్తూ ఇలా ఉపదేశించారు. అన్నింటికంటే గొప్పది మానవతా లక్షణం

**'జాతే మూ కాంటా బువే, తాహి బోహి తూఫూల్'.**

ఆయన సర్వవ్యాపియైన భగవంతుడి గురించి ఇలా చెప్పేవారు. 'మోకో కహా ఢూంఢే బన్దే, మైతో తేరే పాస్ మే' (అనగా పిచ్చివాళ్ళల్లారా! నన్నెక్కడెక్కడో ఎందుకు వెతుక్కుంటు న్నారు, నేను మీ దగ్గరే ఉన్నాను.)

ఆ కాలంలో అక్షరాస్యత అనేది దాదాపు శూన్యంగా ఉండేది. ఖ్యాతి ఉన్నవారినే పూజించేవారు. అదే ధర్మము యొక్క ముఖ్య అంగముగా భావించబడేది. అలాంటి రోజుల్లో ఈ పండితులు, పురోహితులు అనేవారి ప్రభావం ఎంత ఎక్కువగా ఉండి ఉంటుందో ఊహించుకోవడం సాధ్యమే.

**తనను తాను గుర్తెరుగుటే ఆధ్యాత్మిక సాధనలో తొలిమెట్టు**

వీరంతా కబీరును రకరకాలుగా వేధించారు. నిజమైన సాధువుపై ఇటువంటి మాటల ప్రభావం పడడం అసాధ్యమే. ఆయన తనకు అపకారం చేసినవారిని కూడా క్షమించేవారు. దీని ఫలితంగా కొంతమంది మినహా మిగిలినవారంతా ఆయన గొప్పతనాన్ని అర్థం చేసుకున్నారు. కబీర్ సాహెబ్ సిద్ధాంతాలు ఆయన జీవితకాలంలో చాలా ఎక్కువగానే ప్రచారంలోకి వచ్చాయి.

ఆయన ధర్మమునందు గ్రుడ్డిగా శ్రద్ధ పెట్టడమనే విధానానికి విరోధి. తన గురించి తాను చెప్తూ 'జబ్ లగ్ దేఖే, న అపనే నయనామ్, తబ్ లగ్ నమానో గురూకీ బౌనా' అన్నారు. ఈవిధంగా ప్రజలకు సత్యధర్మముల యందు మంచి శిక్షణను ఆయన జీవితాంతం నేర్పించారు. అటువంటి సంత్ కబీర్‌దాస్ గురించి జన్మించినది మొదలు చనిపోయేంత వరకు, ఆ తరువాత కూడా ఎన్నో చమత్కారాలు, పుకార్లు ఉన్నాయి. అవన్నీ ఎంత సత్యమో, ఎంత కల్పితమో అనే చర్చ అనవసరం. కానీ మధ్యకాలంలో ఇటువంటి చమత్కారాలు, గ్రుడ్డి నమ్మకాలు, ముల్లాలు మున్నవారిచే నిర్మించబడిన అంధ పరంపరలు మొదలుకొని సమాజంలోని అన్నిరకాల దురాచారాలపై ఆయన గట్టి దెబ్బలు కొడుతూనే ఉన్నారు. అటువంటి పని ఆ కాలంలో మిగిలిన ఏ మహాత్ములు కానీ, అధ్యాత్మవేత్తలు కానీ చేయలేదు.

ఆయన దృష్టిలో జాతిమతాలు, కులము, వంశము, కుటుంబము, పదవీ-ప్రతిష్ఠలు విలువైనవి కావు. వ్యక్తి యొక్క వ్యక్తిత్వము, ఆంతరిక నిష్ఠే విలువైనవి. నిజం చెప్పాలంటే సాధువులు- మామూలు మానవుల మధ్య తేడా గుర్తించేందుకు ఇది గీటురాయి లాంటిది. ఉన్నత బ్రాహ్మణకులంలో, రాజకులంలో జన్మించిన వ్యక్తి వ్యక్తిత్వం ఒక్కోసారి దిగజారి ఉండవచ్చు, అదేవిధంగా నిమ్నకులంలో పుట్టిన, నిరాకరించ బడిన, వెనుకబడిన కుటుంబంలో జన్మించిన వ్యక్తి తన ఆంతరిక శ్రేష్ఠత ద్వారా సాధు, మహాపురుషుల కోవకు చెందవచ్చు. కబీర్ జన్మించిన సమయంలో ప్రపంచంలోను, ఆధ్యాత్మిక జగత్తులోను కూడా ఇటువంటి నమ్మకాలే స్థిరపడిపోయి ఉన్నాయి. సమాజములో కానీ, రాజకుటుంబాలలో కానీ ప్రగతికి, శ్రేష్ఠత్వమునకు ఆధారము జాతి, వంశము కాదు. ఆధ్యాత్మిక క్షేత్రములో కూడా సాధన, ఆత్మకళ్యాణములలో అధికభాగం ఉన్నతకులాల వారికే అందుతుంది. సమాజంలోని ఈ పరంపరల వల్ల ఆధ్యాత్మిక క్షేత్రంలో చాలా దుష్ప్రభావం పడుతుంది. ఎందుకంటే దీనివల్ల వ్యక్తి వికాసానికి అవసరమైన సంభావనలన్నీ నశించిపోతాయి. అందువల్లనే సంత్‌కబీర్‌దాస్ ప్రప్రథమంగా ఈ నమ్మకాన్ని వమ్ము చేస్తూ ఇలా అన్నారు. 'సాధువు యొక్క జాతిని గురించి అడగవద్దు. కేవలం జ్ఞానాన్ని గురించి మాత్రమే అడుగు.' ఇటువంటి దురాచారాలెన్నో చాలాకాలంగా పాతుకుపోయి అవి అంధవిశ్వాసాల రూపంగా తిరిగి జన్మించాయి.

ఇంతకుముందు చెప్పినట్లే కబీర్‌దాస్ వంశము, కులము ఎవరికీ తెలియదు. కొంతవరకు తెలిసిన ప్రకారం సాలె వంశస్థుడైన నీరూ, నీమాల బిడ్డగానే పెరిగాడు, పెద్దవాడైన తరువాత తన సంరక్షకులైన తల్లిదండ్రుల వృత్తినే స్వీకరించాడు. కాశీ ఎంతో పవిత్రమైన తీర్థస్థానం. ఆరోజుల్లో ఒకరి తరువాత ఒకరుగా ఎంతోమంది సిద్ధులైన మహాపురుషులు కాశీకి చేరారు. వారి జీవనవాటికలో ధర్మసాధన మరియు ఈశ్వర ఉపాసన అనే కళతో వికసించిన పుష్పముల సుగంధాలు ఆ మహానగర మంతా వెదజల్లబడ్డాయి. వైష్ణవ సాధువైన స్వామిరామానందుల వారు అక్కడే నివసించేవారు. ఆ ప్రాంతపు ప్రజలపై వారు విశిష్ట ప్రభావాన్ని చూపించారు. హిందూ, ముస్లిం అనే భేదభావం లేకుండా ఆయన పట్ల అందరికీ అపారమైన శ్రద్ధా భక్తులు ఉండేవి. నీమాకు కూడా ఆయన పట్ల శ్రద్ధా విశ్వాసములు అపారంగా ఉండేవి. ఇలా కబీర్‌కొరకై నియమించబడిన తల్లిదండ్రుల శ్రద్ధాభావనలు కూడా ఆయనకు వారసత్వంగా లభించాయి.

సంత్‌కబీర్ కొంచెం పెద్దవాడు కాగానే ఆయన అంతః కరణపై ముద్రింపబడిన ఈశ్వరభక్తి అనే పుష్పము వికసించడం మొదలైంది. హృదయంలో స్వామిరామానందుల నుండి ఈశ్వర భక్తికి సంబంధించిన ఉపాసన, సాధన దీక్ష తీసుకోవాలనే తీవ్రమైన ఆకాంక్ష ఉండేది. కానీ తాను చేనేత కుటుంబానికి చెందినవాడు కావడం వల్ల, జాతిపరంగా ముస్లిం కావడం వల్ల స్వామివారు తాను దీక్షకు అనర్హుడినని అంటారేమోనని అనిశ్చితి ఉండేది. ఈ స్థితిని దృష్టిలో ఉంచుకొని కబీర్ ఒక ఉపాయాన్ని ఆలోచించాడు. దాంతో తన అనుమానమూ పోతుంది, రామానందులవారి శిష్యత్వమూ లభిస్తుంది. స్వామి రామానందులవారు ప్రతిరోజు బ్రాహ్మీముహూర్త సమయంలో గంగాస్నానానికి వెళ్లారు. కబీర్‌కి ఈ విషయం తెలియగానే

**నిజ జీవితాన్ని తెలుసుకోవాలన్నచో అనుభూతులు కావాలి**

అర్ధరాత్రి లేచి ముందుగానే ఆ ఘాట్(స్నానాలరేవు)కి వెళ్ళి ఆయన కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. సూర్యోదయం కావడానికి ఇంకా మూడు గంటల సమయం ఉందనగా రామానందులవారు వచ్చారు. ఆయన రాకముందే కబీర్ ఘాట్ మెట్లమీద పడుకున్నాడు. చుట్టూ చీకటిగా ఉండడం వల్ల మెట్లు దిగుతున్న స్వామీజీ కాలు కబీర్ శరీరంపై పడింది. తాను ఎవరినో కాలుతో త్రొక్కానని అర్థం కాగానే ఆయన 'రామరామ' అంటూ ఎగిరి ప్రక్కకు దూకారు. వెంటనే కబీర్ లేచి నుంచున్నాడు. లేచినుంచుని తనలో తాను సంతోషంతో ఇలా అనుకున్నాడు 'హమ్మయ్య లభించింది, ఇంక నాకే చింతా లేదు'.

స్వామీజీ ఆశ్చర్యంతో ఇలా అడిగారు-'ఏం లభించింది?' కబీర్-'నేను జాతిపరంగా సాలెవంశానికి చెందినవాడిని. మీ నుండి గురుదీక్ష తీసుకోవాలనుకున్నాను. ఇప్పుడు నాకు గురుమంత్రం లభించింది." స్వామీజీ ఆశ్చర్యంతో 'గురుదీక్ష తీసుకోవాలనుకుంటే నాతో చెప్పవచ్చు కదా! ఇలా పడుకున్నంత మాత్రాన ఏం లాభం వచ్చింది?' అన్నారు. కబీర్-'నేను ముస్లింననే కారణంగా తమరిచ్చే గురుదీక్షకు అర్హుడను కానంటారని అనుకున్నాను.' ఆనాటి లోకాచారాన్ని అనుసరించి, పరిణామ విపర్యయముల ననుసరించి ఎంతో జాగ్రత్తతో ఉంటూ చాతుర్యమును ప్రదర్శిస్తున్నప్పటికీ ధర్మము, ఆధ్యాత్మిక క్షేత్రంలో ఉన్న సందిగ్ధ పరిస్థితుల వల్ల ఈ మహా ముముక్షువుకు కూడా మొదటిమెట్టు ఎక్కేందుకు ఈ మార్గాన్ని ఎన్నుకోవలసి వచ్చింది. ఈ విచిత్ర శిష్యుడిని స్వామీజీ ఆలింగనం చేసుకొని 'ఇంతటి ప్రతిభాసంపన్నుడైన శిష్యుని కొరకే వెతికాను. వాడు దొరికాడు' అని అనుకున్నారు.

ధర్మక్షేత్రంలో మొలకెత్తుతున్న కపటం, ధూర్తవ్యవహారము, మోసం గురించి అన్ని విషయాలు స్వామీజీకి తెలుసు. దానిని నిర్మూలించేందుకు కబీర్ విశిష్ట భూమికను నిర్వహించ గలడని ఆయనకు మొదట కలిసినప్పుడే అర్థమైపోయింది. అందువల్ల కబీర్‌కు ధర్మము మరియు ఆధ్యాత్మిక సిద్ధాంతాల గురించిన జ్ఞానమునందించడంతో పాటు సాధనామార్గముపై కూడా ఆయనే నిలబెట్టారు. తాను ఈశ్వరుని పట్ల కంటే గురువు పట్లే ఎక్కువగా కృతజ్ఞత కలిగివుంటానని కబీర్ విశ్వసిస్తారు. దీనినిబట్టే ఆయన శ్రద్ధ ఎంతటిదో అర్థము చేసుకోవచ్చు.

**గురుగోవింద్ దోఊ ఖడే కాకే లాగూ పాయ్ ।**
**బలిహారీ గురు ఆప్‌నే గోవింద్ దియో బతాయ్ ॥**

అటువంటి ఆయన సాధువులను, మహాత్ములను ఎలా వ్యతిరేకిస్తారు? ఐనప్పటికీ ఆయన సాధువులకు, పండితులకు, ఖాజీలకు, ముల్లాలకు అందరికీ ప్రబల శత్రువుగా మారారు. నీచమైన స్వార్థమును నెరవేర్చుకునేందుకు ధర్మమనే పుణ్యక్షేత్రములో అనేక రకాల వికృతులను వ్యాపింపచేసి కలుషితం చేసిన ఆ వర్గము సాధారణ ప్రజల మేలు కోసం సుఖశాంతులను చూపించే మార్గదర్శనం చేయకుండా; వారి మనస్సులో మూఢనమ్మకాలు, హింస, పతనము, ఇంకా అనేక వ్యక్తిగత వికృతులు, సామాజిక దురాచారాలనే విషబీజాలను నాటారు.

కబీర్ సమాజంలో అప్పటివరకు విద్యాబుద్ధులతోను, ప్రగతిమార్గంలోను ముందుకు వెళ్ళేందుకు అవకాశమే లేని వర్గమును కూడా పైకి తీసుకువచ్చారు. ఆ వర్గము పట్ల అందరూ మానవత్వం, కనికరం లేకుండా వ్యవహరించేవారు. వారిని పశువులుగా భావించేవారు. ఆనాడు ఎంతోమంది ఖాజీలు మున్నగువారు ఈ వర్గమును జడులు అని ప్రకటించారు. ఇటువంటి వర్గాలు సముదాయాల యొక్క కుట్రల వల్ల కబీర్ వంటి వ్యక్తి జన్మించవలసి వస్తే అందులో ఆశ్చర్యపడేదేముంది? సమాజానికి పట్టిన నిద్రాస్థితిని విడగొట్టాలంటే ఎన్నో విశ్వాసాలు, నమ్మకాలు, ప్రతీకలపై తీవ్రమైన దెబ్బలు కొట్టక తప్పదు. అలా కొట్టి లేపకపోతే శ్రద్ధ, విశ్వాసాలను నిజమైన ధర్మము వైపుకు మరల్చడం చాలా కష్టం. ఈ రహస్యాన్ని కబీర్ చాలా లోతుగా అర్థం చేసుకొని, సూక్ష్మదృష్టితో గమనించారు. తమ తీక్షణమైన శైలితో ధర్మతంత్రము, అధ్యాత్మ స్థాపన అనేది కొంత సాధ్యపడింది. శాశ్వతసిద్ధాంతాల యొక్క జీవనమూల్యములను ఎంతో కొంత అవహేళన చేయకుండా, సాధుసత్పురుషుల గురించి చెప్పకుండా ఇది సంభవం కాదు. ఈ సత్యము కబీర్ యొక్క నరనరాల్లో కనపడుతుంది. (అవే కబీర్ వ్యంగ్యోక్తులు). సాధన, ఉపాసన, మంచి గుణములు, నడవడిక, సత్యము, న్యాయము, ప్రేమ, గురువు, శాస్త్రము, దర్శనములన్నింటిపట్ల లోతైన శ్రద్ధను వ్యక్తపరుచుటలో ఉన్న ఆవశ్యకతను ప్రతిపాదించుటలో తన సమకాలీనులందరి కంటే కబీర్ చాలా ముందుకెళ్ళిపోయారు.

*– అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**ఆలోచనలేనిదే ప్రగతి లేదు**

బోధ కథ

# గాయత్రీ భక్తి-మానవుని పంచమపురుషార్థము

'హరినారాయణగోవిందా, మాధవమోహన ముకుందా!' నామసంకీర్తనతోపాటు దేవర్షినారదుని వీణాఝుంకారము వినపడగానే గురువుల సంగీతవాద్యాలన్నీ మూగపోయాయి. నృత్యము చేస్తున్న అప్సరాంగనల పదభంగిమలు ఆగిపోయాయి. దేవరాజైన ఇంద్రుడు తన ఆసనము నుండి శీఘ్రమే లేచి, పారిజాతసుమాలను దోసిలి నిండా తీసుకొని దేవర్షినారదుడిని సమీపించాడు. ఐతే ప్రస్తుతము నారదులవారు ఎవ్వరి అర్చననూ సంపూర్ణముగా స్వీకరించే స్థితిలో లేరు. ఎవరు ఎప్పుడు తనకు సమస్కరిస్తున్నారు? అన్న విషయము మీద కూడా ఆయనకు దృష్టిలేదు. దేవేంద్రునికి మాత్రము నారద మునీంద్రుల పాదాలకు ప్రణమిల్లి పారిజాతసుమాలను అర్పించే అదృష్టము కలిగింది. ఇదికూడా తక్కువ సౌభాగ్యమేమీ కాదు! నమస్కరించడమైన పిదప సురలు, సభాసదులందరూ వారి వారి ఆసనాలలో కూర్చోబోతున్నారు. ఇంతలో 'దేవేంద్రునకు ఇంత అలసత్వం మంచిదికాదు. అమరావతిలోని ఐశ్వర్యమంతా ఏ క్షణాన్నైనా తననుండి అపహరింప బడుతుందేమో?' అన్న ఆందోళన ఇంద్రునిలో ఇప్పటికీ రాలేదు' అన్న నారదుని వాక్యాలు అందరినీ ఒక్కక్షణము కలవరపాటుకు గురిచేశాయి.

'ఏమైంది? ఎవరైనా రాక్షసుడుగానీ వస్తున్నాడా? రాక్షస రాజు బలిచక్రవర్తి పాతాళములో ఉన్నాడు కదా? ఈ మన్వంతరము గడచిన తర్వాతనేకదా ఆయన ఇంద్రపదవికి రాగలిగేది? మరి ఆయన ఆశ్రితులింకెవరైనా లేదా రాక్షసు లెవరైనా వస్తున్నారా? మయుడు మరేదైనా క్రొత్త ఆలోచన చేస్తున్నాడా? ఆయనకు అసంభవమైనదేదీ లేదు. ఎవరైనా తపస్సంపన్నులు ఇంద్రపదవికోసము ప్రయత్నిస్తున్నారా? భూమిపై కలియుగము జరుగుతున్నది. నేటి మర్త్యలోకవాసులు శక్తిహీనులు, ప్రాణహీనులు. అక్కడ ప్రస్తుతము దీర్ఘకాలీనమైన తపస్సును చేయడముగానీ, అశ్వమేధయజ్ఞముల పరంపరను అవిచ్ఛిన్నముగా నిర్వహించగలగడము గానీ అసంభవము.' గంధర్వులు, దేవతలు, కిన్నరులు, అప్సరసలు ఎవ్వరూ పైకి మాట్లాడటము లేదు. పైన చెప్పబడినవన్నీ వారి వారి మనోగతాభిప్రాయాలు, దేవతలు పైకి మాట్లాడరు. వారిది సంకల్పభాష. వాగ్రూపములో మౌనంగా ఉన్నప్పటికీ వారి హృదయాలలో వ్యాకులత ఆవరించినది.

'భారతదేశపు పుణ్యభూమిపట్ల సురపతియైన ఇంద్రుడు అప్రమత్తముగా ఉండకపోతే, అమరావతి నుండి ఏ క్షణాన్నైనా క్రిందకు త్రోసివేయబడతాడు' అని ఆసనముపై కూర్చుంటూనే నారదమునీంద్రులు హెచ్చరించారు. పదేపదే నారాయణుడిని భూమిపైకి రప్పించే ప్రయత్నము జరుగుతుంటే, ఇక అక్కడ దేవేంద్రుడిని సేవించేవారెవరు? ఈ విషయమై జాగ్రత్తవహించడం ఎంతో అవసరం. అధికారికి ఉచితమర్యాదల నందించకపోతే ఇంద్రదేవుడు లోకాధిపునిగా మనగలడా? అన్నారు నారదమునీంద్రులు.

'మహాభాగా! ఎవరువారు?' సహస్రాక్షుడు ప్రయత్నము చేసినా ఈ ధరాతలముపైన భారతభూమిపైన ఒక క్రొత్త తపస్వి, యోగి, త్యాగి లేదా సిద్ధపురుషుడు ఉన్నట్లు కనుగొనలేదేమో. కలాప గ్రామములోని మహాయోగులు, దత్తాత్రేయభగవానుని ఆశ్రితులనుండి మాకెట్టి భయములేదు. అమరపురుషులు, ఋషులు కొద్దిమంది ఉన్నా, వారు మాకు పరిచితులే! వారి ఆశీర్వాదము మాకు ముందే లభించి ఉన్నది. ఇప్పుడు ఈ క్రొత్త పరిస్థితి ఎటువైపునుండి వచ్చిందో మాకు బోధపడకున్నది' అని పలికాదు దేవేంద్రుడు.

'దేవేంద్రులవారు కేవలము యోగులు, తపస్సంపన్నులు, త్యాగులను మాత్రమే చూస్తున్నారు' అని ఆక్షేపిస్తూ నారదుడు ఇంకా ఇలా కొనసాగించారు. పరాత్పరుడైన బ్రహ్మాభావాధీనుడు. ఇది బహుశా మీరు మరచిపోతున్నారేమో. ఆద్యశక్తిని భక్తితో సేవించేవారి వైపు మీ దృష్టిమరలటము లేదేమో?'

ఇంద్రుడు చేతులు జోడించి, తలవంచి 'వారు సృష్టికర్తకు కూడా వందనీయులే! కానీ వారు నిత్యులు, నిష్కాములు,

**ఆలోచనల నుండే సాధనా పటిమ ఆవిష్కృతమవుతుంది**

అహైతుకముగా కృపను వర్షించేవారు. ఇంద్రుడు వారిని ఏవిధముగా సేవించగలడు? వారినుండి ఎవరికైనా భయము ఎలా ఉండగలదు? వారు ఎప్పుడు ఏమి చేస్తారో ఎట్లా తెలుస్తుంది?' అన్నాడు.

ఆదిశక్తి గాయత్రీమాత సాధకుడైన విద్యారణ్యులవారినే తీసుకోండి. ఆయన మనసులో ఎప్పుడు ఏ కోరిక మెదులు తుందో, ఎప్పుడు దేనిని వారు స్వీకరిస్తారో, దేనిని విసర్జిస్తారో వాగ్దేవియైనా చెప్పగలదా? అన్నారు నారదులు.

సరస్వతీదేవి కొద్ది క్షణాల క్రితమే సురసభలోనికి విచ్చేసి ఉన్నది. దేవరాజైన ఇంద్రుడు ఆమెను అర్చించి ఉన్నాడు. దేవర్షినారదుడు ఇప్పుడు తన తల్లియైన శారద వైపు సంకేత మిచ్చారు. సరస్వతీదేవి కూడా వాత్సల్యపూరితమైన స్వరముతో అతడు పరాశక్తి మమతానురాగాల్ని చూరగొన్నవాడు. అతనికి దప్పిక అనిపిస్తే -అమ్మా- అని పిలిచి దాహము తీర్చమని అడుగగలిగేవాడు. అతడి హృదయపు నీడనుకూడా స్పృశించే శక్తి ఎవ్వరికీ లేదు' అని పలికినది.

అతడిని కామోద్రిక్తుడని చెప్పగలిగితే దేవతలకు ఉపద్రవము తప్పుతుందేమో? దేవేంద్రుని దృష్టి మన్మథుని మీదకు మళ్ళింది. 'ఈ కుసుమశరీరుడిని అక్కడకు పంపించే తెలివితక్కువ పని దేవేంద్రుడు చెయ్యడని నేను ఆశిస్తున్నాను' అని అంటూ నారదమునీంద్రులవారు ఆసనము నుండి లేచి నిలబడ్డారు.

కామమును జాగృతము చేయడము ద్వారా సంపాదించిన సాధన అంతా నశించిపోవటానికి అతడేమీ ఒక యోగి లేదా తపస్వీ కాదు. స్వర్గభోగాలను అనుభవించాలను ఇచ్ఛ అతడి మనస్సులో లేశమాత్రమైనా అంకురించిన మరుక్షణము అమరావతి అతడి స్వంతమౌతుంది. అతడు 'అమ్మా!' అని పిలిస్తే చాలు పార్వతీదేవి దశాశ్వమేధముల తాలూకూ గొప్ప తనాన్ని కూడా మరచిపోతుంది. అతడిలో ఆ కోరిక కలగనంతవరకూ దేవేంద్రులు నిశ్చింతగా ఉండవచ్చు'.

పరివ్రాజకులైన దేవర్షి ఎక్కడా ఒకచోట స్థిరముగా కూర్చోరు. పెద్ద పెద్ద సందేహాలను దేవేంద్రునికి వదిలిపెట్టి ఆయన వెళ్ళిపోయారు. ఇచ్ఛామాత్రము చేతనే దేవేంద్రుని పదవిని అధిష్ఠించగలిగేటంత శక్తి నార్జించిన ఒక సాధకుడు సృష్టిలో ఉన్నారు. కానీ ఆయనను నిలువరించగలిగే ఉపాయ మేదీ దేవతల చెంత లేదు. కేవలము ఆయన మంచితనము మీద ఆధారపడి కాలము గడపటము మినహా మరొక మార్గము లేదు, ఎంతటి అసహాయస్థితి!

దేవేంద్రుడు ఏమీ అడగకమునుపే తాను సురపతికి ఎలాంటి సహాయమూ చేయలేనని చెప్తూ సరస్వతీదేవి 'ఏ తల్లీకూడా తన బిడ్డకు ఎలాంటి అపకారమూ జరుగకూడదని కోరుకుంటుంది కదా. మహాశక్తి గాయత్రీదేవి ప్రకాశమే లక్ష్మి, పార్వతి, సరస్వతుల మీద ప్రతిఫలిస్తూ ఉంటుందని సురపతికి తెలియనిదికాదు. ఆమె సహజ వాత్సల్యము ఎక్కడ క్రియాన్వితమై యుంటుందో అక్కడ మా ఆదరాభిమానములు కూడా సహజముగానే ప్రవహిస్తూంటాయి' అని వెల్లడిచేసింది. నారదులు చెప్పిన మాటనుగూర్చి ఇంద్రుడు ఆలోచించసాగాడు. దండము, భేదము అనే రెండు ఉపాయములు ఫలించనప్పుడు దుర్బలులకు సామము, దానము ఆశ్రయమిస్తాయి. ఆ మహాభాగునితో పరిచయము చేసుకొనుట ఉత్తమమని దేవేంద్రునికి స్ఫురించినది. ఏదోవిధముగా ఆయనను తన పట్ల కృతజ్ఞునిగా చేసుకొనగల్గితే ఇక అమరావతి గురించి నిశ్చింతగా ఉండవచ్చునని భావించాడు సురపతి.

విద్యారణ్యులవారు అప్పుడే తమ ప్రాతఃకాలీన సాధనను పూర్తిచేసుకొని ఆసనము నుండి లేచి నిలబడపోతూండగా ఆయన ఉపాసనా మందిరమంతా చక్కని కాంతితో నిండి పోయినది. దివ్యాంబరధారియై, రత్నకిరీటమును ధరించిన వజ్రధరుడైన ఇంద్రుడు ఆయన కట్టెదుట సాక్షాత్కరించి 'నీ పట్ల ప్రసన్నులమైనాము, వరము కోరుకో!' అని అన్నాడు.

'మీరు ధరించిన ఆయుధముల కారణముగా మిమ్మల్ని దేవేంద్రునిగా గుర్తించాను. నా వందనాలను స్వీకరించండి' అని విద్యారణ్యులు సాష్టాంగముగా కాకుండా చేతులు జోడించి, తలను వంచి నమస్కరిస్తూ, 'అతిథిగా వచ్చిన మీరు నా ఆతిథ్యమును స్వీకరించండి' అన్నారు.

అతిథి మర్యాదలు పూర్తయిన పిదప ఇంద్రుడు మరల ఆయనతో 'ఏదైనా వరము కోరుకోండి' అని అభ్యర్థించాడు. కానీ దానిని త్రోసిపుచ్చుతూ, అత్యంత నమ్రతాపూర్వకమైన దృఢస్వరముతో 'నేను మిమ్మల్ని ఆహ్వానించలేదని మీకు తెలుసు. నేను మీ ఆరాధకుడిని కూడా కాదు. నేను యాచించే హీనమైన

**నీ మనస్సు అనెడి సరస్సులో నీ ఆలోచనా సరళి అలజడిని సృష్టించకుండా చూసుకో**

భిక్షకుడిని కూడా కాదు. కేవలమూ మానవమాత్రుడనైన నామీద దయచూపి మీరు స్వయముగా వచ్చి దర్శనమిచ్చారు. మీ ఔదార్యమునకు, దయకూ నేను కృతజ్ఞుడిని!' అని చెప్తూ విద్యారణ్యులు ఇంద్రునికి కూడా మాట్లాడేందుకు అవకాశ మివ్వకుండా, ఇంకా ఈవిధముగా కొనసాగిస్తూ, 'నేను ఆ ఆదిశక్తియైన గాయత్రీమాత పుత్రుడను. ఆమె ఒక్కసారి కను బొమ్మలు కదిలించినంతమాత్రమున కోటికోటి బ్రహ్మాండములు ఉత్పన్నమౌతూ-లయమైపోతూంటాయి. మహాకాలుడు కూడా ఆమెపట్ల భయముతో కంపిస్తూంటాడు. లక్ష్మీదేవి దూరంగా నిలబడి చేతులు జోడించి ఆమె అనుగ్రహము కోసము ప్రార్థిస్తుంటుంది. అటువంటి ఆదిశక్తి గాయత్రీమాత బిడ్డనైన నాకు తమరు వరమివ్వగలరా?' అని ప్రశ్నించాడు.

దేవేంద్రుని వదనము తేజోవిహీనమైనది. 'ఈ అద్భుతమైన వ్యక్తి నా ఈ ప్రయత్నమును తన పట్ల అవమానముగా భావించి ఆగ్రహించడుకదా?' అని ఆయనకు అనిపించినది. ఎవరైనా యాచకుడు చక్రవర్తి వద్దకు వెళ్ళి తనను ఏదైనా కోరుకొమ్మని అడిగితే, యాచకుని అహంకారమునకు చక్రవర్తి ఆగ్రహించి అది తన పట్ల అవమానముగా భావించడం సహజమే కదా! చక్రవర్తికి అసంతృప్తి కలిగితే అది 'ఆయన తప్పు'గా ఎలా భావించగలము?

'తమరు నాకు వరమివ్వటానికి వచ్చారు. మీ సరళత్వమునకు, ఔదార్యమునకు నాకు సంతోషము కలిగింది. ఎవరి బిడ్డనైతే మీరు సంతోషపెట్టాలని ప్రయత్నము చేశారో, దయామయియైన ఆ తల్లి మీకు తప్పకుండా ఆశీస్సులిస్తుంది. ఇక మీరు రండి' అన్న విద్యారణ్యుల మాటలు విని దేవేంద్రునకు కొంత ఊరట కలిగింది.

'ఆశీస్సులైతే లభించాయి. ఈ ఆశ్వాసన స్వీకరించి ఆయన అమరావతికి తిరిగి పయనమయ్యారు. ఈ మహామానవుని వలన తమ కెలాంటి ఆందోళనా ఉండదు. ఇంద్రపదవి కోరుకొనడమనే అల్పమైన కోరిక ఆయన మనస్సులో జనించేటందుకు ఆస్కారమే లేదు.

కానీ ఇంద్రుని మనస్సులో ఒక అద్భుతమైన జిజ్ఞాస కలిగింది. తన ఈ సందేహమును ఆయన దేవగురువైన బృహస్పతి ముందు 'విద్యారణ్యులవారు సంపూర్ణమైన నిష్కామిగా నాకు అనిపించడము లేదు. వారి కోరిక ఏమిటో నా బుద్ధి గ్రహించలేకున్నది' అంటూ బయటపెట్టారు.

మానవునికి నాలుగు పురుషార్థములు ఉంటాయి. అవి-ధర్మ, అర్థ, కామ, మోక్షములు! ప్రపంచములో అర్థము, కామము-ఇవి రెండూ ఎంతవరకూ పొందగలమో అంతవరకూ ఇంద్రుని దయ సహజంగానే మనిషికి ప్రాప్తిస్తుంది. ధర్మము, యజ్ఞయాగాదులు, తపస్సు, త్యాగము... మొదలైనవాని వలన పొందగలిగే స్వర్గమునకు అతడు అధిపతి. అటువంటి దేవేంద్రుడే స్వయముగా వరాన్ని అనుగ్రహించటానికి విచ్చేసి, ఉపేక్షించబడినాడు. త్రివర్గములే తిరస్కరించబడినవి ఆ మహానుభావునిచేత!

మోక్షము యొక్క విషయము కూడ దేవేంద్రునికి అంతగా బోధపడలేదు. మోక్షమును పొందగలగటానికి చిత్తములో ఎలాంటి కోరికా లేశమాత్రమైనా ఉండరాదు. విద్యారణ్యులవారి హృదయము నిష్కామముగా లేదన్న విషయము దేవేంద్రునకు స్పష్టముగా అర్థమౌతూనే ఉన్నది.

'కోరికలు తీరవచ్చు, తీరకపోవచ్చు, కానీ మహాశక్తి పట్ల నిష్కామ-ఉపాసన చాలా అవసరము. ఐతే ఆ సాధకునిలో అటువంటి ఉపాసన చేస్తున్న ప్రయత్నమేదీ కనిపించడము లేదు. ఎలాంటి వ్యక్తి ఈ సాధకుడు, ఏమి కావాలి ఇతనికి?' దేవేంద్రుడిని పట్టి వేధిస్తున్న తీవ్రమైన ఈ జిజ్ఞాసకు సమాధాన మిస్తూ దేవగురువు ఇలా అన్నారు, 'ఆయన కోరికలు, కోరికలు కావు దేవేంద్రా! కాల్చబడిన విత్తనము మొలకెత్తదు. అలాగే ఆ పరాత్పరతత్త్వముతో జోడింపబడిన కోరిక, కోరికగా ఉండజాలదు.'

బిడ్డ తన తల్లి నుండి ఏమీ కోరుకొనకూడదనే నియమమేమీ లేదు. తనకు కావల్సిన అన్నపానీయాలతోపాటు అన్నిటికన్న మేలైన స్థితిని పొందటానికి కావల్సిన సహాయమును కూడా తల్లినుండే కోరుకుంటాడు. అతడి లౌకికమైన కోరిక కూడా ఉపాసనయే! అతని లౌకికమైన కోర్కె కూడా తన తల్లిని సంతృప్తిపరచడమూ, ఆమెను ప్రసన్నము చేసుకొనడమే. అతడి ఆ కోర్కెను తీర్చగలిగినప్పుడే తల్లికి కూడా సంతోషము కలుగుతుంది. అతడికున్న కోర్కెను పట్టుకొని ఎక్కడెక్కడ తిరుగుతాడు? ఆ కోర్కె కూడా అతనిని తల్లి సమీపానికే గదా

**మనోభారం చెట్టంత మనిషిని అతలాకుతలం చేస్తుంది**

తీసుకెళ్ళేది?' అని సవివరముగా తెలియజేశారు. తన ప్రసంగమును ఇంకా కొనసాగిస్తూ...

'పరాత్పరతత్త్వమును తనదిగా స్వీకరించిన వ్యక్తి తల్లీ-తండ్రీ, సోదరుడు, అధికారి... ఇక అన్నీ ఆ భగవంతుడుగానే స్వీకరించి, సర్వకాల సర్వావస్థలయందూ ఆయనపైనే ఆధారపడి ఉంటాడు. అప్పుడు అతనికి ఆ 'పూర్ణతత్త్వము' అవగతమౌతుంది. పూర్ణతత్త్వముతో యుక్తమైనప్పుడు ద్వేషము, కామము, భయము మొదలైన వృత్తులన్నీ కూడా ముక్తినిచ్చేవిగానే నిరూపించబడినాయి. చిత్తము ఆనందమనే ధనముతో నిండిపోతుంది, మనకు కావల్సినది కూడా అదే' అనికూడా అత్యంత ప్రేమపూర్వకంగా ఇంద్రుడిని ఊరడించారు.

దేవేంద్రుడు అంగీకారముగా తలపంకించాడు. అటువంటి మహాపురుషునితో కొద్ది క్షణాలైనా ప్రత్యక్ష సాన్నిహిత్యమును అనుభవించగలిగిన దేవేంద్రుడు ఎంతటి అదృష్టశాలి! ఎవరిని ద్వేషించి రాక్షసులు ముక్తిని పొందుతారో, ఆ పరాత్పరుడిని ప్రేమించే మహానుభావుని కోర్కెను గురించి పరీక్షించవల్సిన అవసరము ఇంద్రున కేమున్నది?

కాబట్టి నువ్వు నాల్గవభాగమునకు చెందిన మోక్షము యొక్క పరిధిలోనే ఆలోచిస్తున్నావు, భ్రమపడుతున్నావు. వేదమాత గాయత్రీపట్ల భక్తి కలిగి ఉండటమనేది మానవుని యొక్క పంచమపురుషార్థము. దేవి ఒడిలో మిగిలిన అన్ని పురుషార్థములే కాదు, స్వయముగా భగవంతుడే ఒదిగిపోయే అత్యున్నతమైనది ఈ పంచమపురుషార్థము.

*– అఖండజ్యోతి, జులై 1998*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## గాయత్రి

*ఒక వ్యక్తి మరణానంతరం స్వర్గానికి చేరుకున్నాడు. అతడు అమృతం, పారస్‌మణి మరియు కల్పవృక్షం గురించి చాలా విన్నాడు, దీనితో స్వర్గంలో వానిని దర్శించాలనే కోరిక కలిగింది. చిత్రగుప్తునికి తన కోరికను వెల్లడించగా వానిని దర్శింపజేయుటకు తగిన ఏర్పాట్లు చిత్రగుప్తుడు చేశాడు. స్వర్గానికి చేరిన ఈ వ్యక్తి అమృతమథనంలోను, పారస్‌మణిలో మరియు కల్పవృక్షంలో అన్నింటిలో గాయత్రీమాతను దర్శించసాగాడు. దీనిలో దాగియున్న మర్మాన్ని తెలిసికోవలయుననే కోరిక అతనిలో కలిగింది. అడుగగానే అతనికి జవాబు లభించింది. అమృతం, పారస్‌మణి, కల్పవృక్షం మరేమి కావు – అవి సద్భావనలకు, సద్బుద్ధికి మరియు సత్కర్మలకు ప్రతీకలు. వీని సంపర్కంలోనికి ఎవరైతే వస్తారో వారి జీవితం పవిత్రం, స్వచ్ఛము మరియు పుణ్యప్రదం అవుతూ ఉంటుంది. గాయత్రీ వేరే ఏమి కాదు. సత్‌జ్ఞానం మరియు సత్కర్మలను వరించే దేవత. అందువలన కేవలం ఆమె అనుగ్రహానికి పాత్రుడైన మనుష్యుని జీవితంలోనికి అమృతం, పారస్‌మణి మరియు కల్పవృక్షమనే మూడు ప్రవేశిస్తాయి.*

*– అఖండజ్యోతి, మార్చి 2013*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## సర్వోత్తమ ధర్మం పరోపకారం

*ఇతరుల పట్ల ఉపకారం చేయుట పుణ్యం – ఏలనన దీనితో మనలోని మూడు ప్రధాన ప్రవృత్తులు పెంపొందించుకొనుటకు విశేష సహాయమందుతుంది. మనం ఇతరుల పట్ల ఎట్లు ప్రవర్తిస్తామో ఇతరులు కూడా మన పట్ల అదేవిధంగా వ్యవహరిస్తారు. ఇది నిశ్చయం. మనం ఇతరుల ప్రగతిమార్గానికి అడ్డుతగలనిచో వారు కూడా మన ప్రగతిమార్గానికి ఆటంకం కాజాలరు. మనము మన స్వభావాన్ని వినమ్రతతో నింపి, మధురంగా, ఆనందంగా ఉపకారయుక్తంగా, దయాయుతంగా మలచుకొన్నచో ఇతరులు కూడా మన పట్ల ఇదే రీతిలో ప్రతిస్పందించుట సునిశ్చితం. దొంగలకు, నేరప్రవృత్తులు గలవారికి తమను నలుదిక్కుల నుండి బంధించుటకు ప్రయత్నించుట కనిపిస్తుంది. అట్లే సజ్జనులు, ధర్మమార్గావలంబులు, బాధ్యతాయుత వ్యక్తులు నిర్భయంగా, కాళ్ళు చాచుకొని నిద్రిస్తారు. వారికి ఆత్మిక అశాంతి ఉండదు. ఇతరులకు హాని తలపెట్టినవారు అనుక్షణము అశాంతిలో భయభ్రాంతుల నడుమ జీవిస్తారు. సత్పురుషులకు సర్వత్రా ఆదరణ లభిస్తుంది. వీరు నిర్ధనుల్లా ఉన్నా, వారికి సహాయమందుతూనే ఉంటుంది.*

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**చంచలమైన మనస్సు ఒకపరి గిరిశిఖరంపై నర్తిస్తుంది - మరోసారి లోయలో పడి అలమటిస్తుంది**

మనం - మన ఆరోగ్యం

# చిరయవ్వనం యొక్క రహస్యం

శరీర ఆరోగ్యం కొరకు, బలంగా ఉండటానికి మందులు పౌష్టికాహారం వాడుతుంటారు. ఏదైనా రోగము వస్తే వైద్యుల దగ్గరకు పరిగెత్తుతుంటారు. కానీ ఈ ప్రయత్నంలో పెద్ద ఉపయోగం ఉండదు. అందువలన వీరు వైద్యులను మారుస్తుంటారు. మందులు మారుస్తుంటారు, వారి డబ్బు, సమయం వృథా చేసుకుంటుంటారు. కానీ ఆ రోగం అలానే ఉంటుంది. ఇలాంటి మొండిరోగాలతో బాధపడేవారిని మనం చూస్తూనే ఉన్నాము. ధనవంతులు పౌష్టికాహారం తీసుకుంటారని చెప్పుకోవచ్చు. టానిక్కులు, బలాన్ని ఇచ్చే తినుబండారాలు ఇంట్లో పెట్టుకుంటారు. విటమినులు, మినరల్స్, శక్తిని ఇచ్చే మాత్రలు కొనితెచ్చుకుంటారు. కానీ ఇవి అన్నీ తీసుకొనే వారి ఆరోగ్యం ఎంత మెరుగయింది అనేది చూస్తే నిరాశే కనిపిస్తుంది. పౌష్టికపదార్థములతో బలం వస్తే ధనవంతులు పహిల్వాన్‌లు కావాలి. కానీ అలా జరగటం లేదు. పౌష్టికపదార్థాలు మాత్రమే తీసుకుంటుంటే వారు దుర్బలంగా ఎందుకు ఉండాలి? చ్యవన్‌ప్రాశ్, శిలాజిత్తు, మకరధ్వజం మొదలైనవి తయారు చేసేవారు, వాటిపై గొప్పగా ప్రకటనలు ఇచ్చేవారు ముసలి వారుగా ఎందుకు అవుతున్నారు? ఈ పౌష్టిక పదార్థములు తీసుకుని ఎందుకు కుర్ణాళ్ళుగా ఉండలేక పోతున్నారు? ఆరోగ్యం కొరకు వైద్యుల దగ్గరకు పరిగెత్తటంలో మృగతృష్ణ వంటి భ్రాంతి తప్ప దానిలో ఏమీ లేదు.

మానవ మస్తిష్కంపై కమ్ముకునే అనేక అంధవిశ్వాసములలో ఇది చాలా పెద్దది. ఆరోగ్యం కొరకు పౌష్టికపదార్థములు తీసుకోవచ్చు. రోగ నివారణకు ఔషధముల సేవన చేసుకోవచ్చు. వీటిని అవసరం వచ్చినప్పుడు తీసుకోవాలి, కానీ వీటి ప్రభావం తాత్కాలికం, స్వల్పం.

ఆరోగ్యం ఆహార విహారములపై ఆధారపడి ఉంటుంది. కానీ వీటిని సవ్యముగా పాటించకపోతే ఆరోగ్య సంపదను పోగొట్టుకుంటారు. దుర్బలత్వం, రోగాలు పీడిస్తుంటాయి. ఈ వికృతులను సరిచేసుకోకపోతే ఆరోగ్య సమస్యకు సమాధానం దొరకదు. అసంయమముపై, వాసనలపై, లోభముపై నియంత్రణ సాధించి సంయమ జీవనక్రమం పొందగలిగితే, దాని ప్రభావం ఆరోగ్యం మెరుగవటంలో చూడవచ్చు. రోగాలకు కారణం సంయమం లేకపోవడమే. ఆహార విహారాలను సవ్యముగా నిర్ధారించుకుని, వాటిని పాటిస్తే రోగములు వాటంతట అవే పారిపోతాయి. మందులు అవసరం లేకుండానే రోగాలను వదిలించుకోవచ్చు.

డా॥ లుక్‌మాన్ ప్రకారం మనిషి త్వరగా చనిపోవడానికి అతని నాలుకే కారణం. తిండియావ కలిగిన నాలుక ఉపయోగపడని పదార్థాలను పొట్టలో వేసి, జీవన మరణ సంకటాన్ని ఉత్పన్నం చేస్తుంది.

ఒకసారి ఒకరాజుగారు దారితప్పి వనవాసుల గ్రామానికి వెళ్ళాడు. పరిచయం లేనప్పటికి ఆ వనవాసులు రాజుగారికి వీలయినంతగా భోజన వసతి సత్కారములు చేశారు. రాజుగారు వారి మంచితనానికి ప్రభావితుడై అక్కడ ఒక ఆసుపత్రి నెలకొల్పాలని నిశ్చయించుకున్నాడు, ఆసుపత్రి వలన వారికి ఆరోగ్యం కలుగుతుందని ఆశించాడు. ఆసుపత్రి తెరిచారు. కానీ ఒక్కరోగి కూడా రాలేదు. రాజుగారు ఒక సంవత్సరం తరువాత ఆసుపత్రి ప్రగతి ఎలా ఉందో చూద్దామని వచ్చాడు. ఒక్క రోగి కూడా ఆసుపత్రికి రాలేదని తెలిసింది. ఆ ఊరివారిని పిల్చి ఆసుపత్రి నెందుకు ఉపయోగించుకోవడం లేదని అడిగాడు. వారు రోగం రాకపోతే ఆసుపత్రికి వెళ్ళడం ఎందుకని ప్రశ్నించారు. రోగములు ఎందుకు రావడం లేదని రాజుగారు చాలా ఆశ్చర్యంగా అడిగాడు. ఆ గ్రామీణులు ఏమి చెప్పారంటే – ఆకలి ఎంత ఉన్న ఒక ముద్ద తక్కువ తింటాము. అందువలన రోగములు రావు. ఇంకొకటి మేము ఎంత పరిశ్రమ చేస్తామంటే ఏదయినా రోగం వచ్చినా అది మా చెమటలో కొట్టుకుపోతుంది. రాజుగారికి ఆరోగ్య రహస్యం అర్థం తెలిసింది. వారికి ఆసుపత్రి అవసరం లేదని తెలుసుకుని రాజు దానిని మూసివేశాడు.

ఎంతోమంది మొదట్లో దుర్బలులుగా, రోగగ్రస్థులుగా ఉన్నప్పటికి వారు వారి పద్ధతులు మార్చుకుని బలవంతులు అయ్యారు, శక్తివంతులు అయ్యారు. హింద్ కేసరి చందగీ

**చంచలత్వంతో కూడిన కోతిలాంటి మనస్సును, భక్తియనెడి తాడుతో నియంత్రించాలి**

రామ్ మొదట్లో క్షయవ్యాధి సోకి అకాలమృత్యుముఖానికి దగ్గరయ్యాడు. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి అతని జీవన విధానం పూర్తిగా మార్పు చేసుకున్నాడు.

ఆ మార్పువలన రోగం పోవడమే కాక బలిష్ఠులైన పహిల్వానుల సరసన చేరాడు. విశ్వవిఖ్యాత పహిల్వాన్ శాండో కూడా మొదట్లో చాలా బలహీనంగా ఉండేవాడు. ఒకసారి కుస్తీపోటీలకు వెళ్ళి, అక్కడ బలంగా ఉన్న పహిల్వానులను చూసి, తన తండ్రితో నేను కూడా అలా అవగలనా అని ఆవేదనతో కూడిన కళ్ళతో అడిగాడు. ఆహార విహారముల పద్ధతులను సరిచేసుకుని ప్రతి వ్యక్తి దృఢంగా కావచ్చు. దీర్ఘజీవనం పొందవచ్చని వాళ్ళ నాన్న సమాధానం చెప్పాడు. ఏమి చెయ్యాలో తెలుసుకుని వాటిని దృఢపూర్వకంగా పాటించడంలో నిమగ్నమయ్యాడు. ఫలస్వరూపంగా అతను విశ్వవిఖ్యాత పహిల్వాన్ అయ్యాడు.

గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు అతని పొట్టలో సరిగ్గా ఉండేది కాదు. విరోచనం కావాలంటే ప్రతిసారీ ఎనిమా చేసుకోవలసివచ్చేది. చాలా రోజులు బ్రతికి ఉండనేమోనని ఆయనకు అనిపించేది. పరిస్థితిని మార్చుకోవాలని ఆరోగ్య నియమాలను దృఢంగా పాటించేవారు. ప్రాకృతికజీవనచర్యను పాటించేవారు, ఆయన 120 సంవత్సరములు జీవించేందుకు తయారయ్యారు. కానీ వారు హత్యకు గురికాకపోతే వారు అన్ని సంవత్సరాలు జీవించగలిగేవారు. 30 సంవత్సరముల వయస్సులో అఖండ బ్రహ్మచర్యదీక్ష వ్రతం తీసుకుని తన జీవనశక్తిని అద్భుతంగా అభివృద్ధి చేసుకున్నారు. ఆ ఓజస్సు బలం వలన మహామానవుల పంక్తిలో చేరగలిగాడు.

లోకమాన్యతిలక్ కూడా చిన్నప్పుడు చాలా బలహీనంగా రోగగ్రస్థుడై ఉండేవాడు. అతని ఆహార విహారాలలో మంచి మార్పు చేసుకుని బలం ప్రాప్తించుకున్నాడు. ఇలాంటి ఉదాహరణలు అన్ని చోట్ల కనిపిస్తాయి.

ప్రాచీనకాలంలో హనుమంతుడు, భీష్ముడు బ్రహ్మచర్యాన్ని పాటించారు. ఋషుల, మునుల ఆశ్రమాలలో ఉంటూ హనుమంతుడు అక్కడి కష్టసాధ్య పరిస్థితులలో, లోటుపాట్లతో జీవనం చేస్తూ కూడా సంయమం యొక్క ప్రభావం వలన సుదృఢమైన శరీరము, దీర్ఘజీవనం ప్రాప్తించుకున్నాడు. స్వామిదయానంద బలం సుప్రసిద్ధము. ఒకసారి ఇద్దరు బలవంతులైన వ్యక్తులు కొట్టుకోవడం చూసి, వారి జుట్టు పట్టుకుని బలపూర్వకంగా విడిపించారు. ఇది వారి బ్రహ్మచర్యం యొక్క ప్రతాపమే. అడవులలో నివసించే భిల్లులు సంయమ శీలురవడం వలన జీవించినంత కాలం బలంగానే ఉంటారు. ఆరోగ్య సూత్రాలను ఉల్లంఘించకపోతే భగవంతుడు ఇచ్చిన ఆరోగ్యాన్ని సహజంగానే జీవితమంతా పాడవకుండా చేసుకోవచ్చు.

సుకారాత్‌ను ఎవరో అడిగారు –'కామసేవనం ఎన్నిసార్లు చేయవచ్చు" జీవితంలో ఒకసారి చాలు. దానితో జీవితాన్ని నాశనం చేసుకోవడం తప్ప మరేమి జరగదని సమాధానం ఇచ్చాడు. ప్రశ్నకర్త సంతుష్టుడవలేదు. దానితో తానిచ్చిన జవాబు అతనికి ఇష్టం ఉన్నదో లేదో అని ఆలోచించి 'సంవత్సరానికి ఒక్కసారి మాత్రమేనని అర్థం చేసుకోవాలి' అని అన్నాడు. ప్రశ్నకర్తకు ఇంకా సంతృప్తి లేదు. అధికాధికంగా నెలకు ఒక్కసారని ఆలోచించాలి అని అన్నాడు. ప్రశ్నకర్తకు ఇంకా తృప్తి లేదు. సుకారాత్ కోపంతో ఇలా అన్నాడు – "నీకు నచ్చినట్టు ఉండు. కానీ చావడానికి సిద్ధంగా ఉండు"

ఈ మాట కేవలం కామసేవనం గురించే కాదు అన్ని ఇంద్రియభోగాలకు వర్తిస్తుంది. ఉత్పాదన కంటే ఖర్చు ఎక్కువైతే ఆ అపవ్యయం వలన పెట్టుబడి అంతా నష్టపోతారు. చిచ్చుబుడ్డి వెలిగినట్టు వెలిగి జీవనక్షేత్రంలో ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రెండు ముఖ్య సూత్రాలు ఉన్నాయి. ఎంత కఠోరమైన శ్రమ చేయాలంటే బాగా అలసిపోవాలి, గాఢంగా నిద్రపోవాలి. బాగా ఆకలి వేసినప్పుడే తినాలి. అప్పుడు ఏమి తిన్న బాగుంటుంది.

శారీరిక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ఈ స్వర్ణిమసూత్రములు అందరికీ ఉపయోగపడతాయి.

సాత్వికమైన పదార్థములను మితంగా తింటే జీర్ణక్రియ చక్కగా జరుగుతుంది. ఆరోగ్యానికి హాని జరుగదు. భగవంతుడు ఇచ్చిన సుదృఢ శరీరాన్ని, ఆరోగ్యాన్ని మనకు మనమే సర్వనాశనం చేసుకుంటున్నాము. దాన్ని బాగుచేసుకునే తాళంచెవి మన చేతిలోనే ఉన్నది.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 42 (3.22) నుండి*

*– అనువాదం: ముక్కామల రత్నాకర్*

**స్థితప్రజ్ఞులకు మనోభారం అనేది ఉండదు**

# మానవీయ శరీరంలో ఉన్న విచిత్రమైన సామర్థ్యం

మానవుని జ్ఞానేంద్రియాలు సామాన్యంగా శబ్ద, స్పర్శ, రూప, రస, గంధముల గురించి మాత్రమే స్పందిస్తూ ఉంటాయి. వాటి సామాన్య వికాసం ఇంతవరకు మాత్రమే పరిమితమై ఉండి, నిత్యజీవితంలో ఉపయోగపడుతుంటాయి. మిగిలిన శక్తి నిరుపయోగంగా ఉంటూ నిద్రావస్థలో పడివుంటుంది. ఒకవేళ వాటిని సాధనాత్మక రూపంలో ప్రయత్నించుకోగలిగితే అభీష్టాల మేరకు వాటిని నిద్రలేపి, అసాధారణ రీతిలో సమర్థవంతగా పని చేయించుకోవచ్చు.

శరీరంలో ఉన్న ఇతర ఇంద్రియాలను స్పర్శేంద్రియం అనగా చర్మం మొత్తం శరీరాన్ని కప్పి ఉంచుతుంది. దీని జ్ఞానతంతువులు సాధారణంగా స్పర్శజ్ఞానాన్ని మాత్రమే కలిగిస్తాయి. ఇది ఏ వస్తువునైనా ముట్టుకొన్నప్పుడు దాని ఆకారం, బరువు, వేడి మొదలైన వాటిని కూడా స్థూలంగా తెలియపరచుతుంది. ఐతే వాస్తవంలో దాని క్షమత ఇంత హద్దు వరకు మాత్రమే కాదు. సూర్యవిజ్ఞానం ద్వారా శారీరిక విద్యుత్ శక్తిని సక్రియంగా ఉత్తేజపరచి పెంచుకోగలిగితే అందులో ఎంతో అధిక శక్తి ఉత్పన్నమై, అది ఒక్కటే ఐదు ఇంద్రియాల సంయుక్త భూమికను పోషించగలదు.

చర్మం నుండి ఒక విశిష్ట రూపంలో విద్యుత్ ప్రాణ-ప్రవాహం శరీరం చుట్టూ ఒక తేజోమండలాన్ని తయారు చేస్తుంది. ఈ స్పర్శేంద్రియం ద్వారా రంగులను గుర్తించి వ్యక్తి యొక్క శారీరిక, మానసిక స్థితి గురించి వివరంగా తెలుసుకొని చెప్పవచ్చు. మాస్కోలోని 'సోవియట్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' యొక్క బయోఫిజిక్స్ విభాగపు అనుసంధానకర్తయైన డా॥ నోవోమస్కి అనే శాస్త్రవేత్త మరొక రష్యామహిళ అయిన 'రోజాకుల్ శోవా' యొక్క అతీంద్రియ శక్తుల మీద చాలా లోతైన అధ్యయనం చేశాడు. ఆమె కళ్ళు మూసుకొని భిన్నభిన్న వేవ్ లెంగ్త్ (wave length) ప్రకాశకిరణాలతో తన స్పర్శేంద్రియాన్ని ఉత్తేజపరచుకుని, ఎదురుగా ఉన్న వ్యక్తి శరీరము, మనస్సు పరంగా అనేక విషయాలు వివరంగా చెప్పగలిగింది. ఈ పరీక్ష జరిపిన తరువాత వైజ్ఞానికులు ఇటువంటి శక్తులను ఇతర వ్యక్తులలో కూడా వికసింపచేయవచ్చని పేర్కొన్నారు. ఎన్నో పరీక్షలు, పరిశోధనలు దీని మీద చేయుట జరిగింది. దీనివలన తెలిసిన విషయమేమనగా ముఖ్యంగా పుట్టుకతోనే అంధులైన పిల్లలలో ఈ క్షమత ఎక్కువగానే ఉన్నట్లు తేలింది. ఈ పిల్లలు ఎఱుపురంగు స్పర్శ గఱుకుగా ఉన్నట్లు, పసుపు రంగు మృదువుగాను, లేతనీలిరంగు స్పర్శ జారుతున్నట్లుగానూ ఉన్నదని చెప్పారు.

ఈవిధంగా కేవలం రష్యాలోనేగాక, బల్గేరియాలోని 'సోఫియా' పరామనోవైజ్ఞానిక ప్రయోగశాలలో 'స్కిన్‌విజన్' అనగా చర్మం దృష్టిలో విభిన్న ప్రమాణాల నైపుణ్యమును వికసింపజేయుటలో మనోవైజ్ఞానులకు సఫలత లభించింది. గొప్ప శాస్త్రవేత్త 'డా॥ జుల్స్ రోమె ఇన్' 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ పేరా సైకాలజీ'లో 'పేరా ఆప్టిక్ పవర్' అనే శీర్షికతో ఒక లేఖను ప్రచురించి, అందులో స్పర్శేంద్రియపు అతీంద్రియ జ్ఞానం మీద విస్తారంగా వివరణ ఇచ్చుట జరిగింది.

మనిషి శరీరం మొత్తం సచేతన ఆకర్షణాశక్తి లేక విద్యుత్తుతో కూడిన కేంద్రంగా చెప్పుట జరిగింది. సగటున శరీరంలో ఉన్న చర్మం దాదాపు 1.75 స్క్వేర్ మీటర్ లేక 20 (చదరపు అడుగు)స్క్వేర్ ఫీట్ పరిమాణంలో చుట్టుకొని ఉంటుంది. దీని నుండి వెడలే ప్రకాశ మండలాన్ని 'థర్మోగ్రఫీ'తో కొలచినప్పుడు, 875 వాట్స్ శక్తి యొక్క ఊర్జ విడుదలవుతుంది. ఇది 'రేడియేషన్' లేక ఇన్‌ఫ్రారెడ్ కన్నా కూడా ఎక్కువ ఉన్న తరంగాల ప్రమాణంతో కూడి ఉంటుంది. ఈ శారీరిక చర్మం ప్రతి 50 రోజులకు ఒకసారి పాత చర్మం స్థానంలో క్రొత్త కోశికల ద్వారా మార్పు చెంది పూర్తిగా కాయకల్పం జరుగుతుంటుంది. దాని బరువు దాదాపు 18 కేజీలు ఉంటుంది. ఈ కాయకల్పం పాము విడచు కుబుసంవలె ఒకేసారి కాకుండా విడుదల అన్నది క్రమంగా జరుగుతుంది.

ఉపనిషత్‌కారుడు "త్వచి విద్యుత్ హృదయ చ ఏకో దేవతా" అనే సూత్రంలో శరీరవిద్యుత్, హృదయ స్పందనలు ఒకే శక్తి ద్వారా నిర్వహణ జరుగుతుందని చెప్పుట జరిగింది. యోగవిజ్ఞానాన్ని సహాయంగా తీసుకొని ఈ శారీరిక పిండాన్ని విభిన్న మార్గాలలో ఉన్న సామర్థ్యాన్ని వికసింపచేసుకోగలిగితే మానవుడు అనేక విభూతులకు అధికారి కావచ్చు.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2010*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**తపస్వులు, సాధనాపరులు ఏకాగ్ర మనస్కులై ఉంటారు.**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# మానవ శరీరము యొక్క అసలైన సంపదలు - 2

*గత సంచికలో పరమపూజ్య గురుదేవులు 'మానవుడిని భగవంతుడు సర్వోన్నతమైన రాజకుమారునిగా సృష్టించాడు. దుర్లభమైన సంపదలతో సంపన్నుడైన మానవుడు సామాన్యక్రమములో అయితే ఎలాంటి సమస్యలలోనూ చిక్కుకొనవలసిన పనిలేదు' అని వివరించినట్లు మనము చదువుకున్నాము. ఈ విషయమై పరమపూజ్య గురుదేవులు ఇంకా ఈవిధంగా తెలియజేస్తున్నారు. 'భగవంతుడు మానవుడిని తన స్వంతబిడ్డగా భావించి ఎన్నో సంపదలను సమకూర్చాడు. ఐనప్పటికీనీ మానవుడు కలతచెందుతూ అశాంతికి లోనవుతున్నాడంటే అందుకు కారణము అనియంత్రణ. నియంత్రణారాహిత్యమే మనిషిలో పుట్టే రోగములన్నింటికీ ముఖ్యకారణము. నియంత్రణ లేకపోవుటచేత మనిషి శ్రమశీలతను పోగొట్టుకుంటున్నాడు. విలాసవంతుడౌతున్నాడు. ఫలితముగా ఎన్నో రోగములకు గురవుతున్నాడు' అని చెప్తూ గురుదేవులు సంయమనమును ఆధ్యాత్మికత యొక్క ప్రప్రథమ చరణముగా అభివర్ణించారు.*

### భగవంతుని సిద్ధాంతములను అంగీకరించనివాడు నాస్తికుడు

నిజానికి మనం నాస్తికులము. ఎందుకంటే భగవంతుని విధి విధానములను నిర్లక్ష్యము చేసి, 'ఆధ్యాత్మికత అంటే ఒక గారడి!' అనే ఒక క్రొత్త సిద్ధాంతమును నమ్మి ముందుకు సాగుతువుంటాము. గారడీవాడు గుప్పిటలోకి మట్టిని తీసుకుని గుప్పిటమూసి దానిచుట్టూ మంత్రదండమును తిప్పి, గుప్పిట విప్పి చూపిస్తాడు. అందులో మట్టికి బదులు రూపాయిబిళ్ళ ఉంటుంది. ఇది గారడీవాండ్రు చేసిచూపించే చమత్కారము లేదా గారడీవిద్య! మనం ఇంకొకరకంగా గారడీ చేస్తున్నాము. ఒక అర్ధరూపాయితో ఆంజనేయస్వామి పటము కొని, ఒక అర్ధరూపాయి పూలమాల వేసి, ఐదుపైసలు అగరువత్తిలు వెలిగించి, మాలను త్రిప్పి, హనుమాన్‌చాలీసా చదివి 'ఆంజనేయస్వామిని పూజించాము. ఇక డబ్బు, పిల్లలు, ఇల్లు-వాకిళ్ళు, సంపదలు అన్నీ మనకు లభిస్తాయి' అనుకుంటున్నాము. ఇది స్వచ్ఛమైన గారడీ. అసలు గారడీ అని దేన్ని అంటారు? మనిషి ఏమాత్రమూ శ్రమపడకుండా, కష్టము చెయ్యకుండా, ఎలాంటి మూల్యమూ చెల్లించకుండా దేన్నయినా పొందగలిగేది గారడీ! ఇందులో సాత్వికత అభివృద్ధి చెందించవల్సిన పనిలేదు. చిన్న చిన్న మార్పులు చేస్తే చాలు, లాభము కలుగుతుంది.



ఇదే నిజమైతే ఇలాంటి 'ఆధ్యాత్మికత'ను గారడీ అనిగాక మరేమంటారు? ఇటువంటి ఆధ్యాత్మికత తత్త్వదర్శనము చెయ్యలేదు.

### ఆధ్యాత్మికత అనేది రొక్కం బేరమై ఉండాలి

ఆధ్యాత్మికత అనేది రొక్కం బేరమై ఉండాలి. అది మన జీవితములో ఎదురయ్యే ప్రతి ఒక్క సమస్యకూ సమాధానాన్నివ్వగలిగేటట్లుగా ఉండాలి. ఆధ్యాత్మికత మన జీవితంలోకి ఒక క్రొత్త దృష్టికోణమును తీసుకువస్తుంది. అట్టి ఆధ్యాత్మికత అన్వయించబడగలిగేదిగా (ఎప్లయిడ్) ఉంటుంది. ఆధ్యాత్మిక సిద్ధాంతములుగా మనము నిర్వచించుకునే ఉత్కృష్టమైన ఆలోచనలు, ఆదర్శపూరితమైన కర్తృత్వమూ మొదలైనవానిని ఏ రంగములో ప్రయోగించినాసరే అవి అక్కడ అన్వయించబడతాయి. అక్కడ వాటి విధానములు వేర్వేరుగా ఉంటాయి.

మీరు ఆధ్యాత్మికవాదులై, ఆధ్యాత్మికతను మీ శారీరక క్షేత్రములో ఉపయోగించదలచుకుంటే కనుక ముందుగా మీరు నియంత్రణను ఆధారముగా చేసుకొని ప్రయోగింపవల్సి ఉంటుంది. 'నియంత్రణ' అనేది ముందుగా నాలుకతో ప్రారంభించవల్సి ఉంటుంది. కత్తితో, గొడ్డలితో... ఆ నాలుకను చీల్చిచెండాడవలసి ఉంటుంది. అప్పుడుగానీ అది మీ నియంత్రణలోనికి రాదు.

**సాధువులకు, సత్వగుణ సంపన్నులకు వివేచనాశక్తి విశ్లేషణా పాటవం హెచ్చుగా ఉంటాయి**

## ఆధ్యాత్మికత అంటే ధైర్యసాహసములు

ఆధ్యాత్మికత అంటేనే ధైర్యము, సాహసము. మనిషి వాటి సహాయముతో తనపైన తానే యుద్ధము చేయవల్సి ఉంటుంది. శూరులు, వీరులు, సంఘర్షణశీలురు నడిచే మార్గమే ఆధ్యాత్మికత. బలహీనులకు, పిరికివారికి, చోరులకు, తప్పించుకు తిరిగే వారికి ఆ దారిలో చోటుండదు. వారు నిషిద్ధమైనటువంటి సిద్ధులు, ఆశీర్వాదములు, చమత్కారములు మొదలైనవాటి కోసము తహతహలాడుతుంటారు. మీరు నిజమైన ఆధ్యాత్మిక వాదులు కావాలనుకుంటే ముందుగా చేతులు కట్టుకొని, మీతో మీరు మీలోని రెండు ఇంద్రియాలతో యుద్ధము చెయ్యటానికి సిద్ధము కావాలి. రావణ కుంభకర్ణాదులతో శ్రీరాముడు; దుర్యోధన-దుశ్శాసనులతోటి శ్రీకృష్ణుడు మరియు అర్జునుడు యుద్ధరంగములో స్థిరంగా నిలబడిన విధముగా మీరుకూడా మీలోని ఇద్దరు శత్రువులను ఎదిరించి యుద్ధము చెయ్యటానికి ప్రతిజ్ఞ చెయ్యాలి.

## అసంయమమునకు ఆహారవిహారములే పునాదిరాళ్ళు

అనియంత్రణ ఆధారముగా మన నాలుకమీద దండయాత్ర సాగించేవి ఆహారవిహారములు! వీటినే మనం 'కామేంద్రియం, జిహ్వ' అనబడే ఇద్దరు రాక్షసులుగా తెలుసుకొనవలెను. నాలుక, కామము అనే ఇద్దరు రాక్షసులను జయించగలిగితే మీరు ఆధ్యాత్మికతలోనికి ప్రవేశించినట్టే! ఈ విషయములో గాంధీని మీకు ఉదాహరణగా తెలియ జేస్తున్నాము. గాంధీ 20-30 సంవత్సరముల వయస్సులో దక్షిణాఫ్రికాలోని 'నేటాల్' అనే ప్రాంతములో ఉండేవాడు. అప్పుడు ఆయన మందులతో నయము కానటువంటి మలబద్ధకముతో బాధపడుతుండేవారు. ప్రతిరోజూ 'ఎనిమా' చేసుకుంటే తప్ప విరేచనము అయ్యేది కాదు. చాలామంది పలువిధములైన సలహాల నిస్తుండేవారు.

'పొట్టమీద మనము దౌర్జన్యము చేస్తే లాభము లేదు. దానికి తగిన విశ్రాంతినివ్వాలి' అని నిర్ణయించుకొని అల్పాహారము తీసుకోవటము మానేశాడు. ఆరోగ్యమును చక్కబరుచుకొనటానికి ఎన్నో మార్గముల ననుసరించాడు. అప్పట్లో ఆయన 'నేను 50 సంవత్సరములు జీవిస్తే గొప్ప' అనుకునేవాడట.

## శరీరము దేవతల ఆలయము

గాంధీజీ నాలుకకు వ్యతిరేకముగా నడవాలని ప్రతిజ్ఞ తీసుకున్నాడు. నాలుక చెప్పినట్లు వినకూడదనీ, దానితో యుద్ధము చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. ఏమాత్రమూ రాజీపడని పోరాటమును సాగించాడు. ఫలితముగా ఆయన జబ్బు నయమైనది. చేజారిన ఆరోగ్యము కుదుటపడింది. 80 సంవత్సరముల వయస్సులో ఒకసారి ఆయన 'అవకాశము వస్తే 100 సంవత్సరములు జీవించాలని ఉంది' అన్నారట. ఆయన ఎవరిని ఉపాసన చేశారు? ఎవరి ద్వారా వరము పొందారు? ఎవరు చేసిన అద్భుతమిది? దేవతలకు ఆలయమైన ఈ శరీరమునే సరియైన రీతిలో ఉపాసించాడు. అందులోని దేవతలే గాంధీకి ఆరోగ్యమనే వరమును ప్రసాదించారు.

మనిషి ఆరోగ్యమును చక్కగా కాపాడుకోవాలంటే కామేంద్రియమును అదుపులో ఉంచుకోవాలి. మన మెదడులో జ్ఞాపకము రూపములో పనిచేసే, మన శరీరములో అయస్కాంతము వలె పనిచేస్తూ ఓజస్, తేజస్‌లను సృజించేటటువంటి మన నరములు, నాడులు, మెదడులో విద్యుత్ వలె సంచారము చేసేటటువంటి, ఆత్మలో టార్చిలైట్ వలె కాంతిని ప్రసరింపజేసేటటువంటి నాలుకపై మేఘముల వలె గర్జించేటటువంటి, మన వెన్నెముక మధ్యలో కుండలినీశక్తియై స్థిరంగా కూర్చునేటటువంటి తత్త్వము ఏదైతే ఉన్నదో అందులో ఇమిడియున్న ఈ శక్తులన్నింటినీ మనము రక్షించుకొనవలెనంటే కామేంద్రియము మీద నియంత్రణను సాధించవల్సి ఉంటుంది. మీ తేజస్సును మురికికాలువలోకి ప్రవహించకుండా అడ్డుకొనవల్సి ఉంటుంది.

## మంచి ఆరోగ్యము మన జన్మసిద్ధ అధికారము

మనస్సు చెప్పిన మాట వినకుండా నిరాకరించడము నేర్చుకోండి. అంటే సాధనలో మొదటి మెట్టు ప్రారంభమైనట్లే. ఇక దాని ఫలితములు మీకు లభించాలి. ఆహారవిహారములలో అనియంత్రణ పెరిగిపోయినట్లయితే అది మన శరీరమును నశింపజేస్తుంది. ఆవిధమైన అసంయమనాన్ని అడ్డుకొనగల్గితే ప్రకృతి మీకు మంచి ఆరోగ్యమనే వరమును ప్రసాదిస్తుంది. మంచి ఆరోగ్యము ప్రతి మనిషికీ జన్మహక్కు!

'స్వాతంత్ర్యము మన జన్మహక్కు!' అని బాలగంగాధర్‌తిలక్ ఘోషించినట్లుగా 'మంచి ఆరోగ్యము మన జన్మహక్కు!' అని మేము చెప్తున్నాము. తీక్షణమైన, సిద్ధాంతపరమైన, లోతైన, ఆదర్శపూరితమైన... ఆలోచనలను 'మంత్రము'తో సమానముగా భావించవచ్చు. మంత్రములో సంకల్పము, నిష్ఠ, సాహసము, ధైర్యము, సిద్ధాంతం, ఆదర్శము, దిశ.. మొదలైన అంశములన్నీ జోడింపబడి ఉంటాయి. అక్షరములను ముక్కలు ముక్కలుగా విడదీసి, కలిపి ఏదోవిధంగా తయారుచేసిన మాటను మంత్రము అనరు. అలాంటి మాటలను జపమాలతో త్రిప్పటము-అనుష్ఠానము అని అనిపించుకోదు. శ్రేష్ఠమైన ఆలోచనలు, ఆదర్శపూరితమైన ఆలోచనలు, సంకల్పయుక్తమైన

**మనస్సు బరువు దింపుకొనుటకై గురువులు, హితులు, సన్నిహితుల సాంగత్యాన్ని పొందాలి**

సరియైన ఆలోచనలను, క్రియాన్వితము చెయ్యకుండా ఉండలేనటువంటి ఆలోచనలను 'మంత్రము' అంటారు. అటువంటి మంత్రమును అనుష్ఠానము చెయ్యటము వల్ల 'అద్భుతాలు' సృష్టించబడతాయి.

## సిద్ధాంతములు, ఆదర్శముల క్రియారూపమే 'మంత్రము!'

సిద్ధాంతములు, ఆదర్శములను ఆధారముగా చేసుకొని ఒక ప్రణాళికను తయారుచేసుకొనటమే 'మంత్రము' అనబడుతుంది. ఆవిధముగా తయారుచేసుకున్న ప్రణాళికను క్రియాన్వితము చెయ్యటానికి అంగదుడు రావణుడి సభలో పాదం మోపి 'ఏదీ నా పాదమును కదిలించు చూద్దాము' అని సవాలు చేసిన విధముగా స్థిరసంకల్పముతో పని ప్రారంభించాలి. 'బీడీ తాగటము మానేస్తాను' అనుకుంటాడు ఒక వ్యక్తి, కానీ ఎక్కువకాలము ఆ మాట మీద నిలబడలేక ఏదో ఒక రోజు బీడీ తాగుతాడు. అలాంటిదాన్ని 'సంకల్పము' అనకూడదు. అది కేవలము కల్పన. సంకల్పమంటే మనిషిలోని నరనరమూ తనకు తాను ఆ సంకల్పమునకు అనుగుణముగా మలచుకుంటూ పనిచేస్తూ ఉంటుంది.

## జీవితమును మార్చివేసేదే 'సంకల్పము'

సంకల్పమనేది మనిషి యొక్క జీవన ప్రవాహమునే మార్చివేసేటంత తీవ్రముగా, ప్రభావవంతముగా ఉంటుంది. అది జీవనక్రియలను తారుమారుచేసేస్తుంది. ఇటువంటి మంత్రమును అనుష్ఠానము చేసేందుకే మేము ఇక్కడకు మిమ్మల్ని పిలిపించాము. మానవుడి సంకల్పాలను తీవ్రతరముగా గావించగలిగినటువంటి గాయత్రీమంత్రమును అనుష్ఠానము చెయ్యటానికీ, ఆహ్వానించటానికీ మిమ్మల్ని పిలిచాము. ఇది ఎట్లా సాధ్యమౌతుంది అనుకుంటారు మీరు. తప్పకుండా సంభవమౌతుంది. మేము ఎన్నటికీ మాట తప్పము.

**రఘుకుల రీతి సదా చలి ఆఈ ।**
**ప్రాణజాయ పర వచన నజాయీ ॥**

'పదిహేను నిమిషాలసేపు భజన చేసి మాకు మనస్సు లగ్నము కావటము లేదు' అంటారు మీరు. భోజనము చెయ్యటానికి, టీ త్రాగటానికి లగ్నము అవుతుందికదా? మరి భజనలో ఎందుకు లగ్నము కాదూ అంటే మీకు అందులో 'సంకల్పము' లేదని అర్థము.

మనస్సును నియంత్రించగలిగే ప్రక్రియనే 'మంత్రము' అంటారు.

మనస్సు ద్వారానే అన్నీ జరుగుతుంటాయి. మనస్సే మన యజమాని, సర్కస్‌లో యజమాని జంతువులను కొట్టీ కొట్టీ తన అదుపులోకి తెచ్చుకుంటాడు. వాటిచేత రకరకాల విన్యాసాలు, తమాషాలు, చిత్రాలు చేయించేవిధంగా వాటిని లొంగదీసుకుంటాడు. అదేవిధంగా మనము కూడా మనస్సును బాదిపడెయ్యాలి. మీ మనస్సును, స్వభావమును, చిత్తవృత్తులను కొరడా తీసుకుని కొట్టి కొట్టి నియంత్రణలోకి తీసుకురాగలిగే ప్రక్రియ ఏదైతే ఉన్నదో దానినే 'మంత్రము' అంటాము.

అనుష్ఠానరూపములో మంత్రమును ఉపాసన చెయ్యటానికి మిమ్మల్ని పిలిపించాము. మీరు మీ జీవితములో శరీరముపైన మంత్రమును ప్రయోగించగలిగితే, ఆరోపించగలిగితే, మీ ఆహారవిహారములను సంయమనము ద్వారా అదుపుచేసుకొని జీవితమును గడపగలిగితే మీ ఆరోగ్యము చక్కబడగలదని హామీ ఇస్తున్నాము.

ఇప్పటివరకూ మీరు చేసిన తప్పులను విస్మరించండి. కానీ ఇకముందు అలాంటి తప్పులు జరగకుండా ఉండే విధంగా ప్రణాళిక తయారుచేసుకోండి. ఆరోగ్య నియమములను పాటించండి. ప్రకృతికి అనుయాయులుగా జీవించండి. ప్రాకృతిక (ప్రకృతిపరమైన) నియమములను ఉల్లంఘించకండి. మీరు నమ్మకముతో ప్రతిజ్ఞ చెయ్యండి. మంత్రమును స్వీకరించండి. బదులుగా మంచి ఆరోగ్యమును పొందండి. మళ్ళీ మళ్ళీ చెప్తున్నాం. మంత్రము యొక్క అద్భుతాలను మీరు దర్శించగలరు.

## అసలు రోగములు ఎక్కడినుండి వస్తాయి?

మానవ జీవితములో శరీరము తరువాత ముఖ్యమైనది మన మనస్సు లేదా మెదడు. అది అనేకరకముల వ్యాధులతో ఆక్రమించబడియుంటుంది. మనకు 'సూక్ష్మశరీరము' అనబడే మరొక శరీరము కూడా ఉంటుంది. అది ఇంకా రోగగ్రస్తముగా ఉంటుంది. స్థూలశరీరమునకు వచ్చిన వ్యాధులు మన కంటికి లేదా వైద్యులకు కనపడతాయి. కానీ రెండవ రకము వ్యాధులు మన మనస్సుకు సంబంధించినవి. ప్రజలకు అందులో కొన్ని రోగముల గురించి మాత్రమే తెలుసు. పిచ్చాసుపత్రిలో, మనస్తత్వ శాస్త్రమునకు సంబంధించిన పుస్తకములలో కొన్ని మానసిక వ్యాధులను గురించిన వర్ణనలు ఉంటాయి. వాటి మాధ్యమంగా, అలాగే విజ్ఞానశాస్త్రము మాధ్యమముగా పిచ్చి, నిరాశావాదము మొదలైన మానసికవ్యాధులను గురించి తెలుసుకొనగలము. కానీ మనము అర్థము చేసుకొనలేని వ్యాధులు మరెన్నో ఉన్నాయి. *(సశేషము)*

*– అఖండజ్యోతి, అక్టోబరు 2014*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**అవమానాలు, ప్రతికూలతలు, నిందలు, అపజయాలు మనోభారాన్ని పెంచకుండా చూచుకో**

# అంతర్జాతీయ "యోగా" దినము 21 జూన్ 2015



అత్యంత హర్షదాయకమైన విషయమేమనగా మన ఋషుల యొక్క గొప్పతనానికి మూలసాధనమైన యోగవిద్య యొక్క (గొప్పతనాన్ని) విశిష్టతను కొన్ని రోజుల క్రితం ఐక్యరాజ్య సమితి గుర్తించింది. తదుపరి 21 జూన్ 2015 దినాన్ని అంతర్జాతీయ యోగా దినంగా జరుపుకొన నిశ్చయించుట అత్యంత హర్షదాయకమైన విషయము ఇది.

## భారతదేశ చిరకాల పోరాట ఫలితం

భారతీయ సంస్కృతి అందరి హితాన్ని మరియు అందరి సుఖాన్ని కోరెడి అత్యుత్తమ సంస్కృతి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా శారీరక, మానసిక, ఆత్మిక మరియు సామాజిక స్థితిగతుల మధ్య సమతుల్యతతో నిండిన జీవనాన్ని పరిపూర్ణ ఆరోగ్య జీవనంగా గుర్తించింది. పై నాలిగింటిలో మానవ ఆరోగ్యాన్ని సుస్థిరం చేయగల సామర్థ్యం ఒక్క "యోగ విద్య"కు మాత్రమే ఉన్నది. దీనిని ఆధారంగా చేసికొని ప్రాచీన కాలంలో భారతదేశం సమర్థవంతమైన దేశంగా ఎదిగి జగద్గురు పీఠాన్ని అలంకరించింది. దీని విశిష్టతను గుర్తించిన ఋషులు "యోగవిద్య"ను మానవ సంపూర్ణ వికాసానికి తగిన సాధనంగా మలిచి మన ముందుంచుట జరిగింది. దీని లక్ష్యం కేవలం మానవునికి రోగనివారణ ఒక్కటే కాదు. మానవునికి పరిపూర్ణ ఆరోగ్య సంరక్షణ చేయుట ద్వారా పరిపూర్ణ వికాసాన్ని సాధించుట దీని విస్తృత లక్ష్యం. నేటికాలంలో "యోగ విద్య"ను అత్యధికంగా శారీరక అవసరంగా పరిగణించి ఆదరించుట జరుగుచున్నది. కాని మానవ జీవన సంపూర్ణ వికాసానికై ఈ "యోగ విద్య"ను ఆచరణలోనికి తీసికొని రావలసిన అవసరం నేడు ఎంతగానో ఉన్నది.

## యోగ గురించి భగవద్గీత

***భావార్థము:*** కర్మ యొక్క కుశలత యోగా! యోగానుసారం ఈ కుశలత శారీరక వ్యాయామంతో ప్రారంభమై, అంతః కరణ శోధన ద్వారా, ఆత్మ-పరమాత్మల కలయికను సాధించుటతో సమర్థవంతంగా రూపొందుతుంది. ఈశ్వరుని సద్గుణాల సముచ్చయంగా మానవుని రూపొందించుటే దాని లక్ష్యము. అనగా యోగవిద్య మనల సద్గుణాల సంపన్నుల గావించి సత్కర్మ శీలురనుగా తయారు చేస్తుంది, మరియు నిష్కామకర్మ మార్గాన్ని అనుసరింప చేస్తుంది. అంతిమంగా ఆరోగ్య సమృద్ధ జీవనం ద్వారా మహామానవులనుగా మనల వికసింపజేస్తుంది.

"యోగ్చ్ఛిత్త వృత్తి నిరోధ్" - అనగా చిత్తవృత్తులను శాసించుటయే "యోగా" అని అర్థము. చిత్తవృత్తుల యొక్క చంచలత్వాన్ని నిరోధింపజేసి, "యోగవిద్య" మన యొక్క ప్రజ్ఞా పాటవాల దురుపయోగాన్ని, వివేకవంతంగా నిరోధించుటతో పాటుగా మనల జాగృతుల గావిస్తుంది. "యమ- నియమాల" పాటిస్తూ సామాజిక అనుశాసనాన్ని పాలిస్తూ "ధారణ-ధ్యాన" మరియు "సమాధి" లతో కూడిన యోగి జీవన విధానాన్ని అనుసరిస్తూ, ఆధునిక వైజ్ఞానికతను ప్రబోధించెడి మనుష్యులు ఎదుర్కొనెడి అనేకానేక సమస్యలకు దీటైన సమాధానమివ్వ గల్గెడిది ఈ యోగవిద్య ఒక్కటే. మనుష్యుల ఆలోచనలు దుష్ప్రవృత్తులతో నింపెడిది "కుయోగం" (చెడ్డయోగం) మరియు సత్ప్రవృత్తులతో నింపెడిది "సుయోగం" (మంచియోగం). యోగ విద్య మనల చెడుమార్గం నుండి మంచిమార్గం వైపు మరల్చి, ఉచ్ఛస్థితికి ఎదిగేలా తీర్చిదిద్దుతుంది.

యోగవిద్య ఋషులకు ఇట్టి ఉత్తమ స్థితిని కల్పిస్తూ విజ్ఞానాన్ని మరియు ఆధ్యాత్మికతల రెండింటిని సమర్థవంతంగా మేళవించింది. నేడు "యోగవిద్య" ప్రపంచంలో ఒక ఉత్కృష్ట జీవనశైలిని మనుష్యులలో ఆవిష్కరించింది. వ్యక్తిగత జీవనంలో ఆరోగ్యంతోపాటు, సంస్థాగత జీవనంలో ఆదర్శాలను నెలకొల్పుటలో "యోగవిద్య ప్రాధాన్యతను సంతరించుకున్నది. రోగోపచారాలతో మొదలుకొని యోగాలో అంతిమ స్థితియైన సమాధి యొక్క ఉచ్ఛస్థితిని పొందుట దీని ద్వారానే సంభవము.

యోగవిద్య ఒక రసాయనకర జీవనశైలితో కూడిన ఒక అద్భుత ప్రయోగం.

స్వామి వివేకానందుడు, మహర్షి అరవిందుడు యోగవిద్య యొక్క జీవనశైలి ఆధారంగా విశిష్ట వ్యక్తులుగా రూపుదాల్చారు. ఇదే క్రమంలో యుగ ఋషి పండిత శ్రీరామశర్మ ఆచార్య వర్యులు కూడా స్వయంగా యోగమయ జీవనాన్ని జీవించి

**స్వీయ విచక్షణ, విశ్లేషణలతో ఎప్పటికప్పుడు మనస్సును తేలికపరచుకో**

కోట్లాదిమంది వ్యక్తులను యోగవిద్య యొక్క పవిత్ర వ్యవహారిక జీవన మార్గంలో ముందుకు నడిపించారు.

భారతీయ యోగవిద్యకు మొట్టమొదటిసారిగా ఐక్యరాజ్య సమితిలో తగిన గుర్తింపు గౌరవము లభించింది. ఈ శుభ సందర్భంగా మనమంతా కలిసి ఈ యోగవిద్యను మరింత వ్యాప్తిగావించుటకై బాధ్యతను తీసికొందాం. అసలు సిసలైన యోగాభ్యాసకులుగా తయారై మనలోని జీవనీశక్తులను దురుపయోగం నుండి దారి మరల్చి సదుపయోగ మార్గంలో వినియోగిద్దాం. అంతర్జాతీయ యోగాదినాన్ని పురస్కరించుకొని ఉన్నతంగా పేర్కొన్న కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు మీ అందరికీ స్వాగతం - సుస్వాగతం!

జ్ఞానయోగిలా ఆలోచించు - కర్మయోగిలా పురుషార్థాల నెరవేర్చు - భక్తియోగిలా సహృదయతను పెంపొందించుకో! తద్వారా ఉద్భవించెడి, వికసించెడి సహనశీలతా శక్తులను, ఆత్మ కళ్యాణానికై, లోక కళ్యాణానికై వినియోగిస్తూ పీడితులను సంరక్షించు! ఇదే యోగవిద్యకు సార్థకత.

*- పండిత శ్రీరామశర్మ ఆచార్య*

## కార్యక్రమ వివరాలు

**ఉదయం 6.45 గం॥ల నుండి రాత్రి 9.30 గం॥ వరకు**
**"గాయత్రీ వేదిక నుండి ప్రారంభము"**

| | |
|---|---|
| 6.45 - 6.55 | ప్రార్థన<br>✪ హే ప్రభూ! తమ కృపాకరుణ నీడలో లబ్ధి పొందనీయండి. ✪ కోటి కోటి సద్బుద్ధిని అందరికీ అందాలి. ✪ నీతి నియమాల పాలన గావిస్తూ మేమంతా నీ వారమై జీవించెదము గాక! ✪ మీ నుండి శుభ ప్రేరణల పొందుదుముగాక. ✪ మా సుఖాన్ని ఇతరులకు పంచుతూ, ఇతరుల దుఃఖాన్ని తొలగించెడి సద్భావనలనిమ్ము! ✪ నిత్యం పుణ్యకార్యాలు చేస్తూ పాపాల నుండి మమ్ముల మేము రక్షించుకొనెదము గాక! ✪ హే ప్రభూ! గొప్ప చరిత్రను సృష్టించుటకై ఉజ్జ్వల భవిష్యత్తునిమ్ము! |
| 6.55 - 7.00 | గాయత్రీ మంత్రము లేక ఇష్టమైన నామ జపం 5 నిమిషాలపాటు |
| 7.00 - 7.30 | రాష్ట్ర నియమానుసారం యోగవిద్య |
| 7.30 - 7.45 | ప్రజ్ఞాయోగ వ్యాయామం (16 ఆసనాలు యొక్క 3 ఆవృత్తులు, స్థితిని బట్టి సూక్ష్మ వ్యాయామాలు |
| 7.45 - 8.05 | "అందరి కొరకు సులభమైన వ్యావహారిక సమగ్ర యోగ" అనెడి దానిపై ప్రసంగము<br>(లక్ష్యము: యోగవిద్య ద్వారా ఆరోగ్య దాయక శరీరం, స్వచ్ఛమైన మనస్సు తద్వారా చక్కని సంస్కారయుతమైన సమాజ నిర్మాణం)<br>ఆధారము: ఆత్మబోధ, తత్వబోధ, ఆత్మ చింతన, ఆత్మశోధన, ఆత్మనిర్మాణ మరియు ఆత్మ వికాసము |
| 8.05 - 8.10 | సంకల్పక్రమము |
| 8.10 - 8.50 | వృక్షారోపణ కార్యక్రమం (వీలును బట్టి సంకల్పించిన వ్యక్తుల సిద్ధంచేసి మొక్కల పంపిణీ, వీరు వర్షాకాలమందు ఆ మొక్కల నాటుట |
| 8.50 - 9.30 | "యోగా ర్యాలీ" (ఊరేగింపు) "యోగా యాత్ర" అవసరమైన సూచనలతో శాంతి పాఠము |

**సంకల్పం కొరకు విషయాలు:** (నిత్య జనజీవనంలో పాటించ వలసిన ఉత్కృష్ట వ్యవహారిక సూత్రాలు)

1) నియమిత సాధన, స్వాధ్యాయం, సంయమం మరియు సేవ అభ్యాసం 2) నిత్యము యోగవ్యాయామము 3) స్వచ్ఛత - శ్రమదానం 4) పర్యావరణ సంరక్షణ 5) వ్యసన ముక్తి - ముక్తి జీవనము

*<u>ఇతర వివరములకు సంప్రదించండి:</u>*

**గాయత్రీ తీర్థ్-శాంతికుంజ్, హరిద్వార్ - 249 411**
**(ఉత్తరాఖండ్)**
**వెబ్‌సైట్: www.awgp.org**
**గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట**
**హెచ్.పి.రోడ్, హైదరాబాద్ - 500 018.**
**ఇ-మెయిల్: gckhyderabad@gmail.com**

**అసాధ్యం అన్నచోటనే సుసాధ్యం కూడా ఉంటుంది. చేయవలసిందల్లా ప్రయత్నమే**

నా వారితో నా మాట

# జీవితం వివేకవంతంగా సాగాలి-మృత్యువు వైరాగ్యపూరితమై ఉండాలి



మన గాయత్రి పరివారం సాధనాపరులైన స్త్రీ పురుషుల సమూహం. అఖండజ్యోతి చదవడం, చదివించడం వల్ల ఈ సాధక కుటుంబ సభ్యుల్లో జిజ్ఞాస పోషించబడుతోంది. జీవన దర్శనాన్ని అర్థం చేసుకోవాలనే కుతూహలం అందరికీ పెరిగింది. యుగసాహిత్యం విస్తరిస్తున్న ఈ సంవత్సరం గురువుగారి సాహిత్యానికి సంబంధించిన విచార విమర్శలు పెరగడంతో పాటు, జీవితాన్ని జీవించేకళ పట్ల కూడా సుముఖత పెరుగుతోంది. నిజానికి మృత్యువుకు సంబంధించిన సత్యం అవగాహన అయ్యేంతవరకు జీవించేకళ అసంపూర్ణమైనదే. జీవితాన్ని స్వీకరించినంత సహజంగా మృత్యువును స్వీకరించినప్పుడే వ్యక్తిత్వంలో ఆధ్యాత్మికత అంకురిస్తుంది. పుట్టిన ప్రతి మనిషికి చావు తప్పదు అన్నది సత్యం. జన్మ మృత్యువుల ఇరుసుపైనే సృష్టిక్రమం కొనసాగుతోంది. భగవంతుడు కూడా భగవద్గీతలో ఇదే ఉపదేశించాడు. "జాతస్య హి ధ్రువో మృత్యుం."

జీవితేచ్ఛ ఎంత ప్రబలంగా ఉన్నా కూడా మృత్యువును తప్పించుకోలేము. ఈ సత్యాన్ని తోసిపుచ్చలేము, ఎదుర్కోకుండా తప్పించుకోలేము. మనసులో ఎంతటి అయిష్టత, భయం, పిసినారితనం, పిరికితనం ఉన్నా సహజమైన ప్రకృతి క్రమం ఆగదు. నేడు అత్యంత ప్రీతిపాత్రంగా అనిపించే సునిశ్చిత అస్తిత్వం, రేపు మహాశూన్యంలో విలీనం అయిపోతుంది. చావుకి భయపడే ఆత్రపరులు మాత్రం మిగిలిన కొద్ది క్షణాలు వీలైనంత ఆనందంగా గడపడం ఉత్తమం అనుకుంటారు. కాబట్టి భోగవిలాసాలకు, ఇంద్రియసుఖాలకు కావలసినంత సామాగ్రిని కూడబెట్టుకుంటారు. తప్పొప్పుల గురించి కూడా ఆలోచించరు. ముందుచూపు లేని వారి ఆత్రుత వల్ల సౌఖ్యం అనుభవించడం మొదలవుతుందో లేదో, అంతలోనే కొంపలంటుకునే స్థితి నెలకొంటుంది.

నేరస్థులు, దురాచారులకు ఎలాంటి దుర్గతి పడుతుందో ఈ మధ్యకాలం చూస్తూనే ఉన్నాం. కొంతమందికి వెంటనే శిక్షపడకపోవచ్చు. ఒక్కోసారి తాత్కాలికంగా తప్పించుకున్నట్టే అనిపిస్తుంది. కాని ఈశ్వర శాసనాన్ని, ప్రకృతి నియమాలను తారుమారు చేయలేం. కర్మఫలం ఆధ్యాత్మిక దర్శనాన్ని బట్టే కాదు, భౌతిక మనోవైజ్ఞానిక సిద్ధాంతాలతో కూడుకుని నిశ్చయించబడుతుంది. ఇలా కాకపోతే అలా దుర్మార్గులకు దుర్గతి పట్టక తప్పదు. బతికున్నంత కాలం విచ్చలవిడిగా ఖర్చుపెట్టి, అప్పు చేసి పప్పు కూడు తిని, తాగి తందనాలాడే నాస్తికవాదులకు చావు భయంకరంగా కనిపిస్తుంది, దానితోపాటు జీవితం కూడా భయంకరంగానే తయారవుతుంది. అంతులేని భోగాలు కోరుకుని, ఊహకందని కష్టములు కొనితెచ్చుకోవడం తెలివితక్కువతనం కాక ఇంకేమిటి? విచ్చలవిడిగా భోగాలనుభవించాలి అనుకున్నది మొదలు, తృప్తిని పొందేదాకా ప్రతిక్షణం భయం, ఆందోళన, అపరాధ భావం లాంటి భయంకరమైన భావాలన్నీ తోడుగా ఉంటాయి. లోటును భర్తీ చేసుకోవడానికి బదులు ఆనందాన్ని అనుభవించిన నిమిత్తం భయంకరమైన భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.

దీనివల్ల మృత్యుభయం అనేక రెట్లు పెరుగుతుంది. చచ్చేంత వరకు పూర్తిగా ఆనందించడానికి ఏం చేయాలన్నా వెనకాడరు, నీతి-అవినీతి, తప్పు-ఒప్పు అనేవి ఏవీ ఆలోచించరు. వారి దృష్టంతా కోరుకున్న ఆనందాన్ని దక్కించుకోవడం మీదనే ఉంటుంది. తలుచుకోకూడనివి తలుచుకోవడం, చేయకూడనివి కూడా చేయాలనుకుంటారు కాని సృష్టి ప్రక్రియ అలా కానివ్వదుగా! తృప్తిపడే లోపే ఏ రోగమో అంటుకుంటుంది లేదా ఆత్మ ఘోషిస్తూంటుంది. వీటి తీవ్రత వల్ల ఆనందాన్ని అనుభవించిన తృప్తే మిగలదు సరికద ఆ వేదన, పశ్చాత్తాపం అత్యంత బాధాకరంగా ఉంటుంది. ఇటువంటి ఆత్రం వల్ల జీవన్మరణాలు రెండూ భరించలేనివిగా మారతాయి.

ఒక్కరోజు చావు రుచి చూస్తే అయిపోయేదానికి బదులు ప్రతిపూట పశ్చాత్తాపం దహిస్తూంటే తట్టుకోవడం తెలివైనపని కాదు. ఆధ్యాత్మికదృష్టితో ఆత్మ అమరమైనదిగా నమ్మేవారు,

**నడక సాగాలంటే బరువు దించుకొనక తప్పదు**

మరణోత్తర జీవితం యొక్క నిజస్వరూపాన్ని విశ్వసించి, మృత్యువు అంటే బట్టలు మార్చుకోవడం వంటి సహజ ప్రక్రియ అని నమ్మేవాళ్ళకన్నా, నమ్మకుండా నాస్తికులుగా ఉండేవాళ్ళకే ఎక్కువ నష్టం.

ఊహించుకునేంత భయంకరమైనదేమీ కాదు మృత్యువు. సుఖ సౌఖ్యాలు సమసిపోతాయనే బాధనే మృత్యువును భయంకరంగా మార్చింది. కాని ఇప్పుడు ఆత్మ యొక్క కచ్చితమైన సత్యంగా నమ్ముతున్నారు. శరీరం ఒక జడపదార్థం, శరీరం అంతమవడంతోనే ఆత్మ అస్తిత్వం కోల్పోతుంది అనే అతి ఔత్సాహిక బుద్ధిజీవుల అపోహగానాలు ఇప్పుడు వినపడట్లేదు. పరిస్థితులు మారాయి. పునర్జన్మతోపాటు సూక్ష్మశరీరం ఉందనే ప్రమాణాలను తోసిపుచ్చటానికి లేదు. పుట్టుకతో వచ్చిన ప్రత్యేకతలన్నీ ఒకప్పుడు వంశపారంపర్యమని భావించేవారు. కాని ఇప్పుడు అవి పూర్వజన్మ యొక్క సంచిత సంస్కారాలు అని నమ్ముతున్నారు. ఈ శతాబ్దంలోని రెండవ దశకం వరకు ప్రగతి సాధించిన బౌద్ధిక, జ్ఞానతీవ్రత ఆధారంగా మరణోత్తర జీవితం స్వతహాగా నిరూపితమైనది. మరణోత్తర జీవితానికి సంబంధించిన ఎన్నెన్నో రహస్యములను పరామనోవైజ్ఞానికశాస్త్రం బయటపెడుతూనే ఉంది.

మృత్యువు తరువాత అస్తిత్వం లేదు కాబట్టి, బతికున్నప్పుడే తప్పొప్పులు పట్టించుకోకుండా భోగించాలి అని ఆలోచనా పరులు భావించరు. పరామనోవైజ్ఞానిక సిద్ధాంతాన్ని నమ్మినా, కర్మఫల సిద్ధాంతాన్ని నమ్మినా రెంటిపరముగా 'భోగవిలాసాలు' అనే అవివేకం సరైనది కాదు. అడ్డుఆపూ లేకుండా ఆనందించడం వల్ల కలిగే క్షణిక సుఖానికన్నా, తరువాత వాటిల్లే నష్టం చాలా బాధాకరంగా ఉంటుంది. ఈవిధంగా మృత్యువు గురించిన నిర్వచనం మృత్యువు అంటే భయపెట్టాలని కాదు. జీవించేకళతోపాటు, మృత్యుకళలో కూడా ప్రావీణ్యం అవసరం అని చెప్పడమే ఇక్కడ ఉద్దేశం. వివేకంతో జీవితంలో శాంతిని స్థాపించుకుంటే- వైరాగ్యంతో మృత్యువును ఆనందమయం చేసుకోవచ్చు.

చావు అంటే భయపడటం కన్నా, దాన్ని జీవిత సహచరిగా, సఖిగా అనుభవించాలి. అనంత జీవన ప్రవాహానికి విశ్రాంతి అనుకోవాలి. పరమాత్మవలెనే జీవితం కూడా సృష్టి ప్రవాహంలో అనాది, అనంతమైనది. రాత్రి పడుకున్నాక విశ్రాంతి తీసుకుని మళ్ళీ మర్నాడు క్రొత్త జీవితం మొదలుపెడుతున్నట్టే, మృత్యువు కూడా విశ్రాంతి సమయమే. దాని తరువాత క్రొత్త జీవితం ఆరంభమవుతుంది. రాబోయే రోజుల గురించి, భవిష్యత్తు గురించి అందరం ఆలోచిస్తూ ఉంటాం. అదేవిధంగా సుఖకరమైన మృత్యువు గురించి, మంగళకరమైన క్రొత్త జీవితం కోసం అవసరమైన ప్రయత్నాలు చేయాలి. సత్కర్మలను ఆచరించడం వల్ల మాత్రమే ఇది సాధ్యం. కాబట్టి జీవితాంతం పరిపూర్ణ తత్పరతతో సాధన చేస్తూ ఉండాలి.

పాత బట్టలు విడిచి క్రొత్తవి వేసుకుంటూంటే మనకేమాత్రం బాధగా ఉండదు, పైగా ఉల్లాసంగా ఉంటుంది. నేటి జీవితాని కన్నా భవిష్యత్తులో మరింత కోమలమైన, సరళమైన, ఉల్లాసభరిత జీవితం లభిస్తే నిరుత్సాహంగా ఎందుకుంటుంది. శరీరం, కుటుంబం అనే పరిధిలో గానుగకు కట్టిన ఎద్దు లాగా భారంగా తిరుగుతూ ఉండడం కన్నా, కొన్నాళ్ళు స్వేచ్ఛగా అంతరిక్షంలో విహరించే అవకాశం దొరుకుతుంది. ఈశ్వరునియొక్క అదృశ్య క్రియాకలాపాల సాన్నిధ్యం లభిస్తుంది. ఇటువంటి అద్భుతమైన పరిస్థితిని గురించి తలుచుకుని భయపడడమెందుకు? యాత్రలు, పర్యటనలు చేయాలనే ఉత్సుకత అందరికీ ఉంటుంది. అప్పుడు ఇంటిని వదలాలి, అలవాటైన జీవన క్రమం సాగించడం కుదరదు. విలక్షణమైన, క్రొత్త వస్తువులను చూడడంలో, క్రొత్తవారితో పరిచయం పెంచుకోవడంలో ఎంతో ఆనందం కలుగుతుంది. మృత్యువు, ఆ తరువాతి జీవితం గురించి కూడా ఇలాగే ఆలోచించాలి. ఆనందకరమైన యాత్రగా అనుభవించగలగాలి.

మృత్యువు తరువాతి జీవితాన్ని కళ్యాణకరంగా, ఆనందకరంగా ఉంచుకోవడానికి ఏ ప్రయత్నమూ చేయనివారే మృత్యువంటే భయపడతారు. తెలియని చీకటి గుహలోకి ప్రవేశించాలనే భయంకర ఊహ మనిషిని భయపెడుతుంది. రాబోయే కాలంలో అంతకన్నా పెద్ద విపత్తులను ఎదుర్కోవాలి అనే ఊహ మనిషిని మరింతగా భయపెడుతుంది. నేటి దురాచరణకు ఫలితం భయంకరంగా ఉంటుంది అని అదృశ్య చైతన్యం స్వార్థపరుల, అవినీతిపరుల అంతరాత్మను బెదిరిస్తూనే ఉంటుంది. ఇటువంటి సంకేతాలు, సందేశాలు మృత్యుభయాన్ని పెంచి వణికిస్తాయి.

మృత్యువు తరువాత జీవి యొక్క లెక్కలన్నీ పరమాత్మ ముందుంటాయి. ధర్మతూకం వేశాక శిక్ష, పురస్కారాలు

**నిత్యం నిన్ను నీవు అధ్యయనం చేసుకుంటూ ప్రగతి మార్గంలో పయనించు**

ఇవ్వబడతాయి. సర్వాంతర్యామి అయిన న్యాయాధ్యక్షుడి ఎదుట ఏదీ దాగదన్న విషయం అపరాధికి మానసికంగా తెలుసు. చేసిన పనులు, వాటి వెనుక ఉద్దేశాలు అన్నీ తెలుసు కనుక పక్షపాతం లేకుండా, అంటే ఎలాంటి జాలి, దయ లేకుండా ప్రాణి వాటి ఫలితాలను అనుభవించేందుకు బాధ్యుల్ని చేస్తారు. పరీక్షా సమయంలో ఏ ఫలితం వస్తుందో అచేతన మనస్సుకు స్పష్టంగా కనిపించినపుడు బలిపీఠంమీద కెళుతున్న బలిపశువు లాగా తల్లడిల్లిపోతాడు.

సత్కర్మలను ఆచరించినవారు, విభూతులను సద్వినియోగ పరచుకున్నవారు భవిష్యత్తు గురించి నిశ్చింతగా ఉంటారు. పదోన్నతి లభించేవారు ఆనందిస్తారు, బెంగపడరు. వెళ్తున్న చోట మరిన్ని సౌకర్యాలు, మరింత గౌరవం లభిస్తుందని వారికి తెలిసు. అందుకే పాత స్థానాన్ని వదులుతున్న బెంగ వారికి ఉండదు. వీడుకోలప్పుడు, దూరంగా వెళ్తున్నప్పుడు ఏదో క్షణిక బాధ మాత్రమే ఉంటుంది. పెళ్ళికూతురు కూడా అత్తారింటికి వెళ్ళేటప్పుడు పుట్టింటిని వదులుతూ బాధపడుతుంది, కాని అది కూడా క్షణికమే. అత్తారింట్లో లభించే ప్రేమ, గౌరవంతో అన్ని బాధలు మర్చిపోతుంది. అదేవిధంగా మంచి పనులు చేసినవారు కూడా ఆత్మీయులకు దూరమవుతున్నందుకు కాస్త బాధపడతారేమో కాని అదికూడా ఆనందమయ భవిష్యత్తును తలుచుకోగానే మర్చిపోతారు. ఇటువంటివారికి మృత్యువు అంటే పదోన్నతితో పాటు వచ్చే బదలీ లాంటిది.

మంచి ఉద్దేశాలతో, సత్కర్మలు చేస్తూ జీవించడమే సరైన విధానం. ఈ మార్గంలో పయనించేటప్పుడు అడ్డంకులు, ఇబ్బందులు లేదా విపత్తులు ఎదురైనా, చివరికి మృత్యువే ఎదురైనా వ్యాకులత చెందాల్సిన అవసరం లేదు. ఏదో ఒకరోజు చావక తప్పదు. ఆక్షణం ఎప్పుడు వస్తుందో ఎలాగూ తెలియదు. ఎలాగూ తప్పని మృత్యువు, మంచి ఉద్దేశ్యాన్ని రక్షించేటప్పుడు ఎదురైతే భయమెందుకు? మంచి జీవితాన్ని గడపడంలో ఆత్మతృప్తి ఉంటుంది. అనుసరించదగ్గ ఆదర్శాలను అందివ్వడం కుదురుతుంది, ధైర్యసాహసాలతో కూడిన మహామానవుల కోవలోకి చేరుస్తుంది. ఐతే జీవించేకళను నేర్చుకుంటూనే మృత్యుకళను కూడా నేర్చుకోవడం మీద దృష్టి సారించాలి.

దీన్నే సాధనాత్మక జీవితం అంటారు. ఇందులో ఎలాంటి తడబాటుకు చోటు లేదు. ఈ తథ్యం తెలియనివారు మాత్రం ఎన్ని మాలల జపం చేశాము, ఎన్నిసార్లు గుడికి వెళ్ళాము అనే లెక్కలతోనే సాధనను కొలుస్తారు. నిజానికి ఇవన్నీ సరైన కొలమానాలు కావు. ఎంత ఎఱుకతో, వివేకంతో జీవించాము అన్నదే కొలబద్ధ. వివేకముంటే జీవితం దానంతటదే విశాలమైన సన్మార్గంలో పయనిస్తుంది. ఇది సాధనాపరాయణ జీవితంలోని ఒక కోణం మాత్రమే. అంతర్చైతన్యంలో ఎంత వైరాగ్యం నిండింది అన్నది రెండో కోణం. వైరాగ్యం మనలో అనాసక్తిని సహజంగా నింపి ఉంచుతుంది. ఏదైనా వస్తువు కాని, మనిషి కాని, పరిస్థితి కానీ చేజారిపోతే మనసులో విషాదం అలుముకోదు.

నిజంగా సాధనాపరాయణులుగా ఉండాలనుకుంటే మాత్రం మృత్యువు-జీవితం ఈ రెండు విడదీయలేనివి అన్న సత్యాన్ని అనుభూతి చెందాలి. ఒకటున్న చోట ఎప్పుడో అప్పుడు రెండోది రాక మానదు. రెండూ పరస్పరపూరకాలు. జీవిత సాఫల్యానికి ఆధారం వివేకమైతే, మృత్యువు సాఫల్యానికి ఆధారం వైరాగ్యం. ఈ రెండింటినీ మనం జీవితంలోని ప్రతిక్షణం సమావేశపరచుకోవాలి. వివేక వైరాగ్యాలతో క్రోడీకరించిన, పోషింపబడిన ప్రణాళికాబద్ధమైన చక్కని జీవనపద్ధతిని నిర్ధారించుకుంటే జీవన్మరణాల రెండింటి అనుగ్రహం లభిస్తుంది. ఎంత ప్రావీణ్యతతో నిర్ధారించుకుంటే అంతటి సాధనాపరులైన దైవకుటుంబ సభ్యులుగా పేర్కొనబడే గౌరవం దక్కుతుంది.

*- అఖండజ్యోతి, మే 2015*

*అనువాదం: యం.వి. ప్రసాద్*

## ఆత్మమోక్షాన్ని పొందవలెనన్నచో...

*అనేకానేక దోష-దుర్గుణాలను, కషాయ-కల్మషాలను వర్గీకరించి విభజించినచో, వాని సంఖ్య వేల సంఖ్యను చేరుతుంది. కాని వీటన్నింటికి మూలం ఈ మూడే. అవి లోభం, మోహం మరియు అహంకారములు. వీని భవబంధనాల వలన మనిషి స్థూల, సూక్ష్మ మరియు కారణ శరీరాలు గట్టిగా బంధించబడ్డాయి. కావున పై మూడింటిని అనగా లోభ, మోహ, అహంకారాలను ఉన్మూలనం గావించనిదే ఆత్మ తన స్వతఃస్సిద్ధమైన స్వేచ్ఛను పొందజాలదు. అనగా మోక్షాన్ని పొందజాలదు.*

*- అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టుట అత్యంత శ్రేయోదాయకం**

ఆయుర్వేద వైద్యం-2

# అరటి గుణాల ప్రయోగం



అరటి పౌష్టికగుణాలతో నిండి ఉన్నది. అరటి యావద్దేశములో పండుతుంది, లభిస్తుంది. ఆయుర్వేదశాస్త్రానుసారం అరటిపండు మధురంగా ఉంటుంది. అఱుగుదల సమయం హెచ్చు.

మేధస్సు పెంచి, విషాన్ని హరించి, దాహార్తిని తగ్గించి, సోమరోగాన్ని నివారించి, క్షయ నివారణ చేస్తుంది. తేనెతో కలిపి అరటిని తిన్నచో మనిషిలోని జఠరాగ్ని మందగిస్తుంది. అందుచేత అరటిపండ్లను అతిగా భుజించ రాదు. అరటిపండ్లు తినుటకు మధ్యాహ్న సమయం ఉత్తమం.

అధిక సంఖ్యలో అరటిపళ్ళను తినుటవలన జీర్ణమగుటలో కష్టంగా ఉన్నచో 2-3 యాలకుల చీలికలను తినినచో అరటి పండ్లు త్వరగా జీర్ణమవుతాయి. గుండెజబ్బులున్నవారు రోజు కొక పండు తిన్నచో లాభకారిగా ఉంటుంది. అరటిపండ్లలో పొటాషియం, క్యాల్షియం ఖనిజలవణాలు, విటమిన్లు లభిస్తాయి. అరటి ఆక్సిడెంట్లు వ్యతిరేకి.

## గుణాలు - దోషాలు

అరటి కఫాన్ని కలిగించెడి, పొట్టలో వికారాన్ని కలిగించెడి గుణాన్ని కలిగి ఉన్నది. అరటిపండు పై తోలు పలుచబడినచో అది బాగా పండినది అన్నదానికి గుర్తు. అప్పుడు తినుటకు యోగ్యమైనదిగా ఉంటుంది. పై తోలు మందంగా ఉన్న అరటి పండు సగం పండినదని తెలుపుతుంది. అరటిపండు తిన్న తరువాత గంట వరకు నీటిని త్రాగరాదు.

## గృహములో ఉపయోగం

**1. అతిమూత్రవ్యాధి నివారణలో:** స్త్రీలకు సంబంధించిన అతిమూత్రవ్యాధి నివారణలో అరటి మిగుల లాభదాయనిగా నిలుస్తుంది. పండిన అరటిపండు తోలును ఒలిచి 250 గ్రాముల పాలలో కలిపి, దానిలో శతావరిచూర్ణాన్ని, విచారి కంద చూర్ణాన్ని 3-3 గ్రాములు కలిపి రోజు సేవించుట మంచిది.

**2. టైఫాయిడ్‌జ్వరం:** ఈ రోగపీడితునికి రోజువారి తీసికొనెడి భోజనాన్ని నిలిపివేసి, ఫలాల రసాలతో కూడిన దానిని 21 రోజులు తినిపించాలి.

మధ్యాహ్నం వేళ రోజు రెండు పండిన అరటి పండ్లను తీసికోవాలి.

**3. తెల్లబట్టవ్యాధి నివారణ:** ఈ రోగం వలన స్త్రీలు బలాన్ని మరియు ముఖవర్చస్సును కోల్పోతారు. దీని నివారణకై అరటిపండును బాగా గుజ్జుగా చేసి పాలతో కలిపి సేవించాలి. ముందుగా అరటిపండుతో మూడు గ్రాముల ఆవునెయ్యిని కలిపి రోజూ ఉదయాన్నే పరగడుపున 15 రోజులపాటు తీసికోవాలి.

**4. గుండెనొప్పి (హృదయశూల):** గుండెలోనొప్పి ప్రారంభమైన వారు (ఎంజాయినా) రోజు మధ్యాహ్న భోజనం తరువాత ఒక అరటిపండుతో 5 గ్రాముల తేనె కలిపి సేవించిన లాభకారిగా ఉంటుంది.

**5. అధికరక్తపోటుతో:** రక్తనాళాలను మృదువుగా తయారు చేయుటలో అరటిపండులోని పొటాషియం సహాయపడుతుంది. ప్రతిరోజు మధ్యాహ్నం రెండు అరటిపండ్లు తిన్నచో రక్తపోటు నియంత్రించబడుతుంది. తెల్లఉప్పును సేవించుట తక్షణం మానివేయాలి.

**పేశాబ్‌లో అడ్డంకి:** మూత్రం పోయెడి మార్గంలో ఆటంకమేర్పడి నొప్పి కలిగినచో- అరటిబోదెను నటికి 20 గ్రాముల రసాన్ని తీసి దానిలో 3 గ్రాముల నెయ్యిని కలిపి త్రాగినచో త్వరితగతిన లాభం చేకూరుతుంది. అడ్డంకి తొలగి మూత్రం వెలికివస్తుంది.

**ముక్కు నుండి రక్తం కారుట:** క్యాల్షియం లేమితో అధిక ఎండలో తిరిగినప్పుడు, సూర్యతాపానికి గురియైనచో ముక్కు వెంట రక్తస్రావం జరుగుతుంది. దీనిని నివారించుటకై కొన్ని రోజుల పాటు 2 అరటిపండ్లను ఒక గ్లాసు పాలలో గుజ్జులా కలుపుకొని షర్బత్‌లా త్రాగిన మంచి గుణకారి. (పంచదార కలిపినచో క్యాల్షియం నష్టమౌతుంది.) శుభ్రమైన పటికబెల్లాన్ని కలుపవచ్చు.

**విరేచనాల వేళ:** నీళ్ళవిరేచనాలగుచున్నప్పుడు అరటిపండు

**క్షణకాలం చాలు పరిస్థితులు మారటానికి కావున అనుక్షణం అప్రమత్తుడవై ఉండు**

మంచి ఉపకారం చేస్తుంది. బాగా పండిన 2 పండ్లను 25 గ్రాముల పెరుగులో బాగా కలిపి కొన్ని రోజులపాటు సేవించిన మంచి లాభకారి.

**లావు తగ్గుటకై – బరువు తగ్గుటకై:** రెండు నెలలపాటు గ్లాసు పాలలో 2–3 అరటి పండ్లు రోజు తిన్నచో లావు, బరువు తగ్గిపోతారు.

**సన్నవారు:** మిర్చి–మసాలా, నూనె లేక నెయ్యి ప్రయోగం రెండు నెలలపాటు నిషేధం.

**ఎసిడిటి:** ఎసిడిటి (ఆమ్లశాతం) ఎక్కువగా ఉన్నప్పుడు త్రేపులు వస్తూ ఉంటాయి. అన్నవాహికలో తీవ్రమైన నొప్పి కలుగుతుంది. రోజూ ప్రాతఃకాలమందు పుక్కిలింత క్రియద్వారా దానిని వెలికి తెప్పించాలి. మానసికశక్తికై కోపాన్ని నియంత్రించుటకు ధ్యానం చేయుట, సంగీత సాధన, సత్సంగం మున్నగువాని మాధ్యమంగా శాంతంగా, ప్రసన్నంగా ఉండుటకొరకై మిర్చి–మసాలా వాడకాన్ని నిలిపి సాత్విక భోజనాన్ని సేవించాలి.

పత్యం రూపంలో కొన్నిరోజులు చల్లని పాలలో అరటి పండును కలిపి తిన్నచో గుణం కనిపిస్తుంది.

**నోటి పూత నివారణ:** బాగా పండిన అరటిపండు గుజ్జును ఆవుపాలతో కాని లేక పెరుగుతో కానీ కలిపి గుజ్జుగా చేసి పరగడుపున సేవించాలి.

**చిన్నపిల్లలలో మట్టి తినెడి అలవాటును మాన్పుట:** క్యాల్షియం లేమితో చిన్నపిల్లలు మట్టిని తింటూ ఉంటారు. అట్టి పిల్లలకు తేనెతో కలిపిన ఒక అరటిపండును ప్రతిరోజు తినిపించినచో మట్టి తినుట నిలిచిపోతుంది.

**భస్మక్‌రోగం:** ఈ వ్యాధి వలన రోగి అవసరానికి మించి ఆహారాన్ని తింటూ ఉంటాడు. పండిన అరటిపండుతో 5 గ్రాముల నెయ్యిని కలిపి సేవించినచో త్వరగానే ఈ జబ్బు నివారింపబడుతుంది. నియంత్రణగా భోజనం చేస్తాడు.

**మొలలవ్యాధి:** 1) ఒక పండిన అరటిపండును తోలు ఒలిచి దానిలో అరగ్రాము భీమ్‌సేని శుద్ధ కర్పూరమును బాగా ఎనిపి, గుజ్జులా చేసి తినాలి. రెండువిధాలా లాభం కలుగుతుంది. ఈ ప్రయోగాన్ని 2–3 రోజులపాటు చెయ్యాలి. 2) ఎఱ్ఱ మిరపకాయలు, గరమ్‌మసాలాలు, శనగపిండి, మైదాతో తయారైనవి ఆరోగ్యానికి హాని చేస్తాయి. బదులుగా ఇంట్లో చేసిన సలాడ్, పచ్చికూరలు తినుట మంచిది. 3) పండిన అరటి పండును చీల్చి అర్ధ గ్రాము నూతిన ఆవాలపొడిని పరగడుపున తినాలి. ఒకటి రెండుసార్లు సేవించినంతనే రక్తస్రావం నిలిచిపోతుంది.

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## పాదుషా కర్తవ్య నిష్ఠ

*నసిరుద్దీన్ ఒక రాజ్యానికి పాదుషా (రాజు). ఐనప్పటికీ తీరిక సమయాల్లో టోపీలు తయారుచేసి వానిని విక్రయించగా వచ్చిన ధనంతో తన ఖర్చులను వెళ్ళబుచ్చుకొనేవాడు. అదేవిధంగా పాదుషా భార్య బేగం స్వయంగా భోజనాన్ని వండేది. ఒకసారి భోజనం తయారుచేస్తుండగా ఆమె చేయి కాలింది. అప్పుడు ఆమెలో ఒక ఆలోచన మెదిలింది. ఒక పాదుషాకి భార్యనై ఉండి తనకై ఒక పరిచారికను కూడా ఏర్పాటు చేయించుకొనజాలకపోయానే అని చింతించసాగింది. అప్పుడు తన భర్తయైన పాదుషాతో ఇట్లన్నది. 'తమరు ఇంత గొప్ప రాజ్యానికి ప్రభువు. మనకొరకు భోజనాన్ని తయారుచేయుటకై ఒక నౌకరును ఏర్పాటుచేయజాలరా?"అని ప్రశ్నించింది.*

*నసీరుద్దీన్ ఈవిధంగా జవాబిచ్చాడు. "బేగం! మీకొరకై ఒక నౌకరును నియమించగలను. కాని అప్పుడు నేను నమ్మిన సిద్ధాంతాలకు నేనే తిలోదకాలనిచ్చిన వాడినవుతాను. రాజ్యము, ధనము, ఈ వైభవము అన్నీ ప్రజలకు చెందినవి. మనము వీనికి కేవలం సంరక్షకులం మాత్రమే. దీనికి భిన్నంగా మన ప్రవర్తన ఉన్నచో మనము నమ్మకద్రోహులమవుతాం."*

*పాదుషా మాటలను విన్న బేగం సిద్ధాంతాల పట్ల పాదుషాకుగల గౌరవాన్ని మరింత పటిష్టపరిచే దిశగా సంపూర్ణ సమర్పణతో భర్త జీవిత లక్ష్యాలను నెరవేర్చుటలో తన సహాయాన్ని అందిస్తూ తన కర్తవ్యాన్ని పాలించసాగింది.*

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**గంగిగోవు పాలు గరిటెడైనను చాలు కడివడైననేమి ఖరముపాలు**

# స్ఫూర్తిదాయక గాయత్రీ పరివార్ సభ్యులు - 13

## శ్రీ గుండ్లపల్లి తిరునారాయణ శెట్టి, నెల్లూరు



శ్రీ గుండ్లపల్లి తిరునారాయణ శెట్టిగారు, నెల్లూరు పట్టణములో 21 జులై 1953లో శ్రీ శ్రీనివాసులు శెట్టి - రంగ నాయకమ్మ దంపతులకు జన్మించారు. వైశ్య వర్ణములో జన్మించుటచే వంశ ధర్మానుసారము వ్యాపార రంగానికి సంబంధించి విద్య బికామ్‌ను చదివారు. తండ్రి నుండి వారసత్వంగా సంక్రమించిన బియ్యం మిల్లు వ్యాపారాన్ని తన చేతులలోనికి తీసికొని దానిని ఇబ్బడిముబ్బడిగా పెంచారు. ఈ దిశగా వీరికి లక్ష్మీకటాక్షం పరిపూర్ణంగా లభించింది. కుటుంబ బాధ్యతలు పూర్తిగావించుకొని, తన సంతానం స్వయంపోషక మార్గాన్ని పట్టి నడిచేలా వారికి తగిన మార్గదర్శనం చేస్తూ వచ్చారు. వారికి ఆదర్శ తండ్రిలా నిలిచారు.

ఆర్థిక ఒడిదుడుకుల్లో పడుతూ లేస్తూ సుస్థిరత లేమితో నడుచుచున్న గాయత్రీ పరివార్ ప్రజ్ఞాపీఠము, నెల్లూరు శాఖను సుస్థిరత దిశగా నడిపించుటకు సమర్థుడైన వ్యక్తి సేవలు అత్యవసరమని భావించి, తగిన వ్యక్తి కొరకై అన్వేషించుచున్న శ్రీ అశ్విని సుబ్బారావుగారి దృష్టి శ్రీ తిరునారాయణపై నిలిచింది. 2011లో శ్రీ తిరునారాయణగారిని నెల్లూరు ప్రజ్ఞాపీఠము పరివార్ శాఖ సమావేశంలో జిల్లా కన్వీనరుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆనాటి నుండి నెల్లూరు శాఖ క్రమక్రమంగా బలాన్ని పుంజుకుంటూ ఆర్థికంగా సుస్థిరతను సాధించుట ప్రారంభించింది. వీరి హయాంలో శాఖకు ఆర్థిక క్రమశిక్షణను అందించారు శ్రీ తిరునారాయణగారు.

పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది వేడుకల సందర్భంగా శాంతికుంజ్ హరిద్వార్‌ను సందర్శించారు. దీనికి పూర్వము ఒకసారి శాంతికుంజ్‌ను సందర్శించారు. యుగశక్తి గాయత్రీ మాసపత్రికను 50తో ప్రారంభించి అనతికాలంలోనే (ప్రస్తుతం) 90 సంఖ్యకు చేర్చినారు. ప్రతినెలా క్రమం తప్పక శాఖ కార్యకలాపాలపై నివేదికను, హరిద్వార్ మరియు చేతనా కేంద్రానికి పంపెడి చక్కని ఆనవాయితీని నెలకొల్పారు.

అట్లే సేవా కార్యక్రమాల పరంగా ఉచిత హోమియో శిబిరాన్ని వారం వారం నిర్వహించుచున్నారు. దీని ద్వారా ఉచిత వైద్య సేవలు అనేకమందికి అందుచున్నాయి. అదే విధంగా భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష వార్షిక బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, పరివార్ ప్రముఖ కార్యకర్త అయిన శ్రీమతి భువనగారికి తగిన సహాయ సహకారాలనందిస్తూ ప్రోత్సహించుట ముదావహం.

ప్రజ్ఞాపీఠాన్ని నిర్వహించుటలో చక్కని, ఆదర్శవంతమైన, స్ఫూర్తిదాయకమైన పారదర్శకతను పాటిస్తూ పదుగురికి మార్గదర్శకంగా నిలిచి పని చేయుచున్న శ్రీ తిరునారాయణ పూజ్య గురుయుగ్మం ఆయురారోగ్యాలనందించి చిరకాలము సేవలందించేలా ఆశీర్వదించమని ప్రార్థించుచున్నది యుగశక్తి గాయత్రి.

## శ్రీ పింగిలి లక్ష్మారెడ్డి, సిర్పూర్ కాగజ్‌నగర్



శ్రీ పింగిలి లక్ష్మారెడ్డిగారు, 10 అక్టోబరు 1952లో శ్రీ వీరారెడ్డి-వెంకటమ్మ దంపతులకు కనిగరం గ్రా॥, కమలపూర్ మం॥, కరీంనగర్ జిల్లాలో జన్మించారు. ప్రాథమిక విద్యను కనిగరంలోను, ఉన్నతవిద్యను కమలాపూర్‌లోను, బి.ఇ.డి కోర్సును నల్లగొండ జిల్లాలో అభ్యసించుట జరిగింది. 1976 నుండి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు.

1984వ సంవత్సరంలో సిర్పూర్ కాగజ్‌నగర్‌లో 24 కుండముల గాయత్రీ యజ్ఞము మొట్టమొదటిసారి నిర్వహింప బడింది. దీనిలో శ్రీ లక్ష్మారెడ్డిగారు ఒక ప్రేక్షకునిగా పాల్గొన్నారు. అప్పుడు గుంటూరు జిల్లా నారాకోడూరు శక్తిపీఠాన్ని నిర్వహించుచున్న డా॥ తుమ్మారి శివరామకృష్ణారెడ్డి గారి సారథ్యంలో యజ్ఞం నిర్వహింపబడింది. వీరి ప్రవచనం ద్వారా మిగుల ప్రభావితం గావించబడ్డ శ్రీరెడ్డిగారు ఏకంగా 20 రోజులు నారాకోడూరు శక్తిపీఠంలో యజ్ఞం చేసెడి విధానాన్ని నేర్చుకొనుట జరిగింది. 2011లో మొదటిసారి గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌ను సందర్శనతో వీరికి గాయత్రీ పట్ల

**దర్భ మొన ఎంత సూక్ష్మంగా ఉంటుందో మనిషి తెలివి అంత సూక్ష్మతను కలిగి ఉండాలి**

పూజ్యగురుదేవుల కార్యక్రమాల పట్ల మరింతగా ప్రభావితులై మిషన్‌కు సమర్పణతో పనిచేయసాగారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో పూర్తి సమర్పణతో పనిచేయుచున్న శ్రీమతి పాండేగారికి చేదోడువాదోడుగా నిలచి, అచ్చటి గాయత్రీ పీఠాన్ని, దాని కార్యకలాపాల మరింత బలోపేతం గావిస్తూ పనిచేయసాగారు. ఒక ప్రక్క కుటుంబం పట్ల తన ఉపాధ్యాయ వృత్తి పట్ల తన కర్తవ్యాన్ని పోషిస్తూ, సమయం లభించినప్పుడు కేంద్రానికి తన సమయదానాన్ని ఇవ్వసాగారు. గురుదేవుల సాహిత్యాన్ని ఆకళింపు చేసికొని, తనతోపాటు, తోటి గ్రామీణ ప్రజానీకాన్ని మిషన్ కార్యక్రమాల పట్ల ఆకర్షితుల గావించుటకై తగినంత కృషి చేయుచున్నారు. గ్రామీణులలో ఎక్కువమంది అక్షర పరిజ్ఞానం లేనందున గ్రామీణులకు స్వాధ్యాయం పట్ల, సత్సంగాల పట్ల రుచిలేదు. వీరికి కోరికలు ఈడేర్చెడి దేవతల పట్ల, పూజల పట్ల, క్రతువుల పట్ల మక్కువ. ఇచ్చట సాహిత్య వితరణ ఫలించదు. దీనిని గుర్తెరిగిన శ్రీ రెడ్డిగారు గ్రామీణుల స్థాయికి దిగి వెళ్ళి వారి విశ్వాసాన్ని చూరగొనుటకై వారి మార్గంలో నడుస్తూ గాయత్రీ యజ్ఞాలు చేస్తూ వారిని ఆకట్టుకొనుట మిగుల అభినందనీయము. అచ్చటి వారికి విగ్రహ పూజల పట్ల మక్కువ ఎక్కువ.

పై సుదీర్ఘ అనుభవాలను దృష్టియందిడుకొని, గాయత్రీ మందిర నిర్మాణాన్ని కాగజ్‌నగర్‌లోని ప్రముఖుల సాయంతో ప్రారంభించారు. వీరికి శ్రీమతి పాండేగారు మరియు ప్రముఖ వైద్యులు డా॥ సత్యన్నారయణరెడ్డిగారు అండదండగా నిలిచి మందిర నిర్మాణంలో తమ వంతు సహకారాన్ని అందించుచున్నారు.

రానున్న ఆరుమాసాలలో అనగా జనవరి 2016 కన్యాకుమారి అశ్వమేధ మహాయజ్ఞ సమయానికి సిర్పూర్ కాగజ్‌నగర్ మందిర నిర్మాణాన్ని పూర్తిగావించి, గాయత్రీమాతను ప్రతిష్ఠింపజేసికొని అశ్వమేధానికి తరలివెళ్ళెడి ప్రయత్నములు చేస్తున్నారు. ఇట్టి వీరికి వీరి పరివారానికి పూజ్య గురుయుగ్మము ఆయురారోగ్య ఐశ్వర్యాలనందించి వీరి మనోభీష్టాన్ని సిద్ధింప జేయవలసిందిగా యుగశక్తి గాయత్రి ప్రార్థించుచున్నది.

---

## మనలోని భావాలు మలినమైనప్పుడే హృదయ భారం పెరుగుతుంది

*ఒకానొక మహాత్ముడు (సాధువు) ప్రవచనం చెప్తున్నారు. వినటానికి వచ్చి ఆయన ఎదుట ఆసీనులై ఉన్న శ్రద్ధాళువులు ఆయన ముందు ఒక సమస్యనుంచారు. "స్వామీ! కొందరిపట్ల మన హృదయంలో ద్వేషం ఏర్పడుతుంది. దానిని తొలగించడం ఎలా?" ఇది వారి సమస్య. సాధువు "రేపు మీరు ఇక్కడకు వచ్చేటప్పుడు ఒక సంచీ నిండా బంగాళాదుంపలు తీసుకురండి. మీరు ద్వేషిస్తున్న వ్యక్తుల పేర్లు ప్రతి ఒక్క బంగాళాదుంపపైన వ్రాయండి" – అని వారికి చెప్పాడు. సరే! మరుసటిదినం శ్రద్ధాళువులంతా తమ వెంట బంగాళాదుంపలతో నిండిన సంచీలు తీసుకొని వచ్చారు. తాము ఎవరెవరినైతే ద్వేషిస్తున్నారో, వారి పేర్లు ఒక్కొక్క బంగాళాదుంపపైన వ్రాశారు. అప్పుడు సాధువు వారితో "ఈ సంచులను వదలిపెట్టకుండా రాత్రింబవళ్ళు మీతోనే ఉంచుకోండి" – అని చెప్పాడు.*

*సత్సంగానికి వచ్చిన వారందరూ ఈ ఆజ్ఞను పాటించారు. రెండు మూడు రోజుల వరకూ ఎలాంటి ప్రత్యేకతా లేకుండా గడచిపోయింది. కానీ ఆ వారం చివరి రోజుకు చేరుకునేసరికి అన్ని సంచులలోని బంగాళాదుంపల నుండి దుర్వాసన రావటం ప్రారంభమైంది. అందరూ కలిసి సాధువు చెంతకు వచ్చి 'ఏమి స్వామీ! ఇటువంటి విచిత్రమైన పనిని మాకు అప్పగించారు. దుర్వాసన వస్తున్న ఈ బంగాళాదుంపలను మేము ఎన్ని రోజుల వరకూ ఉంచుకొనవలసి ఉంటుంది?' అన్నారు.*

*"కేవలం పేర్లు మాత్రమే వ్రాయబడిన ఈ బంగాళాదుంపలను వారం రోజులు మీ వద్ద ఉంచుకుంటేనే ఇంత దుర్గంధం వస్తున్నది. మరి ఈ వ్యక్తుల పేర్లను ఈర్ష్యాద్వేషాలతో పాటు మీ అంతరంగంలో ఉంచుకొనటం వల్ల మీ హృదయం నుండి ఎంతటి దుర్గంధం వెలువడుతుందో తెలుసుకొనగలరా? భావాలు మలినమైనపుడు హృదయ భారం పెరుగుతుందే కానీ తరగదు" – అని సాధువు సమాధానమిచ్చాడు. ఆయన అప్పగించిన పనిలోని అంతరార్థం బోధపడగానే, అందరికీ జీవితంలో ఒక ముఖ్యమైన అంశాన్ని గురించిన అవగాహన లభించింది.*

*– అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

---

**ధర్మం ఒక్కటి తెలిస్తే చాలదు. దానిలోని ధర్మ సూక్ష్మాలు కూడా తెలియాలి**

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## పరమపూజ్య గురుదేవులు వేదమూర్తి, తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మ ఆచార్య సాహిత్య వితరణ

చీరాల వాస్తవ్యులు ప్రకాశం జిల్లా ఆం.ప్ర. శ్రీమతి మరియు శ్రీ అడ్డగడ మల్లిఖార్జునరావు వెంకటరత్నం దంపతుల ఏకైక కుమారుడు చిరంజీవి రాజేష్‌తో

చెరువు జమ్ములపాలెం గ్రా॥, బాపట్ల (మం॥), గుంటూరు జిల్లా శ్రీమతి మరియు శ్రీ మద్దినేటి శ్రీనివాసరావు - అరుణ దంపతుల కుమార్తె చి॥ల॥సౌ॥ కుమారి సింధుజ వివాహం సందర్భంగా (03.05.2015 వివాహం) పరమపూజ్య గురుదేవుల విరచిత రూ. 13,275/-ల విలువ గల సాహిత్యాన్ని వితరణ చేసి, పూజ్యగురుదేవుల యుగనిర్మాణ యోజనలో తమ వంతు కర్తవ్యాన్ని పూర్తిచేశారు. నూతన వధూవరులకు వారి మాతా పితరులకు పూజ్యగురుయుగ్మం యొక్క ఆశీస్సులు, అనుదానాలు లభించాలని గాయత్రీ చేతనాకేంద్రం మనసారా కోరుచున్నది. ఆ గురుయుగ్మాన్ని ప్రార్థించుచున్నది.

## కొత్తపాలెంలో

గాయత్రీ శక్తిపీఠము, కొత్తపాలెం గ్రా॥, చెరుకూరు గ్రామ శివారు, ప్రకాశం జిల్లా, చతుర్థ వార్షికోత్సవ వేడుకలు ఏప్రిల్ 24వ తేది 2015 శనివారమునాడు జరిగాయి.

20వ తేది కలశయాత్రతో వేడుకలు ప్రారంభమై 21వ తేది 24 కుండముల గాయత్రీ యజ్ఞముతో ముగిశాయి.

శక్తిపీఠము ఆయేటికాయేడు తన ప్రాచుర్యాన్ని తన ప్రాధాన్యతను వ్యాప్తిచేసికొంటూ, చుట్టుప్రక్కలనున్న దాదాపు 30 గ్రామాలలో పరిజనులకు తన అభయహస్తాన్ని, ప్రేమ దృక్కులను అందించింది. దీనితో వీరికి శక్తిపీఠము పట్ల అవ్యాజమైన భక్తి ప్రపత్తులు పెరిగి, తమలోని అజ్ఞానపు తెరలు తొలగిపోవుచుండగా జ్ఞానమార్గము వైపు వారు అడుగులు వేయుట ముదావహము. తత్ఫలితముగా శక్తిపీఠమును బలోపేతము చేసెడి దిశగా పరిజనులు తమ వంతు అంశదానాలను, సమయ దానాలనందిస్తూ, గురుదేవులు అందజేసిన నాటు-కోసుకో అనెడి ధర్మసూక్ష్మాన్ని ఆచరణలో పెట్టుట అత్యంత విశేషము. అన్నింటి కన్నా విశిష్టమైన అంశము కొత్తపాలెం గ్రామములోని ప్రజలు ఆయేటికాయేడు గాయత్రీ శక్తిపీఠము పట్ల ఆకర్షితులు అగుట మిక్కిలి ఎంచదగ్గ పరిణామము.

ఈ సంవత్సరమును శాంతికుంజ్‌వారు సాహిత్య విస్తార సంవత్సరముగా ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని, చుట్టుప్రక్కల గ్రామాలలో జరిగెడి పుణ్యక్రతువుల సమయమందు కొత్తపాలెం శక్తిపీఠంవారు పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని ఆయా ప్రదేశాలలో విక్రయాలు ప్రారంభించుట అభినందనీయము.

శక్తిపీఠ నిర్మాణమందు, రోజువారి పర్యవేక్షణలో పూర్తి శ్రద్ధాసక్తులతో పనిచేయుచున్న శ్రీయుతులు కళ్ళం సింగారెడ్డి, శ్రీ అంజిరెడ్డి, శ్రీ రమణరెడ్డి, శ్రీమతి గోవర్ధన, శ్రీమతి పుష్ప, శ్రీమతి రమాదేవి మున్నగువారు అభినందనీయులు.

### గొప్ప పనుల నిర్వహణ ఓర్పు సహనాలతోనే సుసాధ్యం

*వ్యాసభగవానుడు - గణేశుని ద్వారా మహాభారతాన్ని వ్రాయించాడు. మహాభారతగ్రంథం వ్రాయుట పూర్తియైన పిదప వ్యాసుడు - శ్రీగణేశుడిని ఇలా అడిగాడు 'మహానుభావా! నేను 24 లక్షల శబ్దాలు చెప్పగా మీరు వ్రాశారు, కాని మీరు మధ్యలో ఒక్క శబ్దాన్ని కూడా చెప్పకపోవుట నాకు ఆశ్చర్యాన్ని గొల్పింది.' దీనికి గణేశుడు బదులిస్తూ "బాదరాయణా! గొప్ప పనిని నిర్వహించేవేళ శక్తి అవసరమవుతుంది. ఈ శక్తి సముపార్జనకు సహనము, ఓర్పు మూలాధారం! ఈ ఓర్పు, సహనము సమస్త సిద్ధులను ఒనగూర్చుతుంది. వాక్కు (సమయం)లో సహనము లేనిచో తమ యొక్క ఈ మహాభారతగ్రంథము ఏవిధంగా పూర్తయ్యేది."*

*- అనువాదం: ఎ. శారద*

**అగ్ని శేషం, శత్రుశేషం, ఋణశేషం ఉండరాదు**

# 9 రోజుల సంజీవిని సాధనా శిబిరముపై నివేదిక మరియు ప్రవచనముల పాఠము

ప్రతి సంవత్సరము తెలుగు భాషా మాధ్యమంగా నిర్వహించెడి 9 రోజుల సంజీవిని సాధనా శిబిరము 11 మే 2015 నుండి 19 మే వరకు గాయత్రీతీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్‌లో నిర్వహింపబడ్డది. దీనిలో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రెండు రాష్ట్రాల నుండి పరిజనులు 150 మంది వరకు పాల్గొన్నారు.

దీనిలో పాల్గొన్న వారిచే 10 మే 2015 తేది ఆదివారము సంకల్పము చేయించారు.

**11 మే 2015 సోమవారము:** ఉ।। 9.30 గం।।లకు 9 రోజుల సంజీవిని సాధనా శిబిరము శ్రీ మహాజన్‌గారి ప్రవచనముతో ప్రారంభమయింది. పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య మనుజులలో దైవత్వాన్ని వికసింపజేసి తద్వారా భూమిని స్వర్గంగా మార్చెడి సంకల్పాన్ని చేబూనారు. దీనిలో భాగంగా, గాయత్రీ పరివార్‌ను స్థాపించి, తద్వారా ఈ 9 రోజుల సంజీవిని శక్తిని కార్యకర్తలలో నింపి వారిని సిద్ధము చేసి సమాజ సంస్కరణకై శ్రీకారం చుట్టారు. భారతీయ సంస్కృతికి మరోపేరు దేవ సంస్కృతి – అత్యంత పురాతన మైనది, ప్రభావశీలి. దీనిని పునరుద్ధరించి, తద్వారా భారత దేశానికి విశ్వగురు పీఠాన్ని అందించాలనెడి దివ్య సంకల్పం దాని వెనుక దాగి ఉన్నది. 21వ శతాబ్ది ఉజ్జ్వల భవిష్యత్. "గాయత్రీ యజ్ఞము" భారతీయ సంస్కృతికి తల్లి మరియు తండ్రి – "గాయత్రీ" అనగా సద్బుద్ధి. దీనిని బాల్యంలో అందించేది తల్లి – అట్లే యజ్ఞము అనగా సత్కర్మ దీనిని బాల్యం నుండి తండ్రి సంరక్షణలో బిడ్డ పొందుతాడు. అనగా మనమంతా గాయత్రీ యజ్ఞ విద్య ద్వారా మంచి సంస్కారాలను, తద్వారా మంచి పనులను చేయగలము. లాల్ మషాల్, గాయత్రీ పరివార్ చిహ్నాన్ని చూచినచో, లాల్ మషాల్ నీడలో జాతి, వర్ణ, లింగ, కుల, మత, భాష, ప్రాంత భేదాలు లేకుండా ప్రజలంతా ఒకచోట చేరి గాయత్రీ యజ్ఞ విద్య మరియు గాయత్రీ మంత్రం ద్వారా ఒక నూతన యుగాన్ని, చక్కగా సంస్కరింప బడిన మానవజాతిని అనగా దైవీశక్తి సంపన్నుల తయారు చేయుట లక్ష్యం. ఈ రెండు ప్రక్రియల మాధ్యమంగా మనుష్యుల చుట్టి వైచిన కపట, కల్మషాలను పూర్తిగా తొలగించి, వారి అంతఃకరణలను ఉత్తమ భావ సంవేదనలతో నింపి తదుపరి పరివ్రాజకులనుగా సమాజానికి అందించుటయే ఈ శిక్షణా శిబిర లక్ష్యము.

మిత్రులారా! ప్రపంచంలో అనేకానేక శిక్షణా శిబిరాలున్నాయి. వీటన్నింటికి భిన్నంగా మానవులను బాహ్యంగా శుద్ధి చేసి అంతర్ముఖంగా శారీరక, మానసిక వైజ్ఞానిక బలాలను లేక శక్తిని పెంపొందించుట జరుగుతుంది. అదేవిధంగా ఇచ్చట మనిషిలో మసిబారియున్న మానవత్వాన్ని శుభ్రపరచి, మేల్కొల్పి తదుపరి మస్తిష్కాన్ని సంస్కరించి, భావ సంవేదనల రగుల్కొల్పి, తద్వారా దైవీలక్షణాలను వారిలో పెంపొందింపజేసి, మనీషులనుగా, మహామనీషులనుగా తీర్చిదిద్దెదరు. అప్పుడు వీరిలో ఆధ్యాత్మిక శక్తి వికసించి, ప్రతివారు, వారి సమస్యలను వారే పరిష్కరించుకొనెడి స్థాయికి ఎదుగుతారు. తమను తాము సంస్కరించుకొనెడి స్థాయిని అందుకొంటారు.

దీనికై పూజ్య గురుదేవులు గాయత్రీ మంత్రానుష్ఠాన ప్రక్రియను ప్రవేశపెట్టారు. ఒక లక్షా ఇరువది నాలుగువేల సార్లు గాయత్రీ మంత్ర జపాన్ని 40 దినములలో ఏకబిగిన పూర్తి చేయాలి. ఇది చెయ్యలేని వారు లఘు అనుష్ఠానాన్ని చేపట్టి నిర్ణీత సమయంలో 24వేల సార్లు గాయత్రీ మంత్ర జపాన్ని పూర్తిచేయవలసి ఉంటుంది. నియమాల పాటిస్తూ సవితా దేవతను అనగా సూర్యుని ఉపాసన చెయ్యాలి. ప్రాతః కాలములో మూడు శరీరాల ధ్యానం, మధ్యాహ్నంవేళ జ్యోతి సాధన తిరిగి సాయంత్రం నాదయోగ సాధన తప్పనిసరి. దీక్షా కాలములో దీనివలన సాధకునికి అపారశక్తి అందుబాటు లోనికి వస్తుంది. దీనికి పూజ్యగురుదేవుల సాధన ఒక చక్కని ప్రేరణతో కూడిన మార్గదర్శనం. ఆయన తన 8వయేట గాయత్రీ మంత్రదీక్షను తీసికొని, నియమానుసారం గాయత్రీ మంత్ర జపాన్ని ప్రారంభింపగా, ఆయన 15వయేట ఆయన అనేక జన్మల గురువైన శ్రీశ్రీశ్రీ సర్వేశ్వరానందుల వారు ప్రత్యక్షమై మార్గదర్శనాన్ని అందించారు.

బ్రహ్మ, సృష్టి ప్రారంభానికై, మార్గదర్శనం కొరకు గాయత్రీ మంత్ర జపాన్ని ఆశ్రయించాడు. అదే రీతిలో నవయుగ నిర్మాణానికై భూమిపై స్వర్గావతరణకై 24 సంవత్సరాల పాటు కఠోర నియమనిష్ఠల పాలన ద్వారా, గాయత్రీ మంత్ర జపాన్ని చేస్తూ 24 పురశ్చరణలు పూర్తిచేసి పూజ్యగురుదేవులు సిద్ధి

**విద్యను, ధనాన్ని అనుక్షణం సంపాదిస్తుండాలి**

పొందారు. శ్రీరామశర్మఆచార్యగారు కఠోర ఆహార నియమాలతో అస్వాదు భోజనాన్ని (ఉప్పు, తీపిలేని) తపస్సు కాలమందు స్వీకరించారు. ఇంద్రియ, ఆహార, సంయమ, ఆలోచనా సంయమాల పాటించారు. చివరగా తాను గాయత్రీగా మారిపోయారు. ఇంతటి అద్భుత శక్తి సముపార్జన ద్వారా, నేడు మనకు భౌతికంగా కనిపించుచున్న ఊహకందని ఈ గాయత్రీతీర్థం-శాంతికుంజ్‌ను, దేవసంస్కృతి విశ్వ విద్యాలయాన్ని, విశ్వవ్యాపిత అపార గాయత్రీ పరివారాన్ని నిర్మించారు. గాయత్రీ మంత్ర జప మహిమను అది అందించెడి ఫలితాలను అంచనా వేయుటకు ఇంతకు మించిన సజీవ ఉదాహరణ మరొకటి లేదు.

మిత్రులారా! ఈ తొమ్మిది రోజుల శిబిరంలో పూజ్య గురుదేవులు తన సూక్ష్మశరీర రూపంలో ఉండి మిమ్ముల గాయత్రీ మంత్ర జపమత్తుకు లోనుగావించి, మీ మనస్సులో, హృదయంలో తద్వారా అంతరంగంలో తగిన శస్త్ర చికిత్సలు నిర్వహించి, తన ఆలోచనలను, విచార ధారలను మీ మీ అంతరంగాలలో చొప్పించి మిమ్ములను ఒక చక్కని సంస్కార వంతులైన మానవులనుగా, మణిమాణిక్యాలుగా, చైతన్య స్వరూపులనుగా, జాగృతాత్మలగా మలచి పంపుట ఖాయం. దీనికై మీరు మిమ్ములను సంపూర్ణంగా సమర్పించుకొనుటకై సంసిద్ధంగా ఉండాలి. ఇది తప్పనిసరి. అప్పుడు పూజ్య గురుదేవులు, తన కార్యాచరణ ప్రణాళికకు చేయూతనిచ్చెడి పరిజనుల వ్యక్తిగత సమస్యలను తాను తన భుజానికెత్తుకొని పరిష్కరించెదనని ఇచ్చిన మాటను ఆచరణలో చూపిస్తారు. ఇది యదార్థం. దీనిపై పరిపూర్ణ విశ్వాసముంచి పని చేయండి. ఈ శిబిరంలో అరమరికలు, అపనమ్మకాల వీడి సంపూర్ణ విశ్వాసంతో, ఏకాగ్రతతో పాల్గొనండి. విజయపథాన నడవండి. మీకు శుభమగుగాక.

*(రాబోయే సంచికలో రెండవ ప్రవచనం...)*

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

## గోదావరి పుష్కరాలు - 2015 సమయదానీలకు ఆహ్వానము

*మిత్రులారా!*

*14 జులై 2015 నుండి ప్రారంభమై, జులై 25తో పూర్తికానున్న గోదావరి నది ఆది పుష్కరాలు పురస్కరించుకొని గాయత్రీ చేతనా కేంద్రం, హైదరాబాదు వారి సారథ్యములో భద్రాచలం మరియు రాజమండ్రి పట్టణాలలో పితృతర్పణ కార్యక్రమాలు, యజ్ఞము మున్నగు కార్యక్రమాలను 12 రోజుల పాటు నిరంతరము చేయుటకై తగిన ఏర్పాట్లు జరుగుచున్నవి. 15 జూన్ 2015 నాటికి సంపూర్ణ సమాచారాన్ని తెలిపెడి కరపత్రములు, ప్రచార సామాగ్రిని గాయత్రీ పరివార్ సక్రియ కార్యకర్తలకు అందించుటకై తగిన ఏర్పాట్లు జరుగుచున్నవి. మే నెల యుగశక్తి గాయత్రి మాసపత్రికలో ప్రచురించిన "గోదావరి పుష్కరాలు 2015" భారీ కార్యక్రమములో పాలు పంచుకొనెడి క్రియాశీలక కార్యకర్తలు వారి పేర్లను సంపూర్ణ చిరునామా సెల్‌ఫోన్ నంబర్ల తెలుపుచూ ఈ క్రింది చిరునామాకు వివరములను గాయత్రీ శక్తిపీఠాల ద్వారా, ప్రజ్ఞామండలుల ద్వారా లేక నేరుగా తెలుపవలసినదిగా కోరడమైనది. జూన్ 15వ తేదినాటికి తెలుప ప్రార్థన.*

*పేరు & చిరునామా ..........................................................................................*

*వయస్సు ........... విద్యార్హతలు ........................................ సెల్ నెం ..............................*

*సమయదానమిచ్చెడి వివరాలు ...............................................................................*

*................................ తేది నుండి ............................ తేది వరకు*

*భద్రాచలం / రాజమండ్రి ................................................... ఎచ్చట సమయదాన మిచ్చెడిది.*

***మీకు గల అనుభవము:** యజ్ఞము చేయించుట/సంస్కారాలు చేయించుట/శ్రాద్ధ తర్పణలు చేయించుట/సేవా కార్యక్రమాలు*

ఇట్లు - **అశ్విని సుబ్బారావు,** ప్రధాన సంచాలకులు

*గాయత్రీ చేతనా కేంద్రము, హెచ్.పి.రోడ్, మూసాపేట, హైదరాబాద్ - 500 018.*

***E-mail: gckhyderabad@gmail.com***

**చిన్న మొత్తాలను పొదుపు చేస్తూపోతే ఒకనాటికి అది గొప్ప సంపదగా ఎదుగుతుంది**